www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కాళేశ్వరం కేసును సీబీఐకి ఇవ్వాలి



వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తాం

బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్య

అసెంబ్లీ ఆవరణలో పార్టీ శాసనసభాపక్ష కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేల భేటీ 14

శనివారం | 30-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 152 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా.10.47 తదుపరి అష్టమి; నక్షత్రం: విశాఖ మ.2.37 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.7.05-8.52; దుర్ముహూర్తం: ఉ.6.04-7.43; అమృతఘడియలు: శేషం ఉ.6.31 వరకు, మరల తె.5.49; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.26

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వాడీవేడిగా వర్షాకాల సమావేశాలు

నేటి నుంచి అసెంబ్లీ



తొలి రోజు మాగంటి గోపీనాథ్‌కు నివాళి

అనంతరం బీఏసీ సమావేశం

తర్వాత కమిటీ హాల్లో మంత్రివర్గ భేటీ

స్థానికంలో బీసీలకు 42% రిజర్వేషన్లపై చర్చ

జీవో ఇచ్చి ముందుకు వెళ్లే అవకాశం?

40 రోజుల్లో ముగియనున్న ఎన్నికల ప్రక్రియ!

'కాళేశ్వరం' నివేదికపైనా అసెంబ్లీలో చర్చ!

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.30 గంటలకు సమావేశాలు ప్రారంభమవగానే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాప ప్రతిపాదన చేస్తారు. దానిపై సభ్యులు మాట్లాడతారు. అలాగే శాసనమండలిలో మాజీ ఎమ్మెల్సీలు మాగం రంగారెడ్డి, టి.రత్నాకర్‌ల మృతికి సంతాప ప్రతిపాదనపై సభ్యులు మాట్లాడతారు. అనంతరం ఉభయ సభలూ వాయిదా పడనున్నాయి. తర్వాత శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) భేటీ కానుంది. సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి? ఏయే అంశాలపై చర్చించాలన్నదానికి సంబంధించిన అజెండాను ఖరారు చేయనున్నారు. అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్లో సీఎం రేవంత్ అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులు, ఇతర విధానపరమైన అంశాలపై చర్చించనున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు, కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన విచారణ నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టే విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వాస్తవానికి పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని ఎత్తివేస్తూ ఆర్డినెన్సు తీసుకొచ్చిన సర్కారు.. ఆమోదం కోసం గవర్నర్ వద్దకు పంపింది. దాన్ని గవర్నర్

మిగతా 12వ పేజీలో...

అసెంబ్లీకి ఈసారీ.. కేసీఆర్ డుమ్మా!

కాళేశ్వరంపై ఆరోపణలను తిప్పికొట్టండి

వరదలు, యూరియా కొరతపై ప్రశ్నించండి

ప్రజా సమస్యలపై నిలదీయండి 12

బీఆర్ఎస్ వ్యూహంపై కేటీఆర్, హరీశ్‌రావులకు కేసీఆర్ దిశానిర్దేశం



బడుల్లో ముఖ గుర్తింపు హాజరు!

కళాశాలల్లోనూ తప్పనిసరి చేయండి

మధ్యాహ్న భోజనం బిల్లులు ఆగొద్దు

ఆటలకు కాంట్రాక్టు ఉపాధ్యాయులు

విద్యారంగంలో మౌలిక వసతుల కోసం రుణాలకు నిర్మలమ్మను అనుమతి అడిగాం

ప్రభుత్వ బడుల్లో 90 శాతం విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే

పదేళ్ల గణాంకాలతో నివేదిక ఇవ్వండి

విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషనల్ కోర్సులు అందించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ విధానంతో హాజరు శాతం మెరుగుపడి, సాంకేతిక విద్యా కళాశాలల్లో లోటుపాట్లను సరిదిద్దడానికి అవకాశం దొరుకుతుందని చెప్పారు. విద్యారంగంపై పెడుతున్న ఖర్చును తాము పెట్టుబడిగా చూస్తున్నామన్నారు. శుక్రవారం విద్యాశాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు

మిగతా 12వ పేజీలో...

నిజామాబాద్ జిల్లాలోని సిరికొండ మండలం కొండూర్‌లో పంట పొలాల్లో ఇసుక మేటలు



వరుణుడి విధ్వంసం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వరద ఉధృతికి ఇసుక దిబ్బలుగా పంట పొలాలు.. చేలల్లో రాళ్ల కుప్పలు

తెగిన రోడ్లు, వంతెనలతో స్తంభించిన రవాణా

కామారెడ్డి టౌన్‌లో బురద, చెత్తాచెదారం మధ్య మురికికూపాలుగా ఇళ్లు.. విష సర్పాల ముప్పు

పాడైన టీవీ, ఫ్రిజ్.. విద్యుత్తు ఉపకరణాలు

నెమ్మదిగా ఇళ్లకు చేరుకుంటున్న జనం

కొందరు ఇంకా పునరావాస కేంద్రాల్లోనే..

బాసరలో ఆలయ సమీపంలోకి గోదావరి వరద

సిద్దిపేట కోమటిచెరువు వద్ద ఇళ్లలోకి నీరు

భద్రాచలం వద్ద 43 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవాహం.. మరో 3 రోజులు వర్షాలే 13

మురికికూపంగా మారిన కాలనీలు! మోకాలి లోతులో చేరిన బురద నీళ్లతో కంపుకొడుతున్న ఇళ్లు! మోటార్లతో అదేపనిగా నీటిని తోడేస్తున్నా పుట్టుకొస్తున్న కొత్త వరదతో సంపులను తలపిస్తున్న అపార్ట్‌మెంట్ సెల్లార్లు! వరద ఉధృతికి తెగిన రోడ్లు, చెరువు గట్లు, కూలిన వంతెనలు.. కట్టలు, మట్టిరోడ్లను

మిగతా 13వ పేజీలో...

2 లక్షల ఎకరాల్లో నష్టం

వ్యవసాయ శాఖ అంచనా

సమగ్ర సర్వేకు సర్కారు ఆదేశం

ఎకరాకు 10 వేలు పరిహారం



ట్రంప్ చేతిపై మచ్చ; ట్రంప్‌తో జేడీ వాన్స్

ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన!

చేతిపై పెద్ద మచ్చ, చీలమండల వద్ద వాపు, ఉబ్బిన కళ్లు, నడకలో తడబాటు 2

తీవ్రమైన గుండె వ్యాధి లక్షణాలనే అంచనాలు

చర్మవ్యాధి కావొచ్చనే విశ్లేషణలు

ట్రంప్ ఆరోగ్యం బాగుంది: వైట్‌హౌస్ వైద్యులు

అనుకోని ఘోర విషాదం జరిగితే అధ్యక్షుడి బాధ్యతలు చేపట్టేందుకు నేను సిద్ధం: వాన్స్

గొంతు నులిమి, డంబెల్‌తో మోది..

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

నిద్రలోనే చనిపోయాడంటూ నాటకం 3

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఘటన

నిందితురాలు, ఆమె ప్రియుడి అరెస్టు

అమిత్‌షా తల నరికి బల్లపై పెట్టాలి!

బంగ్లా నుంచి చొరబాట్లను అడ్డుకోవడంలో ఆయన విఫలమయ్యారు 2

టీఎంసీ ఎంపీ మహువా వివాదాస్పద వ్యాఖ్యలు.. పోలీసులకు బీజేపీ ఫిర్యాదు

బంజారా, లంబాడా, సుగాలీలు గిరిజనులు కారు

ఎస్టీల జాబితా నుంచి తొలగించాలి

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు 14

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

రాబడికి భద్రతేది?

జీఎస్టీ హేతుబద్ధీకరణతో తెలంగాణకు 7వేల కోట్ల నష్టం



ఢిల్లీలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలి

పన్ను తగ్గింపు.. పేద, మధ్య తరగతికి లబ్ధి చేకూర్చాలి

రాబోయే జీఎస్టీ కౌన్సిల్ భేటీలో సందేహాలన్నీ లేవనెత్తుతాం

జీఎస్టీ హేతుబద్ధీకరణ సంప్రదింపుల సమావేశంలో భట్టి

రాష్ట్రంలో వరద నష్టం నివేదిక కేంద్రానికి పంపుతామని వెల్లడి

జీఎస్టీ రేట్లు మారిస్తే రాష్ట్రాల రాబడికి 2 లక్షల కోట్ల గండి

ఆర్థికం కుదేలవుతుంది.. అభివృద్ధి పనులు నిలిచిపోతాయి

ఈ నష్టాన్ని కేంద్రం చెల్లిస్తుందా? 8 ప్రతిపక్ష రాష్ట్రాల ప్రశ్న

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించే సమయంలో రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. రేట్ల హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, కేంద్రం నేరుగా లేదా కౌన్సిల్ ద్వారా రాష్ట్రాలను సంప్రదించాలని, కానీ.. రేట్ల హేతుబద్ధీకరణ ప్రకటన ఏకపక్షంగా జరిగిందని

మిగతా 12వ పేజీలో...

టోక్యోలో జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో ప్రధాని నరేంద్ర మోదీ కరచాలనం



భారత్, చైనా కలిసి పనిచేయాలి!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు ఇది అవసరం

జపాన్ మీడియాతో ఇంటర్వ్యూలో మోదీ వ్యాఖ్యలు

మేకిన్ ఇండియా కోసం రండి.. ప్రపంచం కోసం తయారు చేయండి.. పెట్టుబడులకు గమ్యం భారత్

భారత్-జపాన్ ఆర్థిక సదస్సులో ప్రధాని మోదీ

భారత్‌లో పదేళ్లలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులే జపాన్ లక్ష్యం.. ఇరుదేశాల కీలక ఒప్పందాలు

ఒమన్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం

సౌదీ, ఖతార్‌లతోనూ చర్చలు: పీయూష్ గోయల్

టోక్యో, ఆగస్టు 29: ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచాలంటే భారత్, చైనా కలిసి పనిచేయడం అవసరమని ప్రధాని మోదీ చెప్పారు. పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం ఆధారంగా ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక, దీర్ఘకాలిక సంబంధాలను పెంపొందించుకునేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం జపాన్ వెళ్లిన మోదీ.. శుక్రవారం స్థానిక పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్, చైనాలు ప్రపంచంలోనే అతిపెద్ద దేశాలని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య స్థిరమైన, బలమైన బంధాలు ఉండాలని.. ఆ ప్రభావం ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సౌభ్రాతృత్వంపైనా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చైనాతో సంబంధాలు

మిగతా 2వ పేజీలో...



పట్నాలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీ

రాహుల్ సభపై దుమారం

ప్రధాని మోదీ తల్లిపై కొందరు దుర్భాషలాడినట్టు ఆరోపణలు

బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ

పట్నాలో రాహుల్ గాంధీపై కేసు

రాహుల్ క్షమాపణ చెప్పాలన్న షా

ఓటర్ అధికార్ యాత్రకు బ్రహ్మరథం

అందుకే బీజేపీ కుట్రలు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 29: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న బిహార్ దర్భంగా ఓటర్ అధికార్ యాత్ర సభ వేదికపై నుంచి ప్రధాని మోదీ తల్లిని కొందరు దూషించడంపై కలకలం రేగుతోంది. మోదీ మాతృమూర్తిని హిందీలో దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఘటన నేపథ్యంలో రాహుల్‌పై బిహార్ బీజేపీ నేత కృష్ణ సింగ్ ఫిర్యాదుతో పట్నాలో కేసు నమోదు

మిగతా 2వ పేజీలో...

జీడీపీ హుషారు.. రూపాయి బేజారు



- జూన్ త్రైమాసిక వృద్ధి 7.8 శాతం
- అంచనాలను మించి పరుగు
- ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి
- 2025-26లో వృద్ధి రేటు 6.3-6.8 శాతంగా ఉండే చాన్స్
- జీవితకాల కనిష్ఠానికి రూపాయి
- ఒక్క రోజులో 51 పైసలు డౌన్
- రూ.88.09 వద్ద ముగింపు 11

మట్టి గాజులు, డిక్షనరీల చాటున మాదకద్రవ్యాలు!



ఏడాదిలో రూ.100 కోట్ల విలువైన డ్రగ్స్ సరఫరా

కొరియర్ పార్సిళ్ల ద్వారా దేశవ్యాప్తంగా తరలింపు

ఢిల్లీలో ఉన్న 10 కొరియర్ కంపెనీలపై 'ఈగల్' నిఘా

నైజీరియన్ సూత్రధారి నిక్ కోసం గాలింపు

మహీంద్రా వర్సిటీలో 14మంది విద్యార్థులకు టెస్టులు

ఐదుగురికి పాజిటివ్.. తల్లిదండ్రులకు సమాచారం

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ రవాణాకు ఆయా ముఠాలు.. సరి కొత్త దారులను ఎంచుకుంటున్నాయి. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, మట్టి గాజుల పార్సిళ్లలో డ్రగ్స్ పెట్టి.. దర్జాగా కొరియర్‌లోనే పంపిస్తున్నాయి. ఎక్కడా లింకులు బయటపడకుండా గుట్టుగా దందా కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న పది కొరియర్ సంస్థల ద్వారా ఏడాదిలోనే రూ.100కోట్లకుపైగా విలువైన డ్రగ్స్‌ను దేశవ్యాప్తంగా తరలించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థుల డ్రగ్స్ దందాను ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందాలు ఇటీవల బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ సందర్భంగా పలు సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మల్నాడు కిచెన్ కేసులో కొరియర్ పార్సిళ్ల ద్వారా హైదరాబాద్‌కు డ్రగ్స్ చేరుతున్నట్లు గుర్తించిన ఈగల్ బృందాలు.. ఆపై ఢిల్లీలో నిఘా పెట్టగా పది కొరియర్ సంస్థల నుంచి నిక్ అతని అనుచరులు

మిగతా 3వ పేజీలో...

ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన!

» చేతి వెనుక వంకాయ రంగు మచ్చ, ఉబ్బిపోయిన కళ్లు



వాషింగ్టన్, ఆగస్టు 29: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయన ఆరోగ్యం అంతా బాగానే ఉందని అమెరికా అధ్యక్ష కార్యాలయం శ్వేత సౌధం వైద్యుడు, ఇతర అధికారులు చెబుతున్నా.. కొంతకాలం నుంచి ఆయనను గమనిస్తున్నవారు ట్రంప్ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆయన కాలి చీలమండల వద్ద వాపు, కుడిచేతి వెనకాల కమిలిపోయినట్టుగా వంకాయ రంగు పెద్ద మచ్చ, ఉబ్బిపోయిన కళ్లు, రంగుమారిపోయిన పెదవులు, నడిచేప్పుడు బ్యాలెన్స్ కోల్పోతుండటం వంటివాటిని ప్రస్తావిస్తున్నారు. ఇవి తీవ్రమైన గుండె వ్యాధి, దానికి వాడే మందుల దుష్ప్రభావాల లక్షణాలని విశ్లేషిస్తున్నారు. ఇటీవల అలాస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఆహ్వానించే సమయంలో.. ట్రంప్ కార్పెట్‌పై నేరుగా కాకుండా, కాస్త తూలుతున్నట్టుగా అటూఇటూ నడిచారని గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ కుడిచేతిపై మచ్చ చర్చనీయాంశం కావడంతో శ్వేతసౌధం వైద్యుడు సియాన్ బార్బబెల్లా ఇటీవల వివరణ ఇచ్చారు. రక్తాన్ని పలుచన చేసే ఆస్ప్రిన్ వాడుతున్న ట్రంప్.. ఇటీవల చాలా మందిని కలసి కరచాలనం చేయడంతో చర్మం రాపిడికి గురై మచ్చ ఏర్పడిందని చెప్పారు. ట్రంప్ వయసు ప్రస్తుతం 79 ఏళ్లు అని, ఈ వయసులో ఇలాంటి సమస్యలు సాధారణమేనని, తీవ్రమైన గుండె, రక్తనాళాల వ్యాధులేమీ లేవని పేర్కొన్నారు. మరోవైపు ట్రంప్ చేతిపై మచ్చ 'సెనైల్ పర్పురా' కావొచ్చని.. రక్తాన్ని పలుచన చేసే మందులు (బ్లడ్ థిన్నర్స్), స్టెరాయిడ్స్ వాడే పెద్ద వయసు వారిలో ఈ సమస్య వస్తుందని చర్మసంబంధిత అంశాల వెబ్‌సైట్ 'డెర్మ్‌నెట్' పేర్కొంది.

అవసరమైతే అధ్యక్ష బాధ్యతలకు సిద్ధం: వాన్స్



వాషింగ్టన్, ఆగస్టు 29: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ అనుకోని ఘోరమైన విషాదం జరిగితే దేశ అధ్యక్షుడి బాధ్యతలు చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అయితే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(79) ఆరోగ్యం చాలా బాగుందని చెప్పారు. ఆయన తన పూర్తి పదవీ కాలం బాధ్యతలు నిర్వర్తిస్తారని తాను విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. 'యూఎస్ఏ టుడే'కి గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో వాన్స్ ట్రంప్ ఆరోగ్యంపై వస్తోన్న వదంతులను కొట్టి పారేశారు. అయితే ప్రస్తుతం తానున్న పదవి రీత్యా అనుకోనిది జరిగితే అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి సన్నద్ధం అయినట్లు తెలిపారు. కాగా, తన తర్వాత 'మేక్ అమెరికా గ్రేట్ ఎగెయిన్'(మాగా) ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లగలవారిలో వాన్సే ముందుంటారని.. ట్రంప్ 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో వాన్స్ అభ్యర్థిత్వంపై ఆశలు రేపారు.

బిజినెస్ క్లాస్ విమాన టికెట్ల ధరలపై జీఎస్టీ పెంపు!

న్యూఢిల్లీ, ఆగస్టు 29: కొత్తగా రెండు శ్లాబుల జీఎస్టీ విధానాన్ని తీసుకురానున్న కేంద్రం.. విమానాల్లో ప్రీమియం, బిజినెస్ క్లాస్ టికెట్ల ధరలపై 18 శాతం పన్ను విధించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ టికెట్ల ధరలపై 12 శాతం జీఎస్టీ విధిస్తున్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే.. సంపన్న తరగతుల విమాన టికెట్ల ధరలు పెరగనున్నాయి. మరోవైపు, ఎకానమీ క్లాస్ సినిమా టికెట్ల ధరల మీద ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జీఎస్టీలో 5, 12, 18, 28 శాతాలతో కూడిన 4 శ్లాబులున్నాయి. వీటిని రెండింటికి కుదించి 5 శాతం, 18 శాతానికి పరిమితం చేయనున్నట్లు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే.

అమెరికా మాదిరి సరిహద్దు గోడ కడతారా?

» అక్రమ వలసదార్లపై విధానమేంటి.. కేంద్రానికి సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, ఆగస్టు 29: అక్రమ వలసదారులను నిరోధించడానికి అమెరికాలో మాదిరిగా సరిహద్దుల్లో గోడ నిర్మిస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారిని తిప్పి పంపించడానికి అనుసరిస్తున్న ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్ఓపీ) ఏమిటని అడిగింది. వీటిపై సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది. బెంగాలీ మాట్లాడుతున్న వలస కార్మికులను బంగ్లాదేశీయులు అన్న అనుమానంతో పలు చోట్ల అదుపులోకి తీసుకోవడాన్ని సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్ వలసదార్ల సంక్షేమ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ ప్రారంభించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఇలాంటి విషయాల్లో అసలైన బాధితులు వేసిన పిటిషన్లను స్వీకరించాలే తప్ప సంస్థలు, సంఘాలు వేసినవి కావని అన్నారు. కొన్ని సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు కూడా ఉందని, కొన్ని ప్రభుత్వాలు అక్రమ వలసదార్ల కారణంగా మనుగడ సాగిస్తున్నాయని తెలిపారు.

సుప్రీం న్యాయమూర్తులుగా జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీ ప్రమాణం

న్యూఢిల్లీ, ఆగస్టు 29: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ పంచోలీ శుక్రవారం ప్రమాణం చేశారు. సీజేఐ జస్టిస్ గవాయ్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. దాంతో సుప్రీంకోర్టు తన పూర్తి బలం 34 మందికి చేరుకుంది. ఈ నెల 27న వారిద్దరి నియామకాన్ని కేంద్రం ఖరారు చేసింది. జస్టిస్ పంచోలీ సీనియారిటీ ప్రకారం 2031 అక్టోబరు 3 సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అవుతారు. 2033 మే 27 వరకు సీజేఐగా కొనసాగుతారు.

1991 లోక్‌సభ ఎన్నికల్లో నన్ను మోసపూరితంగా ఓడించారు: సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొప్పళ లోక్‌సభ స్థానం నుంచి 1991లో తాను జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తనను మోసపూరితంగా ఓడించారని కర్ణాటక సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో తనపై కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్ పాటిల్ అన్వరి గెలిచారని, 11,200 కంటే తక్కువ ఓట్ల మెజార్టీతో విజయం సాధించారని తెలిపారు. అయితే కౌంటింగ్‌లో 22,243 ఓట్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారని, అదే తన ఓటమికి కారణమని, ఆ ఓట్లను లెక్కించి ఉంటే తాను గెలిచేవాడినని వివరించారు. మాజీ అడ్వకేట్ జనరల్ ప్రొఫెసర్ రవివర్మ కుమార్ న్యాయవాద వృత్తిని చేపట్టి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా విధాన సౌధలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిద్దరామయ్య నాటి ఎన్నికల గురించి ప్రస్తావించారు. ఆ సమయంలో రవివర్మ తనకు సాయం చేశారని గుర్తుచేసుకున్నారు. అయితే, ఓట్ల చౌర్యంపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్న తరుణంలోనే సిద్దరామయ్య..అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్‌పాటిల్ తనపై మోసపూరితంగా గెలిచారని చెప్పడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ మోసం చేసి గెలిచినట్లు సిద్దరామయ్యే స్వయంగా ప్రకటించారని బీజేపీ విమర్శించింది.

జర్నలిస్టులకు దేశమంతటా ఒకే పెన్షన్ ఉండాలి

» సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రిటైర్డు జర్నలిస్టులకు దేశమంతటా ఒకే పెన్షన్ విధానం ఉండాలని సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీర్మానం చేసింది. కేరళలో ఇటీవల జరిగిన ఫెడరేషన్ తొలి సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఢిల్లీకి చెందిన సందీప్ దీక్షిత్ ఎంపికయ్యారు. నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా తెలుగు పత్రికలలో పనిచేసిన సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ రజాక్ ఎంపికయ్యారు. కర్ణాటక నుంచి కార్యదర్శిగా కె. శాంత కుమారి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరుగా ఆర్‌పీ సాంబశివారెడ్డి, నేషనల్ కౌన్సిల్ మెంబర్లుగా రుద్రప్ప అసంగి, పండిత్ నాటికర్, జాకీర్ హుసేన్ ఎంపికయ్యారు.

భారత్-చైనా కలిసి పనిచేయాలి!

(మొదటిపేజీ తరువాయి)


జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో మోదీ

మెరుగుపర్చుకోవడంపై అడిగిన ప్రశ్నకు మోదీ స్పందిస్తూ.. "చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు షాంఘై సహకారం సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనడానికి తియాంజిన్ వెళ్తున్నా. గత ఏడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యాను. అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాల్లో స్థిరమైన, సానుకూల పురోగతి ఉంది" అని చెప్పారు. ఇరుదేశాల మధ్య దృఢమైన బంధం ఆసియాకే గాక యావత్ ప్రపంచానికే కీలకమని వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అస్థిరంగా ఉందని.. ఈ పరిస్థితుల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్, చైనా కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జపాన్ ప్రభుత్వ 'స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండో-పసిఫిక్' విధానంపై స్పందిస్తూ.. ఈ విధానానికి, భారత్ 'విజన్ మహాసాగర్'కు సారూప్యత ఉందని మోదీ చెప్పారు.

ప్రపంచం కోసం తయారు చేయండి..

ప్రధాని మోదీ భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సులో ప్రసంగిస్తూ.. మేకిన్ ఇండియా కోసం రావాలని, ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. సెమీ కండక్టర్ పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ భారత్‌కు జపాన్ అత్యంత కీలక భాగస్వామిగా ఉందని చెప్పారు. జపాన్ సంస్థలు భారత్‌లో రూ.3.50 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. "ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్. త్వరలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది" అని మోదీ పేర్కొన్నారు. జపాన్ సాంకేతికత, భారతీయుల ప్రతిభ కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవాన్ని ముందుకు నడిపించగలవని అన్నారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు భారత్, జపాన్‌ల మధ్య ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అని ప్రధాని మోదీ చెప్పారు. మరికొన్ని ఏళ్లలోనే రైలు సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. మరోవైపు, చంద్రుడిపై పరిశోధనల కోసం చేపడుతున్న చంద్రయాన్-5 మిషన్ కోసం జపాన్‌తో కలిసి పనిచేయనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందుకోసం ఇరుదేశాల అంతరిక్ష సంస్థలు ఇస్రో, జాక్సాల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిపారు.

పదేళ్లలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు

భారత్‌లో రాబోయే పదేళ్లలో దాదాపు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని జపాన్ లక్ష్యంగా పెట్టుకుంది. కీలక గనులు, రక్షణ, సాంకేతిక రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయి. జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో జరిగిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మోదీ తెలిపారు. ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, స్వచ్ఛ ఇంధనం, టెలికం, ఫార్మా, సరికొత్త, అధునాతన సాంకేతికత తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య 13 ఒప్పందాలు జరిగాయి.

చైనాలో జిన్‌పింగ్, పుతిన్‌తో భేటీ

జపాన్ పర్యటనను ముగించుకొని మోదీ చైనా వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న తియాంజిన్‌లో జరిగే ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. అక్కడ జిన్‌పింగ్‌తో భేటీ కానున్నారు. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత మోదీ చైనా పర్యటనకు వెళ్లడం ఇదే మొదటిసారి. మరోవైపు, రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం మోదీతో సమావేశమనున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. అలాగే, డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు. రష్యా చమురును కొంటున్నందుకే ట్రంప్ భారత్‌పై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.


టోక్యోలో ప్రధాని మోదీకి స్థానిక ఆలయ పూజారి 'దారుమా డాల్'ను బహుమతిగా ఇచ్చారు. జపాన్ సంప్రదాయంలో అదృష్టం, పట్టుదలకు చిహ్నంగా భావించే ఈ బొమ్మను.. ఇరుదేశాల మధ్య సుహృద్భావానికి ప్రతీకగా అందించినట్లు సమాచారం.

ఒమన్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం: గోయల్

న్యూఢిల్లీ, ఆగస్టు 29: అమెరికా టారిఫ్‌ల నేపథ్యంలో కేంద్రం ఆయా పరిశ్రమలకు కొత్త మార్కెట్లు తీసుకొచ్చేందుకు వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతోంది. ఒమన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారు కానుందని.. సౌదీ అరేబియా, ఖతార్ కూడా భారత్‌తో ఒప్పందాలపై చర్చలు జరపాలనుకుంటున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఒక దేశం ఏకపక్ష చర్యల కారణంగా వాణిజ్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన అనిశ్చితులను ఎదుర్కోవడానికి ఎగుమతిదారులకు అన్ని రకాల మద్దతునిస్తామని చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం యూరోపియన్ యూనియన్‌తోనూ చర్చలు ఊపందుకున్నాయన్నారు. 'ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటా 2 శాతమే. అమెరికాకు ఎగుమతి చేసే వాటిలో దాదాపు 40% వస్తువులు 50% సుంకాల పరిధిలోకి రావు. దీంతో ప్రభావం తక్కువే.' అని వివరించారు.

లోకం తీరు



భారత ఏనుగును అమెరికా ఎలుక ఢీకొన్నట్టే!

» అమెరికా సుంకాలతో భారత్ కొత్త మార్కెట్లు వెతుక్కుంటుంది

» బ్రిక్స్ కూటమి బలోపేతం అవుతుంది

» అమెరికా ఆర్థికవేత్త రిచర్డ్ వూల్ఫ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 29: భారత్‌పై అమెరికా అడ్డగోలుగా సుంకాలు విధించడాన్ని ఆ దేశ ఆర్థికవేత్త రిచర్డ్ వూల్ఫ్ తప్పుబట్టారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న భారత్ అతి పెద్ద మార్కెట్ అని.. అలాంటి దేశంతో అమెరికా తీరు ఏనుగును ఎలుక ఢీకొట్టినట్టేనని వ్యాఖ్యానించారు. తాజాగా రష్యా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిచర్డ్ వూల్ఫ్ మాట్లాడారు. "భారత్ విషయంలో అమెరికా చాలా కఠినంగా ఉన్నట్టు వ్యవహరిస్తోంది. భారత్‌వైపు తుపాకీ గురిపెట్టానని అనుకుంటూ.. తన కాలిని తానే కాల్చుకుంటోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధిస్తే.. రష్యా కొత్త మార్కెట్లను వెతుక్కుంది. ఇప్పుడు అమెరికా సుంకాలతో భారత సరుకులను అడ్డుకుంటే.. భారత్ ఆ సరుకులను బ్రిక్స్ కూటమికి అమ్ముకుంటుంది. దీనితో బ్రిక్స్ కూటమి బలోపేతం అవుతుంది. పశ్చిమ దేశాలకు ఆర్థిక ప్రత్యామ్నాయంగా ఎదుగుతుంది. భారత్‌పై అడ్డగోలు సుంకాలతో ఒక రకంగా బ్రిక్స్ కూటమిని అమెరికాయే బలోపేతం చేస్తోంది.." అని పేర్కొన్నారు. మరోవైపు, పాక్‌తో యుద్ధాన్ని తానే ఆపానన్న మాటను భారత్ తిరస్కరించినందుకు ట్రంప్ వ్యక్తిగత ద్వేషంతోనే అడ్డగోలుగా 50% సుంకాలు విధించారని అమెరికా ఆర్థిక సేవల సంస్థ జెఫరీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. నోబెల్ శాంతి బహుమతి కోసం తహతహలాడుతున్న ట్రంప్.. భారత్ తీరుతో ఆ అవకాశానికి దూరమయ్యానని భావిస్తున్నారని తెలిపింది. ట్రంప్ సుంకాలతో భారత ఆర్థిక వ్యవస్థకు రూ.5 లక్షల కోట్ల వరకు నష్టం జరుగుతుందని జెఫరీస్ సంస్థ ఈక్విటీ స్ట్రేటజీ విభాగం అధిపతి క్రిస్ వుడ్ అంచనా వేశారు.

థాయ్‌లాండ్ ప్రధాని ఔట్

» పేటోంగ్టార్న్ షినవత్రాను తొలగించిన ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం



బ్యాంకాక్, ఆగస్టు 29: థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రాపై ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం వేటు వేసింది. ఆమెను పదవి నుంచి తొలగిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది. పేటోంగ్టార్న్ నైతిక ప్రమాణాల ఉల్లంఘనకు పాల్పడినట్లు రుజువైందని పేర్కొంది. కంబోడియాతో సరిహద్దు ఉద్రిక్తతల సమయంలో ఆ దేశ నేత హున్ సేన్‌తో మాట్లాడిన ఓ ఫోన్‌కాల్ ఆమె పదవికి ఎసరు తెచ్చింది. జూన్‌లో వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్ అయింది. ఆ కాల్‌లో హున్ సేన్‌ను పేటోంగ్టార్న్ 'అంకుల్'గా సంబోధించారని, థాయ్ సీనియర్ మిలటరీ కమాండర్‌ను విమర్శించారని అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. అయితే ఆ తర్వాత తన వ్యాఖ్యలపై పేటోంగ్టార్న్ క్షమాపణలు చెప్పారు. కాగా, శ్రేత్త థావిసిన్ స్థానంలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పేటోంగ్టార్న్ షినవత్రా దాదాపు ఏడాది పాటు పదవిలో కొనసాగారు. థావిసిన్‌ను కూడా రాజ్యాంగ న్యాయస్థానమే పదవి నుంచి తప్పించింది. ఇప్పుడు షినవత్రాపై వేటు నేపథ్యంలో ఆ దేశ పార్లమెంట్ కొత్త ప్రధానిని ఎన్నుకోవాల్సి ఉంది.

బిహార్ ఓటరు జాబితాలో విదేశీయులు

న్యూఢిల్లీ, ఆగస్టు 29: నిన్న ఇద్దరు పాక్ మహిళలు.. ఇప్పుడు అఫ్ఘానిస్థాన్, మయన్మార్, బంగ్లాదేశ్, నేపాల్ పౌరులు బిహార్ ఓటరు జాబితాలో కనిపించారు. వెంటనే అప్రమత్తమైన ఎన్నికల సంఘం(ఈసీ) ఆ జాబితాలో గుర్తించిన విదేశీయులకు నోటీసులు జారీచేసింది. బిహార్‌లో సమగ్ర ఓటరు సవరణ(సర్) చేపట్టిన ఈసీ 3లక్షల మందికి నోటీసులు జారీచేసింది. వీరిలో బిహార్‌లో ఓటరు కార్డులు పొందిన పలువురు విదేశీయులు కూడా ఉన్నట్టు ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' ప్రక్రియలో భాగంగా ఎన్నికల అధికారులు జరిపిన ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో ఈ విషయం బయటపడింది. "బిహార్ ఓటరు జాబితాను లోతుగా ప్రక్షాళన జరుపుతున్నాం. ఈ ప్రక్రియ ఈ నెల 1న మొదలైంది. శనివారం వరకు కొనసాగుతుంది. ఈ క్రమంలో అనర్హులుగా తేలినవారిని జాబితా నుంచి తొలగిస్తాం. తుది జాబితాను సెప్టెంబరు 30వ తేదీన ప్రకటిస్తాం." అని ఈసీ వర్గాలు తెలిపాయి. నోటీసులు అందుకున్న వారు వారం రోజుల్లో ఎన్నికల అధికారి ఎదుట హాజరై తమ పత్రాలను తనిఖీ చేయించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. కాగా, ఓటరు జాబితాలో పేర్ల చేర్పు లేక తొలగింపును కోరుతూ గురువారంనాటికి వ్యక్తుల నుంచి 1,95,802 దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో 24,991 దరఖాస్తులను ఈసీ ఇప్పటికే పరిష్కరించిందని వెల్లడించింది. ఇక.. సీపీఐ (ఎమ్-ఎల్) 79 దరఖాస్తులు, ప్రతిపక్ష పార్టీ ఆర్జేడీ మూడు దరఖాస్తులు ఇచ్చిందని తెలిపింది. అభ్యంతరం చెబుతూ బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఇంతవరకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదని పేర్కొంది.

అమిత్‌షా తల నరకాలి!

బంగ్లా నుంచి చొరబాట్లను అడ్డుకోవడంలో ఆయన విఫలమయ్యారు

» టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా వ్యాఖ్య

» ఆమెపై పోలీసులకు బీజేపీ ఫిర్యాదు



కోల్‌కతా, ఆగస్టు 29: కేంద్ర హోం మంత్రి అమిత్ షాను లక్ష్యంగా చేసుకుని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. గురువారం నదియా జిల్లాలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సరిహద్దు భద్రత విషయంలో తన బాధ్యతల నుంచి తప్పించుకుంటోందన్నారు. ఈ సందర్భంగా అమిత్‌షాపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను అడ్డుకోవడంలో షా విఫలమయ్యారన్నారు. ఆయన తలను నరికి బల్లపై పెట్టాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ సరిహద్దును ఐదు దళాలు కాపాడుతున్నాయని, అది నేరుగా హోం మంత్రిత్వ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చొరబాట్లపై మాట్లాడుతున్నప్పుడు ముందు వరుసలో ఉన్న హోం మంత్రి చప్పట్లు కొట్టారన్నారు. "మన సరిహద్దులను కాపాడటానికి ఎవరూ లేకపోతే, వేరే దేశం నుంచి ప్రతి రోజూ ప్రజలు ప్రవేశిస్తుంటే, చొరబాటుదారులు మన తల్లులు, సోదరీమణులపై కన్నేయడంతోపాటు మన భూములను లాక్కుంటున్నారని మన దేశ పౌరులు ఫిర్యాదు చేస్తుంటే.. మొదట మీరు అమిత్ షా తల నరికి బల్లపై పెట్టాలి" అని వ్యాఖ్యానించారు. హోం మంత్రిత్వ శాఖ, హోం మంత్రి దేశ సరిహద్దులను రక్షించలేనప్పుడు, ప్రధాని స్వయంగా చొరబాటుదారులు మన ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని చెప్పినప్పుడు తప్పు మీదా? మాదా? అని ఆమె ప్రశ్నించారు. మొయిత్రా వ్యాఖ్యల పట్ల బీజేపీ స్పందించింది. ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొయిత్రా వ్యాఖ్యలు అసహ్యం కలిగించేలా, అభ్యంతరకరంగా ఉన్నాయని బీజేపీ నేతలు మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు ఆమె, టీఎంసీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఇదే టీఎంసీ వైఖరా అని ప్రశ్నించారు. ఒకవేళ కాకుంటే క్షమాపణలు చెప్పడమేకాకుండా మొయిత్రాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా మొయిత్రా వ్యాఖ్యలపై టీఎంసీ స్పందించలేదు.

రాహుల్ సభపై దుమారం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. బీజేపీ దర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆదిత్య నారాయణ్ ఇచ్చిన మరో ఫిర్యాదుతో పోలీసులు దర్భంగాలోని సింఘ్వారా ప్రాంతానికి చెందిన మహ్మద్ రిజ్వీ అనే 20 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేశారు. వేదికపైనుంచి మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిలో రిజ్వీ కూడా ఉన్నారని బీజేపీ నేతలు కేసు పెట్టారు. మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పాట్నాలో బీజేపీ-కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు విసరగా, బీజేపీ కార్యకర్తలు పార్టీ జెండా కర్రలు విసిరారు. దీంతో సదాఖత్ ఆశ్రమ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. మోదీ తల్లిపై దూషణ నేపథ్యంలో రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ రాజకీయాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయని షా వ్యాఖ్యానించారు. మోదీ తల్లి పేదరికంలో నుంచి వచ్చినా విలువలు నేర్పారని, అందువల్లే మోదీ ప్రధాని స్థాయికి చేరుకున్నారని షా చెప్పారు. ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండటాన్ని కాంగ్రెస్ జీర్ణం చేసుకోలేకపోతోందన్నారు. మోదీ తల్లిని దూషిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఉపయోగించిన భాష అసభ్యకరంగా ఉందని బిహార్ సీఎం నితీశ్ ఖండించారు. కాగా, ఓటర్ అధికార్ యాత్ర నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని జైరాం రమేశ్ అన్నారు.

ఎంపీలందరి మద్దతు కోరుతా

» ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి


ఉద్ధవ్ ఠాక్రేతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ముంబై, ఆగస్టు 29: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరినీ కోరుతానని ప్రతిపక్షాల అభ్యర్థి బీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి పార్టీలకు అతీతంగా ఎంపీలందరికీ లేఖలు రాస్తానని ప్రకటించారు. ఉపరాష్ట్రపతిగా తనకు అవకాశం లభిస్తే రాజ్యాంగాన్ని కాపాడతానని పేర్కొన్నారు. మహారాష్ట్రలో శుక్రవారం పర్యటించిన బీ సుదర్శన్‌రెడ్డి.. శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌ను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన సుదర్శన్‌రెడ్డి.. ఉపరాష్ట్రపతి ఎన్నికను దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీగా చూడడం తగదన్నారు. తాను ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, ఏ పార్టీలోనూ చేరే ఆలోచన కూడా లేదని చెప్పారు. కాగా, ఉపరాష్ట్రపతి ఎన్నికలో తమతోపాటు మహావికాస్ అఘాడీలోని పార్టీలకు చెందిన ఎంపీలందరి మద్దతు ప్రతిపక్షాల అభ్యర్థికేనని తన కలిసిన బీ సుదర్శన్‌రెడ్డికి ఉద్ధవ్ ఠాక్రే హామీ ఇచ్చారు. దేశం మీద ప్రేమ ఉన్న ఎన్డీఏ ఎంపీలంతా ఉపరాష్ట్రపతి ఎన్నికలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బీ సుదర్శన్‌రెడ్డికే ఓటేస్తారని ఠాక్రే తెలిపారు. ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని రాజ్‌భవన్‌లో అరెస్టు చేయించిన వ్యక్తి ఉపరాష్ట్రపతి పదవికి ఏం గౌరవం తీసుకొస్తారంటూ ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్‌పవార్ ప్రశ్నించారు. సీపీ రాధాకృష్ణన్ ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సొరేన్‌ను రాజ్‌భవన్‌లోనే అరెస్టు చేయించిన విషయాన్ని పవార్ గుర్తు చేశారు. రాధాకృష్ణన్‌కు వ్యవస్థలపై ఎలాంటి గౌరవం ఉందో ఆ అరెస్టు చెబుతోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో భేటీ అనంతరం పవార్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా, ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆమోదిస్తూ వామపక్షాలు శుక్రవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఈ ప్రకటన విడుదల చేసిన వామపక్షాల్లో సీపీఐ (ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, రెవెల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉన్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నిక రెండు విభిన్న సిద్ధాంతాల మధ్య పోరాటమని ఈ పార్టీలు పేర్కొన్నాయి.


ఉత్తరాఖండ్‌లో వరుస మేఘ విస్ఫోటాలు

» నాలుగు జిల్లాల్లో క్లౌడ్ బరస్ట్.. ఐదుగురి మృతి.. 11మంది గల్లంతు

డెహ్రాడూన్, ఆగస్టు 29: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో శుక్రవారం మేఘ విస్ఫోటాలు సంభవించాయి. భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రంలో ఐదుగురు చనిపోయారు. 11మంది గల్లంతయ్యారు. అనేక మంది ఇళ్లు కొట్టుకుపోయాయి. కొండచరియలు విరిగిపడి చాలా ప్రాంతాల్లో రోడ్లు మూసుకుపోయాయి. శుక్రవారం ఉదయం చమోలీ, టెహ్రీ, బాగేశ్వర్, రుద్రప్రయాగ జిల్లాల్లో మేఘ విస్ఫోటాలు సంభవించాయి. ఈ క్రమంలో కొండచరియలు విరిగిపడటంతో చమోలీ జిల్లాలోని ఓ గ్రామంలో పశువుల కొట్టం పూర్తిగా మట్టిలో కూరుకుపోయింది. అందులో ఉన్న దంపతులిద్దరూ చనిపోయారు. ఇరవైకి పైగా పశువులు గల్లంతైనట్లు తెలుస్తోంది. బాగేశ్వర్ జిల్లాలో ఇద్దరు చనిపోయారు. ముగ్గురు గల్లంతయ్యారు. భారీ వరదలతో రుద్రప్రయాగ జిల్లాలో ఓ మహిళ చనిపోయింది. అలకనంద, మందాకిని నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.

ముగ్గురు పిల్లలతో భారత మహిళపై భారం

» మోహన్ భాగవత్‌పై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ముగ్గురు పిల్లల పేరుతో భారతీయ మహిళలపై భారం పెంచొద్దని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ వ్యాఖ్యానించారు. ముగ్గురు పిల్లలుంటే ఆ కుటుంబంలోని పిల్లల మధ్య సాన్నిహిత్య సంబంధాలు దృఢమవుతాయన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యల్లో ద్వందార్థాలున్నాయని శుక్రవారం దారుసలాంలో మీడియాతో అన్నారు. ముగ్గురు పిల్లలను కనాలని భారతీయ మహిళలపై భారం మోపాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారని మోహన్ భాగవత్‌ను ప్రశ్నించారు. ప్రధాని మోదీ హయాంలో దేశంలోని ముస్లింలపై శత్రుత్వం సుస్థిరమైందని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్, దానికి మద్దతుగా నిలిచిన మితవాద సంస్థలు నిరంతరం మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని జనాభా పెరుగుదలపై తప్పుడు సమాచారంతో విమర్శలు చేస్తుంటాయని, కానీ వాస్తవ పరిస్థితులు దానికి భిన్నమని చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారం హిందువులు 80% కాగా, ముస్లింలు కేవలం 14.23 శాతమని స్పష్టం చేశారు. ఏది ఏమైనా ప్రజల వ్యక్తిగత, కుటుంబ జీవితంపై మాట్లాడేందుకు మీరెవరని భాగవత్‌ను ప్రశ్నించారు.

గడువు తీరిన బీరు తాగి ఆస్పత్రిపాలు

» సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఒకరికి అస్వస్థత

» జోగిపేటలో బిర్యానీలో బొద్దింక

దుబ్బాక/జోగిపేట రూరల్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): గడువు తీరిన బీరు తాగి అస్వస్థతకు గురై ఓవ్యక్తి ఆస్పత్రిపాలయ్యాడు. సిద్దిపేట జిల్లా చెందిన వీరబత్తిని శ్యాం(37) స్థానిక రేణుకా వైన్స్‌లో గురువారం రెండు బీర్లు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లి సేవించాడు. కాసేపటికే అస్వస్థతకు గురైన శ్యాం.. బీరు సీసాలను పరిశీలించగా ఆగస్టు 13కే వాటి గడువు ముగిసినట్టు(ఎక్స్‌పైర్ అయినట్టు) ఉంది. దీంతో అదే దుకాణానికి వెళ్లిన శ్యాం మరో బీరు కొనుగోలు చేయగా అది కూడా గడువు తీరిన సరుకుగా గుర్తించి నిర్వాహకులను నిలదీశారు. అదే సమయంలో శ్యాంకు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా, సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని అరోమా రెస్టారెంట్‌లో ఓ వ్యక్తి వెజ్ బిర్యానీ ఆర్డర్ చేయగా అందులో బొద్దింక కనిపించింది. ఇదేమని నిర్వాహకులను ప్రశ్నించగా.. వేడివేడి బిర్యానీలో బొద్దింక ఎలా వస్తుందని తమను ఎదురు ప్రశ్నించారని బాధితులు తెలిపారు. మెదక్ జిల్లా కౌడిపల్లికి చెందిన సతీష్ కుమార్ రెడ్డికి ఈ చేదు అనుభవం ఎదురైంది.


బీరు సీసాపై 13వ తేదీ గడువుతో ఉన్న లేబుల్

మట్టి గాజులు, డిక్షనరీల చాటున డ్రగ్స్

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని వివిధ ప్రాంతాలకు డ్రగ్స్‌ను పంపిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల పోలీసులను ఈగల్ బృందాలు అప్రమత్తం చేశాయి. ఎండీఎంఏ, కొకైన్, ఓజీ(ఓషన్‌గంజా) కుష్ వంటి మత్తు పదార్థాలను మట్టి గాజులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల మధ్య పెట్టి కొరియర్ చేసినట్లు ప్రస్తావించాయి. స్మగ్లింగ్‌కు ఢిల్లీలో నివసిస్తున్న నైజీరియన్ సూత్రధారి అని ఈగల్ అధికారులు భావిస్తున్నారు. అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు సమాచారం. కాగా, మహీంద్ర యూనివర్సిటీలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సహా మరో ప్రైవేటు వ్యక్తిని ఇటీవల ఈగల్ అధికారులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వీరి వద్ద దొరికిన వివరాల ఆధారంగా యూనివర్సిటీలోని 50మంది విద్యార్థులు తరచూ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో అనుమానిత విద్యార్థులకు కొన్నిరోజులుగా డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తాజాగా 14మంది విద్యార్థులకు డ్రగ్ టెస్టు నిర్వహించగా.. ఐదుగురికి పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. వారి తల్లితండ్రులను పిలిపించి, బాధితులను రీహాబిలిటేషన్ సెంటర్లకు తరలించడానికి ఈగల్ బృందాలు ప్రయత్నిస్తున్నాయి.


వరంగల్‌లోని శివనగర్‌లో గణపతి కరోడ్‌పతిగా దర్శనమిచ్చారు. శుక్రవారం వాసవి ట్రస్టు, వినాయక ట్రస్ట్ భవన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కోటీ 53 లక్షల కరెన్సీ నోట్లతో దండలను అల్లి గణపతి మండపం వద్ద అలంకరించి ధనలక్ష్మి పూజ చేశారు. 22 ఏళ్లుగా ఇక్కడ గణపతిని కరెన్సీతో అలంకరిస్తున్నారు. - ఖిలావరంగల్, (ఆంధ్రజ్యోతి)

అక్రమాస్తుల కేసులో ఖిలా వరంగల్ తహసీల్దార్ అరెస్టు

» రూ.5.02 కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు


బండి నాగేశ్వర్‌రావు

హైదరాబాద్/వరంగల్ క్రైం/ వీణవంక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదుపై ఖిలా వరంగల్‌లోని తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. శుక్రవారం ఉదయం ఒకేసారి ఏకకాలంలో ఏడు చోట్ల (హనుమకొండ, ఖమ్మం జిల్లాలతోపాటు ఖిలా వరంగల్ కార్యాలయం) తనిఖీలు కొనసాగాయి. సోదాల తర్వాత నాగేశ్వర్ రావును అరెస్టు చేశామని ఏసీబీ డీజీ విజయ్ కుమార్ తెలిపారు. తమ తనిఖీల్లో దొరికిన ఆస్తుల విలువ రూ.5,02,25,198 కోట్లు ఉంటుందని వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య చెప్పారు. ఆయన ఆస్తుల చిట్టాతో తమ కళ్లు బైర్లు కమ్మాయన్నారు. ఆయనకు రూ.. 1,15,00,000 కోట్ల విలువ 17.10 ఎకరాల విస్తీర్ణంలోని ఇల్లు, రూ.1,42,98,500 విలువైన 70 గ్రాముల బంగారు ఆభరణాలు (రూ.23,84,700), 1,791 గ్రాముల వెండి (రూ.92,000), ఐదు వాహనాలు (రూ.34.78 లక్షలు), 23 చేతి గడియారాలు (రూ.3,28,195), గృహోపకరణాలు (రూ.16,43,303) ఉన్నట్లు చెప్పారు. నాగేశ్వర్ రావు అదనపు ఆస్తుల ధ్రువీకరణ జరుగుతుందని, నిందితుడిపై అక్రమాస్తుల కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని సాంబయ్య తెలిపారు. బండి నాగేశ్వర్‌రావు ఇళ్లలో ఏసీబీ దాడులతో ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు రెవెన్యూశాఖలో కలకలం రేపింది. గతంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి, కాజీపేటతోపాటు ఖిలా వరంగల్‌లోనూ తహసీల్దార్‌గా చేయి తడపందే ఏ పని చేయడన్న విమర్శలున్నాయి. ఆయన సొంత జిల్లా ఖమ్మంలో రియల్ ఎస్టేట్ వెంచర్‌లు చేస్తాడని సమాచారం.

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఐఏఎస్ శివశంకర్

» తెలంగాణ నుంచి రిలీవ్ చేస్తూ కేంద్రం ఉత్తర్వులు



హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి, 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని కేంద్రప్రభుత్వం ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించింది. ఈ మేరకు ఆయనను ఏపీకి రిలీవ్ చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) కార్యదర్శి ఏకే మిశ్రా శుక్రవారం తెలంగాణ ప్రభుత్వానికి ఉత్తర్వులు పంపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు శివశంకర్‌ను ఏపీకి కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలోని ధర్మవరం శివశంకర్ సొంతూరు. కానీ రంగారెడ్డి జిల్లాలోని తన మామగారి నివాసంలో ఉండి ఆయన సివిల్ సర్వీసెసు సాధించారు. యూపీఎస్సీకి చేసిన దరఖాస్తులో తన శాశ్వత చిరునామాగా రంగారెడ్డి జిల్లానే పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో క్యాడర్‌ను నిర్ణయించేటప్పుడు చిరునామా ఆధారంగా కేంద్రప్రభుత్వం ఆయనను తెలంగాణకు కేటాయించింది. కానీ ఆయన ఏపీలోనే పనిచేస్తుండేవారు. 2024 అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తూ... ఏ రాష్ట్ర కేడర్ ఆ రాష్ట్రానికి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఫలితంగా శివశంకర్ తెలంగాణ ప్రభుత్వానికి రిపోర్టు చేసి, ఇక్కడే కొనసాగుతున్నారు. అయితే తాను ఏపీ వాస్తవ్యుడనని, రంగారెడ్డి జిల్లా ఇంటి అడ్రస్ ఆధారంగా తనను తెలంగాణకు కేటాయించారని శివశంకర్ కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. క్యాట్ ఆయనకు అనుకూలంగా తీర్పునిస్తూ ఏపీకి కేటాయించింది. వెంటనే ఆయనను రిలీవ్ చేయాలంటూ డీఓపీటీని ఆదేశించింది. క్యాట్ ఆదేశాలను సవాలు చేస్తూ డీఓపీటీ హైకోర్టులో పిటిషన్ వేయగా... క్యాట్ ఆదేశాలనే హైకోర్టు సమర్థించింది. ఈ నేపథ్యంలో శివశంకర్‌ను ఏపీకి రిలీవ్ చేస్తూ డీఓపీటీ తాజాగా తెలంగాణ ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చింది.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

కుమారుడిని గణేశ్ మండపంలో నిద్రపొమ్మని చెప్పి ప్రియుడిని పిలిచి ఘాతుకం

» గొంతు నులిమి, డంబెల్‌తో మోది హత్య

» హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఘటన

హైదరాబాద్ సిటీ/ దిల్‌సుఖ్‌నగర్/ఊర్కొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాల వ్యవహారం మరో ప్రాణం తీసింది. ఓ మహిళ ప్రియుడితో కలిసి భర్తను గొంతు నులిమి, డంబెల్‌తో తలపై బాది హత్య చేసింది. ఎవరితోనో గొడవపడి వచ్చి పడుకున్నాడని.. నిద్రలోనే చనిపోయాడని నాటకం ఆడింది. కానీ పోలీసుల విచారణలో దొరికిపోయింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో గురువారం రాత్రి ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం మాదారం గ్రామానికి చెందిన జల్లెల శేఖర్ (40)కు రంగారెడ్డి జిల్లా వెల్దండ మండలం కుప్పగుండ్లకు చెందిన చిట్టి (33)తో 2009లో వివాహం జరిగింది. వారికి కూతురు(14), కుమారుడు(12) ఉన్నారు. బతుకుదెరువు కోసం వారు సరూర్‌నగర్‌లోని కోదండరామ్‌నగర్‌కు వలసవచ్చారు. శేఖర్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. చిట్టి వస్త్రాల దుకాణంలో పనిచేస్తోంది. వారి కుమార్తె ప్రభుత్వ హాస్టల్‌లో ఉండగా, కుమారుడు తల్లిదండ్రుల ఉంటూ స్థానిక పాఠశాలలో చదువుతున్నాడు.

వివాహేతర సంబంధం, గొడవలతో..

చిట్టికి స్థానికంగా ఉండే హరీశ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడి, వివాహేతర సంబంధానికి దారితీసింది. అయితే భార్య ప్రవర్తనలో మార్పురావడం, నగలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుండటంతో శేఖర్‌కు అనుమానం వచ్చి నిలదీశాడు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్త అడ్డుతొలగించుకోవాలని చిట్టి ప్రణాళిక వేసింది. గురువారం రాత్రి కుమారుడిని గణేశ్ మండపం వద్ద స్నేహితులతో కలసి నిద్రపొమ్మని పంపింది. అర్ధరాత్రి తర్వాత ప్రియుడు హరీశ్‌ను ఇంటికి పిలిచింది. ఇద్దరూ కలసి నిద్రపోతున్న శేఖర్‌ను గొంతు నులిమి చంపారు. చనిపోయాడో లేదోనన్న అనుమానంతో ఇంట్లో ఉన్న డంబెల్‌తో అతడి తలపై మోదారు. తర్వాత హరీశ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఉదయమే చిట్టి డయల్ 100కు ఫోన్ చేసింది. తన భర్త రాత్రి ఎవరితోనో గొడవపడి వచ్చి నిద్రపోయాడని, ఉదయం చూస్తే చనిపోయి ఉన్నాడని చెప్పింది. పోలీసులు ఘటనా స్థలంలో పరిస్థితిని పరిశీలించి, చిట్టి తీరుపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్టు ఆమె బయటపెట్టడంతో ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.


భర్త శేఖర్‌తో నిందితురాలు చిట్టి

మామను హతమార్చిన కోడలికి జీవితఖైదు

సహకరించిన ప్రియుడికీ అదే శిక్ష .. నల్లగొండ మహిళా కోర్టు తీర్పు

నల్లగొండ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మామను హతమార్చిన కేసులో కోడలితోపాటు ఆమె ప్రియుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ నల్లగొండ నాలుగో అదనపు జిల్లా-సెషన్స్ కోర్టు, మహిళా కోర్టు జడ్జి కవిత శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈ కేసు వివరాలను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మీడియాకు వివరించారు. నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామానికి చెందిన బొబ్బిలి పద్మకు అదే గ్రామానికి చెందిన ఆవుల వేణుతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. 2017 ఆగస్టు 3న పొలానికి వెళ్లిన మామ భిక్షమయ్య భోజనం చేసేందుకు ఇంటికి వచ్చాడు. అదే సమయంలో ఇంట్లో ఉన్న కోడలు పద్మ, ఆమె ప్రియుడు వేణును చూసి తన కుమారుడు లింగయ్యకు చెబుతానని హెచ్చరించాడు. దీంతో తమ విషయం బయటపడుతుందని భయపడి ఇద్దరూ కలిసి భిక్షమయ్యను హత్య చేశారు. మద్యం మత్తులో కిందపడి బలమైన గాయమవడంతో చనిపోయాడని భర్తకు తెలిపింది. అయితే కొట్టి, హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదిక రావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో హత్యచేసినట్లు నిందితులు కూడా అంగీకరించారు. ముద్దాయిలకు జీవితఖైదుతోపాటు, రూ.4వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

అస్తవ్యస్తంగా సంక్షేమ హాస్టళ్లు

» ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. వార్డెన్ల ఇష్టారాజ్యం

» ఏసీబీ ఆకస్మిక తనిఖీల్లో బయటపడ్డ బాగోతం

హైదరాబాద్/రామన్నపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ, ఎస్సీ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలోని కొన్ని హస్టళ్లు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం ఏసీబీ అధికారులు నిర్వహించిన అకస్మిక తనిఖీల్లో పలు అవకతవకలు గుర్తించారు. యాదాద్రి - భువనగిరి జిల్లా రామన్నపేటలోని ఎస్సీ విద్యార్థినుల హస్టల్, నారాయణ పేట జిల్లా దామరగిద్దలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ తనిఖీలు సాగాయి. విద్యార్థులకు నిర్ణీత ప్రమాణాల మేరకు నాణ్యతతో కూడిన ఆహారం సరఫరా, హాస్టళ్లు, కాలేజీల్లో శానిటేషన్, రిజిష్టర్ల ప్రకారం విద్యార్థుల హజరు ఉందా..? తదితర విషయాల్లో అవకతవకలు జరిగినట్లు ఏసీబీ డీజీ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి సవివరమైన నివేదిక పంపుతామన్నారు. రామన్నపేట ఎస్సీ విద్యార్థినుల హాస్టల్ రికార్డుల్లో 40 మంది పేర్లు ఉండగా, వాస్తవంగా 20 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. స్థానిక హైస్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 20 మంది ఉదయం అల్పాహారం తిని పాఠశాలకు వెళతారు. రాత్రి భోజనం తర్వాత ఇళ్లకు వెళ్లిపోతున్నారని విమర్శలున్నాయి. దీంతోపాటు వంటశాల సామగ్రి, నూనె, పప్పు తదితర వివరాలపై దేనికి సరైన సమాధానం చెప్పకపోవడంపై హాస్టల్ వార్డెన్ రాజోల్ బాయిపై నల్లగొండ ఏసీబీ డీఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో అవినీతి అక్రమాలు జరుగుతున్నా, ఎందుకు తనిఖీలు చేయడం లేదని ఇన్‌చార్జి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ భిక్షంను ప్రశ్నించినా సమాధానం రాలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే హాస్టల్ నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్తవ్యస్త రికార్డులపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని జగదీశ్ చందర్ తెలిపారు.

గణేశుడి మండపం వద్ద కరెంట్ షాక్‌తో బాలుడి మృతి

» పాటలు పెడుతుండగా విద్యుదాఘాతం

» నల్లగొండ జిల్లాలో ఘటన

» మెదక్‌లో పాముకాటుతో రైతు మృతి


మణికంఠ (ఫైల్)

హాలియా/చేగుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియా మునిసిపాలిటీ పరిధిలోని అనుముల కేవీ కాలనీలో గణేశుడి మండపం వద్ద కరెంట్ షాక్‌తో శుక్రవారం ఓ బాలుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన దండెం మహేందర్, మౌనికల కుమారుడు మణికంఠ(11)స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం మండపం వద్ద పాటలు పెట్టే క్రమంలో విద్యుత్ వైర్ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే చనిపోయాడు. విషయం తెలుసుకున్న హాలియా సీఐ సతీశ్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండపంలో విద్యుత్ పనులు ఎలక్ట్రీషియన్లతోనే చేయించాలని, పిల్లలను విద్యుత్ పరికరాల వద్దకు అనుమతించవద్దని సూచించారు. మరోవైపు, మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో పాము కాటుతో ఓ రైతు చనిపోయాడు. చౌదరి రఘురాములు(49) తనకున్న అరెకరం పొలంలో మంగళవారం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు అతన్ని నార్సింగి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తర్వాత హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం రఘు రాములు మృతి చెందాడు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

నకిలీ పాస్‌పుస్తకాలతో 16 లక్షల రుణాలు స్వాహా

» ముగ్గురు నిందితుల అరెస్టు

కురవి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేసి, నకిలీ పాస్‌పుస్తకాలతో రుణాలు ఇప్పిస్తున్న ముఠాను కురవి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు మీడియాకు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మంచ్యాతండాకు చెందిన మూడ్ బాలాజీ, మహబూబాబాద్ మండలం అమనగల్ కస్నాతండాకు చెందిన బానోత్ హరికిషన్, జఫర్‌ఘడ్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బానోత్ వర్ధన్ ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు నకిలీ పాస్‌పుస్తకాలు, 1బీ, ఈసీ పత్రాలను తయారుచేసి అమాయకులైన రైతులకు ఎక్కువ రుణాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఒక్కో పాస్‌పుస్తకానికి రూ.10,000 చొప్పున వసూలు చేశారు. ఈ ముఠా కురవి యూనియన్ బ్యాంకు, డోర్నకల్ యూనియన్ బ్యాంకు, మహబూబాబాద్ యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకులలో మొత్తం 11 మంది రైతులకు రూ.16.90 లక్షల రుణాలు ఇప్పించినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, మరో రూ.కోటి వరకు రుణాలు ఇప్పించేందుకు కూడా వీరు ప్లాన్ చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్సై సతీశ్ ముఠాను పట్టుకున్నారు. వారి నుంచి 23 నకిలీ పుస్తకాలు, ఒక ల్యాప్‌టాప్, రెండు ప్రింటర్లు, ఒక కంప్యూటర్, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

13 ఏళ్లుగా దుబాయ్‌లో భిక్షాటన

» పని కోసం వెళ్లి తప్పిపోయిన మెదక్ వాసి

» ఇటీవల అతడిని కలిసిన కామారెడ్డి వ్యక్తి

» రూ.లక్ష వెచ్చించి బాధితుడిని ఇంటికి పంపిన వైనం


కొనింటి కృష్ణ

వెల్దుర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం 13 ఏళ్ల క్రితం గల్ఫ్ వెళ్లిన తెలంగాణ వాసి ఒకరు ఆచూకీ లేకుండా పోయారు. దీంతో కుటుంబసభ్యులు అతడిపై ఆశలు వదులుకున్నారు. అయితే, దుబాయ్‌లో భిక్షాటన చేస్తున్న అతడితో కామారెడ్డి వాసి ఒకరు మాటలు కలిపారు. ఈ క్రమంలో అతడిది మెదక్ అని తెలిసి స్థానికులకు సమాచారం అందించారు. దీంతో బాధితుడు సుదీర్ఘ కాలం తర్వాత స్వగ్రామానికి చేరుకున్నాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన కొనింటి కృష్ణ 13 ఏళ్ల క్రితం పని కోసం దుబాయ్ వెళ్లి తప్పిపోయాడు. ఉపాధి దొరక్క అక్కడ భిక్షాటన చేస్తూ ఉన్నాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. దుబాయ్‌లో భిక్షాటన చేస్తున్న కృష్ణతో కామారెడ్డి జిల్లా కేంద్రానికి హనుమంత్‌రెడ్డి ఇటీవల మాట్లాడారు. తనది మెదక్ జిల్లా ఉప్పులింగాపూర్ అని చెప్పడంతో హనుమంత్‌రెడ్డి విషయాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సునీతారెడ్డి ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన స్థానిక నాయకులతో మాట్లాడి కృష్ణ వివరాలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో హనుమంత్‌రెడ్డి దుబాయ్ అధికారులతో మాట్లాడి, రూ.లక్షకు పైగా వెచ్చించి కృష్ణను ఉప్పులింగాపూర్‌కు పంపించారు. శుక్రవారం కృష్ణ స్వగ్రామానికి చేరాడు. కృష్ణతో పాటు ఆయన కుటుంబ సభ్యులు హనుమంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే సునీతారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.72 లక్షలకు టోకరా!

» వృద్ధుడి నుంచి కాజేసిన సైబర్ కేటుగాళ్లు

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'మీపై మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయి. సుప్రీంకోర్టులో విచారణకు హాజరుకావాలి. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అంటూ 82 ఏళ్ల వృద్ధుడిని బెదిరించిన సైబర్ కేటుగాళ్లు నిండా ముంచేశారు.. ఆయన బ్యాంకు ఖాతాల నుంచి ఏకంగా రూ.72 లక్షలు కాజేశారు.. చివరకు మోసపోయానని గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ ధార కవిత వివరాల మేరకు.. బంజారాహిల్స్‌కు చెందిన వృద్ధుడికి ఇటీవల గుర్తు తెలియని నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ముంబై క్రైం బ్రాంచ్ పోలీసునంటూ ఓ వ్యక్తి పరిచయం చేసుకుని.. బాధితుడి వ్యక్తిగత వివరాలన్నీ చెప్పి నమ్మించాడు. 'మీరు ఆధార్ కార్డు దుర్వినియోగం చేశారు. మీపై మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయి. రేపు మీ బ్యాంకు ఖాతాల్ని స్తంభింపజేస్తాం. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశించింది. రేపు సుప్రీం కోర్టులో విచారణ జరుగుతుంది.. మీరు తప్పకుండా వర్చువల్‌గా హాజరుకావాలి' అని బెదిరించాడు. మరుసటి రోజు వీడియో కాల్ చేసిన నేరగాళ్లు.. సినిమాల్లోలాగా సుప్రీం కోర్టు సెటప్ వేసి నకిలీ జడ్జితో ప్రశ్నలు అడిగించారు. బాధితుడు ఇదంతా నిజమేనని నమ్మాడు. ఈ నేపథ్యంలోనే అతని ఖాతాల్లోని డబ్బును తాము చెప్పిన ఆర్బీఐ ఖాతాల్లోకి పంపాలని చెప్పారు. ఏ తప్పు చేయలేదని తేలితే వెంటనే ఆయా ఖాతాలకు డబ్బులు తిరిగి బదిలీ చేస్తామన్నారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయమని ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. దీంతో బాధితుడు పది రోజుల పాటు తన బ్యాంకు ఖాతాల్లోని రూ.72 లక్షలను వారు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశాడు. అయితే ఆ తర్వాత నుంచి వారి ఫోన్ నంబర్లు కలవకపోవడం.. ఇటీవల ఓ దినపత్రికలో వచ్చిన నకిలీ డిజిటల్ అరెస్టు వార్త చూసి ఇదంతా మోసమని బాధితుడు తెలుసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

» బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల చర్య

» నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు హతం

చర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడన్న నెపంతో మావోయిస్టులు ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ జిల్లా మంకేలి గ్రామానికి చెందిన గిరిజనుడు కొర్సా సురేశ్(27)ను దారుణంగా హత్య చేశారు. సురేశ్ గ్రామంలో కిరాణా షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సురేశ్ ఇంటికి వెళ్లిన మావోయిస్టులు అతన్ని దారుణంగా కొట్టి, కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ మేరకు అతని కుటుంబసభ్యులు వివరాలను వెల్లడించారు. గడిచిన రెండు రోజుల్లో బీజాపూర్, సుకుమా జిల్లాల్లో ఇద్దరిని మావోయిస్టులు హత్య చేయడం కలకలం రేపుతోంది. మరోవైపు, నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులున్నట్టు సమాచారం రావడంతో కేంద్ర బలగాలు శుక్రవారం కూబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మాడ్ ఏరియాలో మావోయిస్టులు, కేంద్ర బలగాల మధ్య కాల్పులు జరిగాయని, ఒక మావోయిస్టు చనిపోయాడని ఎస్పీ రాబిన్‌సన్ తెలిపారు. ఘటనా స్థలంలో తుపాకులు, బుల్లెట్లు, బీజీఎల్స్ లాంచర్లు, వైర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మలిదశ విధ్వంసం

గాజా యుద్ధంలో ఇజ్రాయెల్ దుర్మార్గాలను బాహ్యప్రపంచానికి తెలియచేస్తున్న పాత్రికేయులమీద నెతన్యాహూ కక్ష కట్టారన్న విషయం తెలిసిందే. జర్నలిస్టులని తెలియక చంపేశామనో, ఐడీఎఫ్ బలగాలు పొరబడ్డాయనో, వారు జర్నలిస్టు ముసుగులో ఉన్న టెర్రరిస్టులనో వాదిస్తూ ఆయన రెండువందలమంది జర్నలిస్టులను హత్యచేశాడు. ఇప్పుడు గాజానగరాన్ని పూర్తిగా దురాక్రమించి, ఆకలిచావులను కూడా దాటిబతికిన మిగతా పాలస్తీనియన్లను తుడిచిపెట్టేసే సరికొత్త కార్యక్రమానికి ఇజ్రాయెల్ అధినేత సంసిద్ధమవుతున్న తరుణంలో, మొన్న సోమవారం ఐదుగురు జర్నలిస్టుల దారుణ హత్య పాత్రికేయ ప్రపంచానికి మరో బలమైన హెచ్చరిక. అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ 'డబుల్ టాప్' విధానంలో ఈ హత్య జరిగింది. గాజాలోని నాసర్ ఆస్పత్రి కేంద్రంగా రాయ్‌టర్స్ సహా వివిధ వార్తాసంస్థలు యుద్ధాన్ని ఎంతోకాలంగా కవర్ చేస్తున్నాయని ఇజ్రాయెల్ బలగాలకు తెలుసు. అది రహస్యప్రదేశమేమీ కాదు. ఈ భవనంలోని పై అంతస్తుల్లో ఉంటున్న పాత్రికేయులను ఇజ్రాయెల్ బలగాలు గతంలో సంప్రదించిన సందర్భాలూ ఉన్నాయి. అవసరమైతే కెమెరాలతోనూ, డ్రోన్లతోనూ వీరంతా ఏం చేస్తున్నారో సులువుగా తెలుసుకోవచ్చు. కానీ, తమ వృత్తిధర్మాన్ని నిర్వహిస్తున్న పాత్రికేయులను ఇజ్రాయెల్ వేటాడింది. ఆస్పత్రి భవనంలో వైద్యుల నివాసాలున్న పై అంతస్తును ఐడీఎఫ్ బలగాలు మొదటగా పేల్చివేశాయి. ఆ దాడిలో గాయపడినవారిని కాపాడేందుకు కొందరు కొద్దిక్షణాల తరువాత పరుగులు తీశారు. వారితో పాటు ఈ ఐదుగురు పాత్రికేయులు కూడా మెట్లమీదనుంచి వెడుతూండగా, సరిగ్గా లెక్కలేసుకొని మరీ ఐడీఎఫ్ బలగాలు రెండో దాడిచేశాయి. ఏడునిముషాల తేడాలో ఉద్దేశపూర్వకంగా ఈ రెండుదాడులూ జరిగినట్టు ఒక అరబ్ చానెల్ ప్రత్యక్షప్రసారంలో స్పష్టంగా తేలిపోయింది. తొలిదాడిలో ముగ్గురు మరణిస్తే, మలిదాడిలో జర్నలిస్టులతో సహా 20మంది కన్నుమూశారు, వందమంది గాయపడ్డారు.

ఐడీఎఫ్ బలగాల కదలికలను పసిగట్టడానికి ఈ భవనంపైన ఒక కెమెరా పెట్టారని, అందుకే ఈ దాడిచేశామని ఇజ్రాయెల్ దబాయిస్తోంది. అది ప్రత్యక్షప్రసారాలు ఇవ్వడానికి ఎప్పటినుంచో ఉన్నది తప్ప, నిఘా కెమెరా కాదని మీడియా సంస్థలు అంటున్నాయి. పొరపాటుకు ఏమాత్రం ఆస్కారంలేని ప్రదేశంలో ఈ దాడి జరిగినందున, ఇజ్రాయెల్ ఎన్ని చెప్పినా, ఐదుగురు పాత్రికేయులను అది ఉద్దేశపూర్వకంగానే అంతం చేసిందని మీడియా నమ్ముతోంది. గాజాదురాక్రమణలో భాగంగా ఇజ్రాయెల్ దళాలు యుద్ధట్యాంకులతో మిగిలిన నిర్మాణాలను కూల్చివేస్తున్నాయని, తీవ్రంగా గాయపడిన పాలస్తీనియన్లను తరుముతున్నాయని వార్తలు వస్తున్నాయి. పాలస్తీనియన్లు కూలిన ఇళ్ళను పట్టుకొని వేలాడుతున్నారు, గాయపడుతున్నారు, చస్తున్నారు తప్ప, స్వస్థలాన్ని వదిలిపోవడం లేదు. వీరందరినీ ఆకలితోనూ, ఆయుధంతోనూ హతమార్చి గాజాను హస్తగతం చేసుకోవాలనుకుంటున్న నెతన్యాహూ ఈ మలివిడత దాడిలో మరింత హింసాకాండకు ఒడిగట్టబోతున్నారన్నది వాస్తవం. గాజా దుర్భిక్షంతో అల్లాడుతున్నదని ఇప్పుడు అధికారికంగా కూడా నిర్ధారణ అయింది. ఆకలిచావులవార్తలు ఎంతోకాలంగా ప్రపంచం వింటోంది. ఆహారసరఫరాలు నామమాత్రంగా సాగుతూంటే, ఆ ట్రక్కుల వెంట పరుగులు తీస్తున్నవారినీ, అన్నంకోసం గుమిగూడుతున్నవారినీ ఇజ్రాయెల్ దళాలు కాల్చిపారేస్తున్నాయి. గాజా వెలుపల వేలాది ట్రక్కులు అనుమతికోసం నిరీక్షిస్తుంటే, అర్థంలేని ఆంక్షలతో, నిషేధాలతో ఆహారం, ఔషధాలు గాజాలోకి రాకుండా ఇజ్రాయెల్ అడ్డుకుంటోంది. ఇంతటి తీవ్రమైన పరిస్థితుల్లో, ఇప్పుడు నగరాలకు దిగ్బంధం చేసి, వాటిని యుద్ధక్షేత్రాలుగా ప్రకటించి, ఆ కాస్త ఆహారాన్ని కూడా లోనకుపోనివ్వకుండా తన మలిదశ గాజా విధ్వంసాన్ని ఇజ్రాయెల్ అమలు చేయబోతోంది. పాత్రికేయుల ఊచకోత ఘటన అమెరికా అధ్యక్షుడిని కదిలించిందనీ, ఆయన యుద్ధాన్ని త్వరలోనే ముగించేందుకు కృషిచేస్తున్నారని కొన్ని కథనాలు వెంటనే ప్రచారంలోకి వచ్చాయి. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్ వంటివారిని వెంటేసుకొని ట్రంప్ ఏదో హడావుడి చేస్తున్నారు. కానీ, గాజాను అద్భుతమైన రిసార్టుగా చూడాలన్న కోరిక నెరవేర్చడానికి శ్రమిస్తున్న నెతన్యాహూను ఇప్పట్లో ట్రంప్ వారించే అవకాశాలు లేవు. గాజా తో పోల్చితే విధ్వంసంలోనూ, మానవహననంలోనూ ఆవగింజంతలేని ఉక్రెయిన్ యుద్ధం మాత్రం ఆయనకు అతి తీవ్రంగా, దుర్మార్గమైనదిగా కనిపిస్తోంది, దానిని వెంటనే ఆపి, నోబెల్‌శాంతి కొట్టేయాలనీ అనిపిస్తోంది.

సమన్వయ లోపంతోనే యూరియా కష్టాలు

తెలంగాణలో వానాకాలం పంటలకు అవసరమైన ఎరువులు దొరక్క రైతులు ఆందోళన చెందుతుంటే, ప్రభుత్వం మాత్రం స్థానిక ఎన్నికలపై దృష్టి సారించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఈ యూరియా కొరత ఎందుకు వచ్చింది?

తెలంగాణలో అన్నదాతలు యూరియా కోసం వానలో తడుస్తూ సరఫరా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం సరిహద్దుల వరకు ఇదే దృశ్యం. చివరికి విసిగి వేసారి రాస్తారోకోలు కూడా నిర్వహించారు. ఇది కేవలం రైతుల సమస్యగానే కాక, రాజకీయంగా కూడా చిచ్చు రేపుతోంది. వానాకాలంలో పత్తి, వరి పంటలకు యూరియా డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ ఖరీఫ్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా. కేంద్రం 9.8 లక్షల టన్నులు కేటాయించినా, ఆగస్టు నాటికి 5.4 లక్షల టన్నులే రాష్ట్రానికి చేరాయి. దాంతో 3 లక్షల టన్నుల లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రం మధ్య ఆరోపణల యుద్ధం, సమన్వయ లోపం వల్ల రైతులు నష్టపోయారు. సమయానికి ఒత్తిడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది.



2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత యూరియా అవసరం మరింత పెరిగింది. ఎకరానికి 170 కిలోల వినియోగం ఉంది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. భారీ వర్షాలతో యూరియా కొరత రాష్ట్రవ్యాప్తంగా మరింత తీవ్రమైంది. ప్రపంచ సరఫరా గొలుసులో అంతరాయాలు, సహజవాయువు ధరల పెరుగుదల, చైనా వంటి దేశాల ఎగుమతి పరిమితులు యూరియా దిగుమతులపై ప్రతికూల ప్రభావం చూపాయి. యుద్ధ ఉద్రిక్తతలు కూడా దిగుమతి సమస్యలను మరింత పెంచాయి.

వర్షాకాలం రాకముందే, మార్చి నెల నుంచే యూరియా నిల్వలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఘోరంగా విఫలమైంది. వర్షాకాలం సమీపిస్తోందని ముందుగానే అంచనా వేసి, యూరియా నిల్వల కోసం కేంద్ర అధికారులతో సంప్రదింపులు జరపడంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్ర అధికారులు, వ్యవసాయ శాఖ మంత్రి ఏప్రిల్–మే నెలల్లోనే ఢిల్లీకి వెళ్లి యూరియా నిల్వలను సమీకరించేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పద్ధతిని అనుసరించకపోవడం వల్లే ఈ రోజు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ హల్‌చల్ చేస్తోంది. సబ్సిడీ యూరియా పారిశ్రామిక అవసరాలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలు, అధిక ధరలు, కఠిన రేషన్ విధానాలు రైతులకు మరింత ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఇటీవలి కాలంలో డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (డీఈఎఫ్) వినియోగం గణనీయంగా పెరిగింది. నూతన డీజిల్ వాహనాలకు ఇది తప్పనిసరి కావడంతో, డీఈఎఫ్ తయారీలో యూరియాను వినియోగిస్తున్నారనే సమాచారం ఉంది. ఫలితంగా వ్యవసాయానికి కేటాయించిన సబ్సిడీ యూరియా పారిశ్రామిక అవసరాలకు మళ్లిపోయే అవకాశం ఉంది. ఈ దందాను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విజిలెన్స్ అధికారులను రంగంలోకి దించి, కఠిన చర్యలు తీసుకోవాలి.

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ 145 పని దినాల్లో 78 రోజులు నిలిచిపోయింది. సాంకేతిక సమస్యలు, అమ్మోనియం లీకేజీతో ఉత్పత్తి నిలిచిందని యాజమాన్యం చెబుతోంది. ఈ ప్లాంట్ సామర్థ్యం ఏటా 12 లక్షల టన్నులు. షట్‌డౌన్ ప్రభావం తెలంగాణ వాటాపై పడింది. యూరియా కొరత వెనుక ప్రపంచ, దేశీయ సరఫరా సమస్యలు, పెరిగిన సాగు, స్థానిక ఉత్పత్తి అంతరాయాలు, బ్లాక్ మార్కెటింగ్, రాజకీయ సమన్వయ లోపం ఉన్నాయి. రైతు కష్టాలు తీరాలంటే సమయానికి సరఫరా, పారదర్శక పంపిణీ, తగిన బఫర్ స్టాక్‌లు, సమన్వయంతో కూడిన ప్రణాళిక తప్పనిసరి. లేకపోతే ప్రతి ఏడాది రైతులకు కష్టాలే మిగులుతాయి.

○ బోయినపల్లి వినోద్ కుమార్
ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

130 : రాజ్యాంగ సూత్రాలకు సమాధి



■ పి. చిదంబరం

'పళని' పలుకు

రాజ్యాంగానికి సవరణ చేసేందుకు పార్లమెంటుకు గల అధికారాలు, అందుకు అనుసరించవలసిన విధానాన్ని అధికరణ 368 విశదీకరించింది. ఆ అధికరణ లోని నిబంధన 2, ఇతర విషయాలతో పాటు ఇలా ఉన్నది: 'రాజ్యాంగంలో ఏమి పేర్కొన్నప్పటికీ ఈ రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే, లేక మార్పు చేసే, లేక తొలగించే రాజ్యాంగబద్ధమైన అధికారం పార్లమెంటుకు ఉంటుంది. రాజ్యాంగ సవరణ విధానం ఈ క్రింద ఉదహరింపబడిన విధంగా ఉంటుంది.

"రాజ్యాంగ సవరణకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభలో గాని, లేక రాజ్యసభలో గాని మాత్రమే ప్రవేశపెట్ట వలెను. ఆ బిల్లును సభకు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆమోదించవలెను. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య సభ మొత్తం సభ్యుల సంఖ్యలో సగం కన్న ఎక్కువగా ఉండవలెను. లోక్‌సభలోను, రాజ్యసభలోను ఇదే విధంగా ఆమోదింపవలెను. ఆ విధంగా రెండు సభలు ఆమోదించిన తరువాత ఆ బిల్లును రాష్ట్రపతికి పంపవలెను. రాష్ట్రపతి ఆ బిల్లును తప్పనిసరిగా ఆమోదించవలెను. అప్పుడు బిల్లులో ఉదహరింపబడిన విధంగా రాజ్యాంగం సవరింపబడుతుంది".

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందగల సంఖ్యా బలం ఎన్డీఏ ప్రభుత్వానికి పార్లమెంటు ఉభయ సభలలోనూ లేదు. లోక్‌సభలో ఎన్డీఏ సభ్యులు 293 (మొత్తం సభ్యుల సంఖ్య 543) మంది మాత్రమే కాగా రాజ్యసభలోనూ పాలక కూటమికి కేవలం 133 మంది సభ్యులే (మొత్తం సభ్యుల సంఖ్య 245) ఉన్నారు. ఏ సభలో నైనా ఒక బిల్లు ఆమోదం పొందాలంటే, సభ్యులు అందరూ సభకు హాజరై బిల్లుపై ఓటింగ్‌లో పాల్గొంటే మూడింట రెండు వంతుల మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటువేసినప్పుడు మాత్రమే అది చట్ట ప్రతిపత్తి పొందడానికి అర్హమవుతుంది (ఓటింగ్‌కు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ సవరణ బిల్లును ఆమోదించాలి. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య మొత్తం సభలోని స్థానాలలో సగం కన్నా ఎక్కువగా ఉండాలి. ఉదాహరణకు ఒక సభలో మొత్తం సభ్యుల సంఖ్య 300 అనుకుందాం. సభకు 150 మంది హాజరయినారు. వారిలో 100 మంది ఆ సవరణను ఆమోదించారు. అయినా ఆమోదించినట్లు కాదు. ఎందుకంటే ఆ సవరణ మొత్తం సభ్యులలో మెజారిటీ ఆమోదం పొందలేదు కనుక. సభకు కనీసం 200 మంది హాజరై వారిలో 151 మంది ఆ సవరణను ఆమోదిస్తే సభ ఆమోదం పొందినట్లుగా పరిగణితమవుతుంది. ఉభయ సభలలోను ఇదే విధంగా ఆమోదం పొందాలి. ఇలా ఏ సభలోను ఆమోదం పొందలేక పోతే రాజ్యాంగ సవరణ వీగిపోయినట్లే). అయితే ప్రస్తుత రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు అవసరమైన మెజారిటీ పాలక ఎన్డీఏకు ఏ సభలోనూ లేదు.

ప్రతిపక్షాలు అన్నిటికీ కలిపి లోక్‌సభలో 250 మంది సభ్యులు, రాజ్యసభలో 120 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. కనుక ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ఏ సభలోను ఆమోదం పొందలేదు. లోక్‌సభలో 182 మంది సభ్యులు, రాజ్యసభలో 82 మంది సభ్యులు ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే అది ఆమోదం పొందదు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ప్రతిపక్షాలు అన్నీ ఎన్డీఏకు వ్యతిరేకంగా లేవు. వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్, భారత రాష్ట్ర సమితి, బహుజన్ సమాజ్ పార్టీ, ఇంకా కొన్ని చిన్న పార్టీలు ఎన్డీఏ ప్రభుత్వానికే మద్దతునిస్తున్నాయి. ఏఐటీసీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్డీఏను వ్యతిరేకిస్తున్నాయి. అయితే ఇండియా కూటమికి వాటి మద్దతు అంశాల ప్రాతిపదికన ఉంటుంది.

ఈ పరిస్థితులలో ఎన్డీఏ ప్రభుత్వం 'రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు–2025'ని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. వెన్వెంటనే ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనకు నివేదించారు. చాలా సరళంగా కన్పిస్తున్న ఈ బిల్లు లక్ష్యమేమిటి? ఐదు సంవత్సరాలు, అంతకు మించి జైలుశిక్షకు అర్హమయ్యే నేరాభియోగాలతో అరెస్టయిన మంత్రులు (ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సైతం) జైలులో 30రోజులు ఉంటే పదవీచ్యుతులు అవుతారు. ఆ ముప్పై రోజులలో దర్యాప్తు పూర్తికావడం అసాధ్యం. చార్జిషీటును దాఖలు చేయడమూ జరిగే పని కాదు. ఆరోపణలు ఉండవు, విచారణ జరగదు, శిక్ష నిర్ధారణ కాదు. అయినప్పటికీ 31వ రోజున 'నేరస్థుడు' అనే కళంకంతో పదవిని కోల్పోతాడు!

ఈ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ, రాజకీయ నైతికతకు పరాకాష్ఠ అని భారతీయ జనతా పార్టీ ఘోషిస్తోంది. ఏమిటి ఆ పార్టీ వాదన? 'అవినీతిపరుడు' అయిన ఒక మంత్రిని పదవి నుంచి తొలగించడం కంటే ఉన్నతాదర్శం మరేముంటుంది? ఒక మంత్రి (లేదా ముఖ్యమంత్రి) జైలు నుంచి పరిపాలన చేయవచ్చా? చెప్పవచ్చిన దేమిటంటే బీజేపీ దృష్టిలో ఈ బిల్లును సమర్థించే వారు నిజమైన దేశభక్తులు, జాతీయవాదులు; వ్యతిరేకించే వారు జాతి వ్యతిరేకులు, అర్బన్ నక్సల్స్, పాకిస్థానీ ఏజెంట్లు.

ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నేర విచారణ చట్టం అమలవుతున్న తీరు తెన్నులు తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. న్యాయం సమకూరడమనేది సందేహాస్పదమవుతోంది. ఎందుకో చూద్దాం: జీఎస్టీ చట్టాలతో సహా అన్ని చట్టాలను రాజకీయ ప్రత్యర్థులపై ఆయుధాలుగా ప్రయోగిస్తున్నారు; (కానిస్టేబుల్‌తో సహా) ఏ పోలీసు అధికారి అయినా వారంట్‌తోనో లేక వారంట్ లేకుండానో ఏ వ్యక్తినైనా అరెస్టు చేయవచ్చు... కేసు పెట్టదగిన నేరానికి పాల్పడినట్టు ఎవరిపైన అయినా సహేతుకమైన అనుమానం ఉంటే సదరు వ్యక్తిని అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉన్నది; 'బెయిల్ అనేది నియమం, జైలు అనేది మినహాయింపు' అని జస్టిస్ కృష్ణయ్యర్ ధర్మ ప్రవచనం చేసినప్పటికీ ట్రయల్ కోర్టులు బెయిల్ మంజూరు చేసేందుకు ఇష్టపడడం లేదు; ప్రథమ విచారణలో హైకోర్టులు బెయిల్ మంజూరు చేయవు. ఏదో ఒక సాకుతో బెయిల్ ఇవ్వకుండా విచారణ కొనసాగించి, 60–90 రోజుల అనంతరం బెయిల్ మంజూరు చేయడం పరిపాటిగా ఉన్నది; ఈ శోచనీయ వ్యవహారాల ఫలితంగా దేశ సర్వోన్నత న్యాయస్థానంలో రోజూ డజన్ల కొద్దీ బెయిల్ పిటిషన్లు దాఖలవుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే సుప్రీంకోర్టు సైతం ట్రయల్ కోర్టు విధులు నిర్వర్తించవలసి వస్తోంది; 130వ రాజ్యాంగ సవరణ బిల్లులో ప్రధానమంత్రిని కూడా చేర్చడం హాస్యాస్పదం. ఏ పోలీసు అధికారీ ప్రధానమంత్రిని అరెస్టు చేసేందుకు సాహసించడు.

ఈ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయేలా చేసేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని ఇండియా కూటమి, తృణమూల్ కాంగ్రెస్ సులువుగా కూడగట్టుకోగలుగుతాయి. అయినప్పటికీ ఈ బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడం ఖాయమనే ఆత్మ విశ్వాసంతో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నది. ఉభయ సభలలోను కొన్ని ప్రతిపక్షాల లేదా ఎంపీల మద్దతు పొందగల ఉపాయమేదో ప్రభుత్వానికి ఉన్నట్టుగా ఉంది. బహుశా, ఓటింగ్ రోజున కొంత మంది విపక్ష ఎంపీలు 'అదృశ్యమయ్యే' చాణక్యానికి ప్రభుత్వం పాల్పడవచ్చు. లేదూ, ఇంకేదైనా వ్యూహం ప్రభుత్వానికి ఉన్నదేమో గానీ అది నా అవగాహనకు మించినది.

ఈ బిల్లు విషయమై ప్రధానమంత్రి, హోంమంత్రి ఇప్పటికే సమర నాదాలు చేశారు. అది తప్పక పార్లమెంటు ఆమోదం పొందుతుందని ఘంటాపథంగా చెబుతున్నారు. సరే, 'విధేయ' మీడియా వారి మాటలు, వాదనలు వల్లె వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు బిహార్ (2025), అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ (2026) ముగిసేంతవరకు ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై జాయింట్ సెలెక్ట్ కమిటీ ఎటువంటి నిర్ణయం తీసుకోదు.

మీడియా వార్తల ప్రకారం 2014 నుంచి ప్రతిపక్షాలకు చెందిన 12 మంది మంత్రులను అరెస్టు చేశారు. వారిలో చాలా మందికి నెలల తరబడి బెయిల్ మంజూరు కాలేదు. అలాగే 2014 నుంచి తీవ్ర నేరాభియోగాల నెదుర్కొంటున్న 25 మంది రాజకీయ నాయకులు బీజేపీలో చేరారు. చేరిన వెంటనే వారందరూ నేరారోపణల నుంచి విముక్తుల య్యారు! నాకు గుర్తున్నంతవరకు 2014 నుంచి బీజేపీకి చెందిన ఏ మంత్రి కూడా అరెస్టు కాలేదు. రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు–2025 పార్లమెంటు ఆమోదం పొందితే, ప్రతిపక్ష నాయకులను పదే పదే అరెస్టు చేసి జైలుపాలు చేసే బెలారస్, బంగ్లాదేశ్, కంబోడియా, కెమెరూన్, కాంగో (డిఆర్‌సి), మయన్మార్, నికరాగువా, పాకిస్థాన్, రష్యా, రువాండా, ఉగాండా, వెనిజులా, జాంబియా, జింబాబ్వేల సరసన చేరుతుంది. ఇది ప్రతిష్ఠాకరమేనా? సమాధానం స్పష్టమే. రాజకీయ పార్టీలు గట్టిగా వ్యతిరేకిస్తే ఆ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందడంలో విఫలమవుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)



రాజకీయ పార్టీలు గట్టిగా వ్యతిరేకిస్తే రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు–2025 పార్లమెంటు ఆమోదం పొందడంలో విఫలమవుతుంది. ఆమోదం పొందితే, ప్రతిపక్ష నాయకులను పదే పదే అరెస్టు చేసి జైలుపాలు చేసే బెలారస్, బంగ్లాదేశ్, కంబోడియా, కెమెరూన్, కాంగో (డిఆర్‌సి), మయన్మార్, నికరాగువా, పాకిస్థాన్, రష్యా, రువాండా, ఉగాండా, వెనిజులా, జాంబియా, జింబాబ్వేల సరసన మన దేశమూ చేరుతుంది.

అయోమయంలో ఆంధ్రప్రదేశ్ ఆక్వా

మనదేశ ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రధానపాత్ర పోషిస్తోంది. ఈ రంగంపై ఆధారపడి రాష్ట్రంలో ప్రత్యక్షంగా 15 లక్షల మంది ఉపాధి పొందుతుండగా, పరోక్షంగా దాదాపు 20లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. మన దేశ ఆక్వా ఎగుమతులకు ఎంతో కాలంగా అమెరికా ప్రధాన కేంద్రంగా ఉంది. ఇటీవల ట్రంప్ విధించిన దిగుమతి సుంకాల దెబ్బతో ఈ రంగం తీవ్రంగా ప్రభావితమవుతున్నది. ఆక్వా ఎగుమతుల పరంగా అమెరికాపై ఎక్కువగా ఆధారపడటం, ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వాలు ముందస్తుగా దృష్టి సారించకపోవడం, అంతర్గతంగా దేశీయ మార్కెట్లో ఈ ఉత్పత్తుల వినియోగంపై బుద్ధిపూర్వక నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం వంటి అనేకానేక కారణాలు నేడు ఏపీలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న అయోమయ, ఆందోళనకర పరిస్థితులకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారణమవుతున్నాయి.



మనదేశం నుంచి అమెరికాకు చేసే ఇతర ఎగుమతులతో పోలిస్తే ఆక్వా ఉత్పత్తులకు సంబంధించి నిర్దీతమైన కాల పరిమితులున్నాయి. అప్పటికప్పుడు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కుని, ఆక్వా ఉత్పత్తులను విక్రయించే సౌకర్యాలు ఏ మాత్రం అందుబాటులో లేవు. ఈ ఉత్పత్తుల్లో అధిక వాటాను ఆక్రమించే రొయ్యలను ఒడ్డుకు చేర్చిన నిర్దీత గడువులోగా మార్కెటింగ్ చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆ ఆహార పదార్థాలు వినియోగానికి పనికిరాకుండా పోయి, ఉత్పత్తిదారులు పూర్తిస్థాయిలో నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

గత ఆర్థిక సంవత్సరంలో మనదేశం ఎగుమతి చేసిన 62,408 కోట్ల రూపాయల విలువైన మొత్తం ఉత్పత్తుల్లో దాదాపు 44 శాతం రొయ్యల ఎగుమతులున్నాయి. ఈ ఉత్పత్తుల్లో అమెరికాకు 36.4 శాతం, చైనాకు 17.2 శాతం, యూరప్ దేశాలకు 15శాతం ఎగుమతులు నమోదయ్యాయి. గత ఏడాది మన దేశం ఉత్పత్తి చేసిన 17లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ నుంచే దాదాపు 11లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యల ఉత్పత్తి నమోదయ్యింది.

మన దేశ చేపల ఉత్పత్తిలోనూ ఒక్క ఏపీ మాత్రమే దాదాపు మూడోవంతు ఉత్పత్తిని సాధిస్తూ, దేశం ఆర్జిస్తున్న విదేశీ మారక ద్రవ్యంలోనూ సుమారు మూడోవంతు భాగస్వామ్యాన్ని రాష్ట్ర ఆక్వా రంగం జోడిస్తున్నది. రాష్ట్రంలోని పలు జిల్లాల వ్యాప్తంగా 5,72,065 ఎకరాల్లో చేపల చెరువులు విస్తరించి ఉన్నాయి. రెండు లక్షల ఎకరాల్లో సంప్రదాయ నీటి వనరుల నుంచి చేపలు, రొయ్యల సాగును కొనసాగిస్తున్న లక్షలాది మంది మత్స్యకారులున్నారు.

ఇంతటి ప్రాధాన్యాన్ని కలిగిన ఆక్వా రంగం సంక్షోభంలో కూరుకుపోకుండా ప్రభుత్వాలు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని, యుద్ధ ప్రాతిపదికన అమలు పరచాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు తాత్కాలిక ఉపశమనాలకంటే దీర్ఘకాలిక ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించడమే ఎక్కువగా మేలు చేకూరుస్తుంది. ఏపీ నుంచి అనేక దశాబ్దాలుగా ఎక్కువ మోతాదులో ఉత్పత్తి చేస్తున్న 'వెనామి' రొయ్యల సాగుపై మాత్రమే దృష్టి కేంద్రీకరించకుండా, పలు దేశాల్లో వినియోగానికి ఆస్కారం ఉన్న ఇతర రకాలైన చేపలు, రొయ్యల వంగడాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. అనేక దశాబ్దాలుగా కొనసాగిస్తున్న శీతలీకరణ పద్ధతుల్లో రొయ్యలు ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు వీలున్న ఇతర మార్గాలను అన్వేషించడంతో పాటుగా, ఆ రంగానికి ఉపకరించే ప్రోత్సాహకాలనూ ప్రభుత్వపరంగా అందించాల్సిన అవసరం ఉన్నది. ఇందులో ప్రధానంగా 'వాక్యూమ్ ఫ్రీజ్ డ్రైయింగ్' లాంటి అత్యాధునిక విధానాలను అనుసరించడం ద్వారా ప్రాసెస్ చేసిన రొయ్యలను దాదాపు ఇరవై ఏళ్ల పాటు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది! ఫలితంగా మార్కెటింగ్‌లో ఒత్తిళ్లు పూర్తి స్థాయిలో తగ్గిపోయి అంతిమంగా రైతులకు, సరఫరాదారులకు, ఎగుమతిదారులకు కాలపరిమితులకు సంబంధించిన వెసులుబాటు లభిస్తుంది.

ఎన్నో ఏళ్లుగా కేవలం అమెరికా మార్కెట్ మీద మాత్రమే ఆధారపడిన ఎగుమతుల విధానాన్ని సవరించుకుని మన దేశం నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతులను చేసుకోగలిగే ప్రత్యామ్నాయ మార్కెట్ వెసులుబాటు ధోరణులను అనుసరించడం మరింత శ్రేయస్కరంగా ఉంటుంది. అన్నింటికంటే ముఖ్యంగా ఇంత కాలంగా బుద్ధిపూర్వకంగా విస్మరించిన దేశీయ మార్కెట్లలో స్థానిక ఆక్వా ఉత్పత్తులను 'రెడీ టు కుక్, రెడీ టు ఈట్' లాంటి విలువల జోడింపు (వాల్యూ యాడెడ్) విధానాల్లోకి మార్చుకునే ఆధునిక సాంకేతిక ఫుడ్ ప్రాసెసింగ్ పద్ధతులను అనుసరించడం ఆక్వా రంగ రైతులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. ఏది ఏమైనా ఆక్వా రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

• పిట్టల రవీందర్
'తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్' పూర్వ అధ్యక్షుడు

పెట్టుబడిదారీ శాపనార్థాలు చాలించాలి!

'విప్లవం..చాలించాలి' అనే పేరుతో, 'మార్క్సిజం' మీద వి.వి.సుబ్రహ్మణ్యం పెట్టిన శాపనార్థాల వ్యాసం (ఆగస్టు 16) చదివాక, దానిమీద కలగజేసుకోడం తప్పనిసరి అనిపించింది నాకు. నా రాత వల్ల వ్యాసకర్తకి ఏదో తెలియాలని కాదు. అటువంటి భ్రమలు లేవు నాకు. మార్క్సిజం గురించి అంతగా తెలియని పాఠకుల కోసమే ఇది! మార్క్సిజంతో పూర్తి ఏకీభావం ఉన్న వ్యక్తిగా ఇది రాస్తున్నాను. ముందుగా, మార్క్సిజం మీద వ్యాసకర్త శాపనార్థాలు వినండి! (1) మార్క్సిజం, "రోగం కన్నా హానికరమైన మందు!", "విషప్రాయమైన ఔషధం!" –ఇక్కడ 'రోగమూ', 'మందూ' అనే వాటి గురించి చెపుతాను. ఏ యజమాని అయినా, ఏ పరిశ్రమలో అయినా, పనివాళ్ళ శ్రమ విలువల నించి, దొరికినంత శ్రమ విలువని, 'లాభం' పేరుతో, డబ్బు రూపంలో, తన స్వంత శ్రమ అంటూ లేకుండా, సంపాదించే శ్రమ దోపిడీయే 'రోగం!' దాని గురించి తెలుసుకుని, దాన్ని వ్యతిరేకించి, ఆ దోపిడీ నించి పూర్తిగా విముక్తి చెందాలన్నది మార్క్సు బోధన. ఈ బోధననే, వ్యాసకర్త 'హానికరమైన మందు'గా ప్రకటించి, 'శ్రమ దోపిడీ' అనే మాటని మాత్రం తన వ్యాసంలో ఎక్కడా చెప్పలేదు. ఇంకా కొన్ని శాపనార్థాలు వినండి! (2) "మార్క్సిజం ఒక 'వికృత సిద్ధాంతం!'" అట! (3) మార్క్సిజం చూపిన దారి, అధోగతికి రహదారి!" అట! (4) "మార్క్సిజం ఒక కుహనా రాజకీయ తార్కిక సిద్ధాంతం!" అట! – పెట్టుబడిదారీ శ్రమ దోపిడీని తీసెయ్యాలని చెప్పే మార్క్సిజం మీద ఇలా సాగింది, వ్యాసకర్త శాపనార్థాల చిట్టా!


మార్క్సు సిద్ధాంతం మీద ఇలా శాపనార్థాలు పెట్టిన సుబ్రహ్మణ్యాలు ఇతర దేశాలలో కూడా కొందరు కనబడ్డారు గతంలో! మచ్చుకి (1) 'రేమండ్ యారన్' అనే ఫ్రాన్స్ దేశపు సుబ్రహ్మణ్యం ఒకరు! ఇతగాడు, మార్క్సిజాన్ని ఉద్దేశించి, అది 'మేధావుల పాలిట మత్తుమందు' ('ది ఓపియం ఆఫ్ ఇంటలెక్చువల్స్') అనే పేరుతో ఏకంగా ఒక పుస్తకమే రాశాడు. (2) ఇటలీ దేశపు సుబ్రహ్మణ్యం ఇంకొకరు! 'గెటానో మాస్కా' అనే ప్రబుద్ధుడు, 'పాలక వర్గం' ('ది రూలింగ్ క్లాస్') అనే తన పుస్తకంలో (పేజీ– 518), మార్క్సు శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా రాసిన 'కాపిటల్ పుస్తకంలో ఎంతెంత తప్పులున్నాయో ఇలా చెప్పాడు: 'కాపిటల్ పుస్తకంలో, ప్రతీ పేజీలోనూ వర్గాల మధ్య విధ్వంసకర ద్వేషాన్ని ప్రచారం చేస్తాడు మార్క్సు!' అని ఆరోపించాడు. ఇతర దేశాల సుబ్రహ్మణ్యాల విమర్శల గురించి, నాలుగేళ్ళ కిందట, 'మార్క్సిజం మీద విమర్శలకు జవాబులు' అనే పేరుతో నేను ఒక చిన్న పుస్తకం రాశాను. ఇప్పుడు, మన రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యం చేసిన విమర్శలకి, క్లుప్తంగా నా జవాబులు ఇవీ:

(1) "మార్క్సు చెప్పిన విధంగా ఏ ఒక్క చోటా విప్లవం రాలేదు" – అని వ్యాసకర్త విమర్శ! మార్క్సు చెప్పిన విధంగా చేశారా? విప్లవం రాలేదంటే, చెప్పినట్టు చేస్తేనే కదా, విప్లవం వచ్చేది? కానీ, గతంలో రష్యా, చైనాల్లో జరిగిన విప్లవాలు, ఆ మార్గంలో పడిన కొన్ని తొలి అడుగులు మాత్రమే! శ్రమ దోపిడీ నించీ విముక్తి గురించి చెప్పే మార్క్సిజాన్ని, ఆ దేశాలలోని కమ్యూనిస్టులే, తామే తగినంతగా గ్రహించకపోవడమూ; దానిని శ్రామిక జనాలలో విస్తారంగా వ్యాప్తి చెయ్యలేకపోవడమూ ప్రధాన కారణం. అంతేగానీ, అది మార్క్సు సిద్ధాంతంలో లోపం కాదు. (2) "చరిత్ర క్రమంలో, ఎవ్వరూ ఆపలేని విధంగా విప్లవం దానంతట అదే వస్తుందని 'మానిఫెస్టో'లో మార్క్సు చెప్పాడని" వ్యాసకర్త నిరాధారమైన వాదన! 'కమ్యూనిస్టు పార్టీ మేనిఫెస్టో'లో ('కార్మికులూ, కమ్యూనిస్టులూ' అన్న చాప్టరులో) చెప్పింది ఏమిటో చూడండి! "కార్మికులు ఒక వర్గంగా రూపొందాలి! బూర్జువా ఆధిపత్యాన్ని కూలదోయాలి! కార్మిక వర్గం రాజకీయ అధికారాన్ని గెలుచుకోవాలి!"... "కార్మికవర్గ విప్లవంలో మొదటి మెట్టు, కార్మిక వర్గం పాలక వర్గం కావడం! బూర్జువా వర్గం నించీ సమస్త పెట్టుబడినీ– అంటే, ఉత్పత్తి సాధనాలన్నిటినీ స్వాధీనం చేసుకోవాలి!" –ఇది కదా మార్క్సు వాళ్ళు చెప్పింది? మరి, వ్యాసకర్త వక్రీకరించినట్టు, 'విప్లవం దానంతట అదే వస్తుందని' చెప్పిందెక్కడ? (3) "పెట్టుబడిదార్లను ద్వేషించినంతగా మార్క్సు ఇంకెవరినీ ద్వేషించలేదేమో!" అని తెగ వాపోతున్నాడు మన వ్యాసకర్త! 'శ్రమదోపిడీ' మీద బతికే వర్గాన్ని ద్వేషించాలా, పూజించాలా? (4) "పెట్టుబడుల్ని తీసుకొచ్చి, సంపద సృష్టించి, అభివృద్ధిని సాధించాలనే విధానాన్ని" ఈ వ్యాసకర్త తెగ మెచ్చుకోవడానికి అర్థం ఏమైనా ఉందా? సంపదని సృష్టించేది ఎవరు? కార్మికులు! లాభాల రూపంలో ఆ సంపద ఎవరికి అందుతుంది? పెట్టుబడిదారీ వర్గానికి! (5) చివరిగా, వ్యాసకర్త చేసిన ఒక వివేకవంతమైన ఉపదేశం ఉంది. ఏమిటంటే: "పెట్టుబడిదారులూ, కార్మికులూ సమాజ ప్రగతికి అవసరం గనక, ఒకరి వల్ల ఒకరికి అన్యాయం కలగకుండా చేసుకోవాలేగానీ, ఏదో ఒక వర్గాన్ని నిర్మూలించేయడం అవివేకం" అని! ఒకరి వల్ల ఒకరికి అన్యాయమా? కార్మికుల వల్ల, యజమానులకు లాభమా, అన్యాయమా? యజమాని వల్ల కార్మికులకు అన్యాయం గాక న్యాయమా? పెట్టుబడిదారులూ, కార్మికులూ అనే వాళ్ళు, ఒకే రకం వాళ్ళు కాదు. పెట్టుబడిదారులు 'శ్రమలు' చేయరు. వాళ్ళు కార్మికుల శ్రమలను, 'లాభాల' పేరుతో దోచి బతుకుతారు. ఈ శ్రమ దోపిడీ సమస్యని పరిష్కరించడానికి మార్క్సిజం చెప్పే మార్గం: "సమాజంలో అందరూ, అన్ని రకాల శ్రమలూ శక్తి కొద్దీ చేస్తూ, చేసిన ఉత్పత్తుల్ని అందరూ అవసరం కొద్దీ వాడుకోవాలి" అని! అలా జరిగినప్పుడు, 'పెట్టుబడిదారులు' – 'కార్మికులు' అనే విభజనా ఉండదు; అసలు వర్గాలనేవే ఉండవు. అందరూ, సమిష్టి, సహకార ఉత్పత్తిదారులుగా (అసోసియేటెడ్ ప్రొడ్యూసర్స్) అయిపోతారు.


చివరిగా, వ్యాసకర్తకి, ఆయన వాడిన విశేషణాలే ఉపయోగించి, మార్క్సిజం ఇచ్చే వివేకవంతమైన సలహా ఏమిటంటే: 'హానికరమైన', 'విషప్రాయమైన', 'వికృత', 'కుహనా' పెట్టుబడిదారీ విధానం 'చేత కట్టించుకున్న పుస్తెను', వెంటనే తెంచేసుకోమని!

వ్యాసకర్త తేల్చింది, 'విప్లవం చాలించాలి!' అని. కానీ, చాలించవలసింది, విప్లవ ప్రయత్నాల్ని కాదు. పెట్టుబడిదారీ శాపనార్థాల్ని! పెట్టుబడిదారీ పిల్లి శాపనార్థాలతో, మార్క్సిజం ఉట్టి తెగిపడదు!

శ్రమ దోపిడీ సమస్యని పరిష్కరించడానికి మార్క్సిజం చెప్పే మార్గం: "సమాజంలో అందరూ, అన్ని రకాల శ్రమలూ శక్తి కొద్దీ చేస్తూ, చేసిన ఉత్పత్తుల్ని అందరూ అవసరం కొద్దీ వాడుకోవాలి" అని! అలా జరిగినప్పుడు, 'పెట్టుబడిదారులు' – 'కార్మికులు' అనే విభజనా ఉండదు; అసలు వర్గాలనేవే ఉండవు. అందరూ, సమిష్టి, సహకార ఉత్పత్తి దారులుగా (అసోసియేటెడ్ ప్రొడ్యూసర్స్) అయిపోతారు.



■ రంగనాయకమ్మ





నాగేశ్వర్‌రావు ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు. పక్కన నాగేశ్వర్‌రావు(ఫైల్)

'బండి' జోరుకు బ్రేకులు

- అక్రమాస్తుల కేసులో ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వరరావు అరెస్టు
- ఏకకాలంలో మూడు చోట్ల ఏసీబీ అధికారుల సోదాలు
- చైతన్యపురిలోని నివాసంలో బంగారం, డాక్యుమెంట్ల స్వాధీనం
- గుర్తించిన ఆస్తుల విలువ రూ.5 కోట్లపైనే..

వరంగల్ క్రైం/ఖిలా వరంగల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారి అక్రమాస్తుల డొంక కదిలింది... ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్న బండారం బయటపడింది. వరంగల్ జిల్లా పరిధిలోని ఖిలా వరంగల్ మండల తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావును అక్రమాస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేయడం కలకలం రేపింది. ఆయన ఇంటిపై శుక్రవారం జరిగిన ఏసీబీ దాడులు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెవెన్యూశాఖలో కలకలం రేపాయి. నాగేశ్వర్‌రావు గతంలో హసన్‌పర్తి, కాజీపేటలో పనిచేశారు. ప్రస్తుతం ఖిలా వరంగల్‌లో పనిచేస్తున్నారు. కొన్నాళ్లుగా ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ సంబంధిత పనులు చేయడంలో పెద్ద మొత్తంలో డబ్బులు కూడబెట్టుకున్నట్టు ఫిర్యాదులున్నాయి. అలాగే (మిగతా 6వ పేజీలో)

ప్రపంచ పారా అథ్లెటిక్స్‌కు దీప్తి, అకీరా



జీవాంజి దీప్తి, అకీరానందన్

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబర్ 27 నుంచి జరగనున్న ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు బరిలో నిలవనున్నారు. కిందటేడు పారిస్‌లో జరిగిన పారా ఒలంపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన వరంగల్ జిల్లాకు చెందిన జీవాంజీ దీప్తి, మరో అథ్లెట్ బానోతు అకీరానందన్ ఈ పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబరు 5 వరకు జరిగే ఈ పోటీలలో భారత దేశం నుంచి 73 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా దీప్తి, అకీరానందన్‌లను ఎంపిక చేసినట్టు రాష్ట్ర పారా ఒలంపిక్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం వెల్లడించారు. మహిళల 400 మీటర్ల (టీ20) పరుగులో దీప్తి, పరుషుల 400 మీటర్ల (టీ35/38) రేసులో అకీరానందన్ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా దీప్తి, అకీరానందన్‌లను రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.శేఖర్, జి.ప్రశాంత్‌తోపాటు రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందించారు.

భద్రకాళి ఆలయ ఈవోగా సంధ్యారాణి



వరంగల్ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ప్రసిద్ధ భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో)గా కె.ఎన్.సంధ్యారాణి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఈవోగా కొనసాగుతున్న ఆర్.సునిత తిరిగి దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా కొనసాగుతారు. 29 రోజుల కిందటే ఈవోగా బాధ్యతలు చేపట్టిన సునితను ఆకస్మికంగా బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. తాజా చర్యకు రాజకీయ ఒత్తిళ్లే కారణమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



మెట్రో రైలు పట్టాలెక్కేనా..?!

వరంగల్ మహానగరంలో భారీగా పెరుగుతున్న ట్రాఫిక్

- 2019లో మెట్రో రైలుకు రూ.1,341కోట్ల అంచనాలతో డీపీఆర్
- కాజీపేట నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 21 స్టేషన్లు, 15.5 కి.మీ. మేర లైన్
- 2021 మార్చిలో నియో మెట్రోలో భాగస్వామ్యం కోసం కేంద్రానికి ప్రభుత్వం లేఖ
- నగర విస్తరణ, శీఘ్ర అభివృద్ధి పనులతో తెరపైకి మెట్రోరైల్ డిమాండ్
- కేంద్రంపై ఒత్తిడి లేక నగరవాసులకు కలగానే మెట్రో ప్రయాణం
- కొత్త రూట్లతో మెట్రో రైల్ ఏర్పాటుకు చొరవ చూపాలంటున్న నగరవాసులు

7

మెట్రో రైల్... వరంగల్ మహా నగరవాసులను ఎన్నాళ్లుగానో ఊరిస్తున్న స్వప్నం. అటు జనాభాలో, ఇటు అభివృద్ధిలో వేగంగా విస్తరిస్తూ, రాష్ట్రానికి రెండో రాజధానిగా ఖ్యాతి పొందుతున్న వరంగల్‌కు మెట్రోరైల్ ఎంతో అనువైన రవాణా రంగం. అయితే పాలకుల అలక్ష్యం మూలంగా ఈ ఆధునిక రవాణా వ్యవస్థ పట్టాలు ఎక్కడం లేదు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఒకవైపు ఎయిర్‌పోర్టు, మల్టిపుల్ కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్‌టైల్ పార్కులాంటి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తోంది. మరోవైపు ఇరుకైన నగర రహదారుల్లో ఐదారు కిలోమీటర్లు ప్రయాణించాలన్నా.. గంటలకొద్దీ సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో మెట్రోరైల్‌ను పట్టాలెక్కించాలని నగరవాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 2019లో హైదరాబాద్ తరహాలో చారిత్రక నగరంలో మెట్రో రైలు కోసం ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ట్రైసిటీని అనుసంధానిస్తూ 15.5కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణంతోపాటు ఇతర వాటికి కోసం రూ.1,341 కోట్లతో అధికారులు డీపీఆర్‌ను ప్రభుత్వానికి నివేదించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మెట్రో రైలు కలగానే మిగిలిందనే ఆవేదన నగరవాసుల్లో ఉంది. రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్న వరంగల్‌కు పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా మెట్రో రైల్ పట్టాలెక్కాల్సిందేననే డిమాండ్ తెరపైకి వస్తోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ మంజూరు

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులకు మేలు
- ఫలించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య కృషి

హనుమకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ త్వరలోనే ప్రారంభం కానున్నది. దీని కోసం వరంగల్ ఎంపీ కడియం కావ్య చాలాకాలంగా ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు ఆమె కృషి ఫలించింది. ఈ సెంటర్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకానికి కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అండర్ సెక్రెటరీ ఓం ప్రకాశ్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 22 కొత్త సీజీహెచ్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఒకటి వరంగల్‌లో ఏర్పాటు అవుతోంది. ఈ 22 కొత్త సెంటర్ల నిర్వహణకు మొత్తంగా 286 పోస్టులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా వరంగల్‌లో ఏర్పాటయ్యే సెంటర్‌కు 13పోస్టులను కేటాయించారు. నలుగురు జనరల్ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు ఫార్మసిస్టులు (అల్లోపతి), ఒక జూనియర్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ఒక నర్సింగ్ ఆఫీసర్, ఇద్దరు మెడికల్ అటెండెంట్లు, ఒక లేడీ మెడికల్ అటెండెంట్, ఒక ఎంటీఎస్ వీరిలో ఉన్నారు. ఈ వెల్‌నెస్ సెంటర్‌ను ఎక్కడ ఏర్పాటు చేసేది ఇంకా నిర్ణయం కాలేదు. తగిన భవనం కోసం అన్వేషిస్తున్నారు. అన్ని హంగులతో కూడిన భవనం దొరకగానే వెల్‌నెస్ సెంటర్ పని చేయడం ప్రారంభమవుతంది.

కరోడ్(గణ)పతి



శివనగర్‌లో గణపతి మండపాన్ని రూ.కోటి 53 లక్షల కరెన్సీ నోట్ల దండలతో అలంకరించిన దృశ్యం

- రూ. కోటి 53 లక్షలతో ధనలక్ష్మి పూజ
- శివనగర్‌లో కరెన్సీనోట్లతో అలంకరించిన వర్తకులు

ఖిలావరంగల్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వరంగల్ శివనగర్‌లో గణపతి కరోడ్‌పతిగా దర్శనమిచ్చి అందరినీ ఆకర్శిస్తున్నారు. స్థానిక భక్తులు రూ.కోటి 53 లక్షల కరెన్సీ నోట్లతో దండలు అల్లి గణపతిని అలంకరించారు. ఉత్సవాల్లో మూడోరోజు శుక్రవారం శివనగర్‌లో వాసవి ట్రస్టు, వినాయక ట్రస్ట్ భవన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రూ. 500, 200, 100, 50, 20, 10నోట్లతో కిట్టి పార్టీ సభ్యులు దండలను అల్లి గణపతి మండపంవద్ద అలంకరించారు. 22 సంవత్సరాలుగా ఇక్కడ గణపతిని కరెన్సీతో అలంకరిస్తున్నారు. 2023లో రూ.కోటి 18లక్షలు, 2024లో రూ.కోటి 51లక్షలు, ప్రస్తుతం రూ.కోటి 53లక్షల కరెన్సీతో దండలు అల్లారు. అనంతరం రాత్రి 10గంటల అనంతరం కరెన్సీ దండలను విప్పి భద్రపరిచారు. కాగా, నగరంలోని అన్ని వర్గాల వ్యాపారులతోపాటు ఉద్యోగులు సైతం తమ డబ్బులను గణపతి వద్ద పెట్టి గత 22 సంవత్సరాలుగా పూజలు చేస్తున్నారు. ఇలా చేస్తే వ్యాపారంలో కలిసివస్తుందని వారి నమ్మకం. దీంతో యేటా శివనగర్‌లోని వాసవి ట్రస్టు సభ్యులతో పాటు సుమారు 50నుంచి 100 మంది వరకు ఇతరులు తమ డబ్బులను ధనలక్ష్మి పూజలో పెట్టి పూజిస్తున్నారు. యేటా గణపతి నవరాత్రుల్లో శుక్రవారం రోజున ధనలక్ష్మి పూజ నిర్వహిస్తామని వాసవిట్రస్టు అధ్యక్షుడు సాదుల దామోదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రావికంటి అశోక్, కోశాధికారి ఉప్పుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మంచాల కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు మీస సత్యనారాయణ, పుప్పాల యుగేందర్, అంచూరి కిషోర్, నాయిని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వన దేవతల గద్దెల రూపులో మార్పులు



వన దేవతలకు మొక్కులు చెల్లిస్తున్న మంత్రి సీతక్క

- వరుస క్రమంలో ఏర్పాటు చేస్తాం
- మేడారం అభివృద్ధికి రూ.150 కోట్ల నిధులు
- అధికారులతో సమీక్షలో మంత్రి సీతక్క

తాడ్వాయి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వన దేవతల గద్దెల రూపు మారనున్నట్టు రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మేడారం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశం మందిరంలో శుక్రవారం మంత్రి సీతక్క జిల్లా అధికారులు, పూజారులు, ఆర్కియాలజిస్ట్ రాజశేఖర్‌తో కలిసి సమీక్ష, సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మేడారం శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసిందన్నారు. వందల సంవత్సరాలు నిలిచేలా తల్లుల గద్దెలను అభివృద్ధి చేస్తామన్నారు. రాబోయే ముందు తరాలకు సమ్మక్క సారలమ్మల చరిత్రలు తెలిసేలా ఈ రూపకల్పన ఉంటుందన్నారు. ఈ క్రమంలో 2026 మహాజాతర అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. జాతర లోపు మొదటి విడుత పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణం విస్తరణ, గోవింద రాజు, పగిడిద్దరాజుల గద్దెల స్థల మార్పులు, చేర్పులు, క్యూలైన్ల విస్తరణ, నూతన మీడియా పాయింట్ భవనం, ముఖ్యమంత్రి అతిథి భవనం, పూజారుల వసతి భవనం, క్లౌడ్ లైటింగ్, వీవీఐపీ టవర్స్, ఇతర అతిథి భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు త్వరితగతిన టెండర్లు పూర్తి చేయాలని అన్నారు. భక్తులకు సులువైన దర్శనం కలిగే విదంగా గద్దెలను వరుస క్రమంలో ఏర్పాటు చేయనున్నామన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు తెలియని కొందరు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ వనదేవతల అభివృద్ధిని హేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల సంవత్సరాలు నిలిచేలా గిరిజన దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం మంత్రి అధికారులతో కలిసి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం కమిషనర్లు అయోధ్యరెడ్డి, శ్రీనివాస్‌రావు

పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

ఆర్టీఐ చట్టం కమిషనర్లు అయోధ్యరెడ్డి, శ్రీనివాస్‌రావు 7

గోదావరి ఉగ్రరూపం

- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- వాజేడు వద్ద అంతర్‌రాష్ట్ర రాకపోకలకు అంతరాయం
- సమ్మక్కసాగర్ బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి
- ములుగు జిల్లాలో పలు మండలాలకు వరద ముప్పు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఏటూరునాగారం రూరల్/వాజేడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లాలో గోదావరి నది ఉరలేస్తోంది. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు భారీ వరద నీటి విడుదల చేస్తుండడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రవాహం శుక్రవారం ఉదయం 14.830 మీటర్లను దాటి కొనసాగుతుండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సాయంత్రానికి గోదావరి ప్రవాహం 15.600 మీటర్లకు చేరి ప్రవహిస్తోంది. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద సమ్మక్కసాగర్ బ్యారేజ్‌కు వరద ఉధృతి కొనసాగుతుంది. బ్యారేజ్ వద్ద మొత్తం 59 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లోంచి 8,45,290 క్యూసెక్కుల నీరు బ్యారేజ్‌లోకి ఇన్‌ఫ్లో రాగా బ్యారేజ్‌లో 59 గేట్లు ఎత్తి 8,45,043 క్యూసెక్కుల నీటిని దిగువను నీటిని విడుదల చేశారు. మంగపేట మండలం కమలాపురం ఇన్‌టెక్‌వెల్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇన్‌టెక్‌వెల్ వద్ద గోదావరి సముద్ర మట్టానికి 84.5 ఫీట్ల ప్రవాహం కొనసాగుతుంది. ఎగువ ప్రాంతాల్లోంచి వస్తున్న భారీ వరదకు గోదావరి మరింతా అవకాశం ఉంది. గోదావరి ఉధృతి కారణంగా కమలాపురం, బోర్‌నర్సాపురం వద్ద పంటపొలాలు నీటి మునిగాయి.

గోదావరి పెరుగుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు గోదావరిలోకి చేపల వేతకు వెళ్లొద్దని కలెక్టర్ సూచించారు. వాజేడు మండలంలోని టేకులగుడెం వద్ద ఉన్న రేకుమాగు వాగుకు వరద (మిగతా 6వ పేజీలో)



బీఆర్ఎస్ నాయకులతో దాస్యం వినయ్ భాస్కర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు పార్టీ శ్రేణులు పని చేసి సత్తాచాటాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నూతన ఓటర్ల వివరాలను సరిచూసి వారిని కలిసే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండపాక రఘు, బొల్లవేని రాజు, గురిజపెల్లి ప్రకాష్‌రావు, రంజిత్, అశోక్, తిరుపతి, సాంబన్న, శ్రీధర్, చిరంజీవి, మహేందర్‌రెడ్డి, రవీంద్రాచారి, సాయిరాం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

హనుమకొండ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):హనుమకొండ సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలో మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించారు. శుక్రవారం సుబేదారి సీఐ మేకల రంజిత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ హంటర్‌రోడ్డులోని నందిహిల్స్‌లో నివాసం ఉంటున్న తోటకూర విజయ కూరగాయల కోసం బయటకు నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి విజయ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేసినా తప్పించుకొని పారిపోయినట్లు తెలిపారు. వెంటనే సమాచారం అందుకొని సంఘటన స్థలానికి చేరుకొని చోరీకి గల ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలిస్తున్నట్లు సీఐ రంజిత్‌కుమార్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని అన్నారు.

గణనాథుడి సన్నిధిలో లక్ష్మీపూజలు

త్రిముఖ గణపతిగా వేయిస్తంభాల గణపతి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల పేరిట వాడవాడలా ఘనంగా పూజలందుకుంటున్న గణపయ్య ఉత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. పోటీలుపడి ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఈసారి నిర్వాహకులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చారిత్రక ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలో నిర్వహిస్తున్న వేడుకల పరంపరలో ఆలయ మూలగణపతిని త్రిముఖ గణపతిగా అలంకరింపజేసి పూజాదికాలు నిర్వహింపజేశారు. షోడచోపచార పూజల అనంతరం స్వామివారిని అశ్వవాహనంపై నిర్వహించిన ఊరేగింపులో మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. జయజయహో గణేషా.. అంటూ ఆలయ ప్రదక్షణం చుట్టూరా వాహన సేవ నిర్వహించారు. యాగశాలలో కంజుల మహేశ్ సౌజన్యంతో గణపతి నవగ్రహ రుద్ర సహిత శ్రీ సూక్త, పురుష సూక్త హోమాన్ని నిర్వహించారు. వేముల సత్య మూర్తి దాతృత్వంలో విశేష అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం గజ్జల రంజిత్ శిష్య బృందంతో పేరిణి శివతాండవ నృత్యంతోపాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల కార్యక్రమాలు జరుగగా కళాకారులకు లయన్స్ మల్టీపుల్ నాయకుడు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు జ్ఞాపికలను ప్రదానం చేశారు.



వాహనసేవలో పాల్గొన్న మహిళా భక్తులు

అదే విధంగా నగరంలోని అనేక మండపాల వద్ద శుక్రవారం మహిళలకు కుంకుమపూజలు, లక్ష్మీపూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని విక్కీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం గణనాథున్ని కొలుస్తూ ప్రత్యేక నృత్యాలతో అలరింపజేశారు. అదే విధంగా వడ్డెపల్లిలోని సుధానగర్, రాగన్నదర్వాజ, టైలర్‌స్ట్రీట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీపూజలు నిర్వహించారు.



రామన్నపేటలో నంది శివుడి అలంకరణలో వినాయకుడు



డాల్ఫిన్ గల్లీలో సుతిలి దారంతో ఏర్పాటైన విగ్రహం

మూడో రోజుకు చేరిన గణపతి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్: గణపతి ఉత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం నగరంలోని పలు వినాయక మండపాల వద్ద అన్నదానాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం రామన్నపేటలోని శ్రీసీతారామ కల్యాణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నందివాహనంపై శివుడి రూపంలో ఉన్న గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. బట్టల బజార్‌లోని వర్తక సంఘం గణపతి వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. జేపీఎన్ రోడ్డులోని డాల్ఫిన్ గల్లీలో లక్ష్మి వినాయక కార్పొరేషన్ వారు సుతిల్ దారాలతో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం భక్తులను ఆకర్షిస్తోంది.

గోదావరి ఉగ్రరూపం

(5వ పేజీ తరువాయి)

నీటి ప్రవాహం పెరిగి జాతీయ రహదారిని ముంచెత్తింది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నెలలో ఇది రెండో సారి కాగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి గోదావరి వరద అకస్మాత్తుగా పెరగడంతో పోలీసులు, పంచాయతీ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిషేధించారు.

మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం

మహదేవపూర్ /మహదేవపూర్ రూరల్ (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 9.89లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 97.30మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది. తెలంగాణలో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద వరద ప్రవాహం భారీగా పెరుగుతోంది. మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి ప్రవాహం ఉంది.

వరంగల్ నీటిపారుదల సీఈగా సుధీర్

పదోన్నతిపై రాక.. జారీ అయిన ఉత్తర్వులు



హనుమకొండటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ ఇంజనీర్‌గా ఆర్.సుధీర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జనగామ జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈగా పనిచేస్తున్న సుధీర్.. పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా, వరంగల్ సీఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఇటీవలే చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతిపై ఇక్కడికి వచ్చినప్పటికీ ఈనెలాఖరుకు ఉద్యోగ విరమణ చేస్తుండడంతో ఆయన స్థానంలో సుధీర్‌ను పదోన్నతిపై బదిలీ చేశారు.

ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

వరంగల్ ఎంపీ కడియం కావ్య

ఘనంగా జేఎన్ఎస్‌లో జాతీయ క్రీడా దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌ను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూల మాలల వేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడారు. భారత దేశానికి ఒలంపిక్స్‌లో హాకీ క్రీడలో 3 పసిడి పతకాలను అందించిన ఘనత మేజర్ ధ్యాన్‌చంద్‌కే దక్కుతుందన్నారు. ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడంతోపాటు భారతదేశం మొత్తం క్రీడాపండుగగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆమె కొనియాడారు. క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి పెద్ద పీట వేస్తున్నారని గుర్తు చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్రీడలను మరింత ప్రోత్సహిస్తున్నారన్నారు.

డీవైఎస్‌వో అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు డీఎస్ఏ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 23నుంచి 31వరకు జేఎన్ఎస్‌లో ప్రతీ రోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన పలు క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను, షీల్డులను ప్రదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.డి. అజీజ్‌ఖాన్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు శ్యామ్, సృజన్‌కాంత్, ఉస్మాన్, లక్ష్మణ్, లిల్లీ ఫ్లోరెన్స్ మాధవీరెడ్డి, పీడీలు, పీఈటీలు, డీఎస్ఏ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూల మాలలు వేస్తున్న ఎంపీ కావ్య

‘బండి’ జోరుకు బ్రేకులు

(5వ పేజీ తరువాయి)

తన సొంత జిల్లా అయిన ఖమ్మంలో బినామీ పేర్లపై రియల్ ఎస్టేట్ వెంచర్‌లు, పౌల్ట్రీ ఫామ్‌లు నిర్వహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రైడ్స్ ప్రారంభించారు. హనుమకొండ చైతన్యపురిలోని ఆయన నివాసం, ఖమ్మంలోని బంధువుల ఇళ్లు, ఖిలా వరంగల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఏకకాలంలో అధికారులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో నాగేశ్వరరావు ఆస్తుల చిట్టా వెలుగులోకి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.

హనుమకొండ చైతన్యపురిలోని నాగేశ్వర్‌రావు సొంత ఇంటిలో సోదాలు చేయగా అనేక ఆస్తులు బయటపడ్డాయి. రూ. కోటి 15 లక్షల విలువ చేసే ఇల్లు, రూ.కోటి 43 లక్షల విలువ చేసే 17ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమి, రూ.23 లక్షల 88 వేల విలువైన 70 తులాల బంగారు ఆభరణాలు, రూ.92 వేల విలువైన వెండి ఆభరణాలు, రూ.37లక్షల 78వేల విలువైన రెండు ఫోర్ వీలర్లు, ఒక ద్విచక్ర వాహనం, రూ.3లక్షల 28 వేల విలువైన 23 గడియారాలు, రూ.16లక్షల 44 విలువైన గృహోపకరణాలు గుర్తించినట్లు డీఎస్పీ వెల్లడించారు. వీటి మొత్తం విలువ రూ.5కోట్ల పైనే ఉంటుందని తెలిపారు. అయితే మార్కెట్ విలువ ఇంత కన్నా అధికంగా ఉంటుందన్నారు. నిందితుడు నాగేశ్వర్‌రావుపై అక్రమ ఆస్తుల కేసులు నమోదుచేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామన్నారు.



చైతన్యపురిలోని నాగేశ్వర్‌రావు నివాసం

కార్యాలయంలో సోదాలు

ఏసీబీ అధికారులు శుక్రవారం ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో సైతం తనిఖీలు నిర్వహించారు. అయితే తహసీల్దార్ అవినీతికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని అధికారులు తెలిపారు. కాగా, తనిఖీలతో సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. జనం ఇబ్బందులు పడ్డారు. కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలు తహసీల్దార్‌పై చర్చించుకోవడం కనిపించింది.

ఉనికి కోసమే బీజేపీ ఆరాటం

వడ్డెపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కేవలం ఉనికి కోసమే బీజేపీ ఆరాటపడుతుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ 57వ డివిజన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఎల్లలు సైతం తెలియని వరంగల్, హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, కొలను సంతోష్‌రెడ్డి, తదితరులు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని విమర్శించడం శోచనీయమని పేర్కొన్నారు. పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18నెలల్లోనే జరిగిందని అన్నారు.

అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేని బీజేపీ నేతలు కళ్లులేని కబోదులుగా విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందని అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలో మామునూరు ఎయిర్‌పోర్ట్, నయీంనగర్ బ్రిడ్జి, కాజీపేట పై ఓవర్ బ్రిడ్జి, కాళోజీ కళాక్షేత్రం, గ్రేటర్ వరంగల్‌లో అంతర్గత రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలు జరుగుతుంటే బీజేపీ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల కిషన్ అవగాహన లేకుండా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిపై విమర్శలు చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. రావుల కిషన్ చరిత్ర ప్రజలందరికీ తెలిసిందేనని బంక సరళ సంపత్ యాదవ్ ఆరోపించారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ నేతలు దువ్వ రేవతి, కంటె సుకన్య, తాళ్లపెల్లి మేరి, బొంత సుజాత, తేళ్ల సుగుణ, అల్లం మున్నీ, కేసరి ఇందిరా, బొల్లు లలిత, కవిత, సునిత, రమ్య , అను, రజిత పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సరళ సంపత్ యాదవ్

108, ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ

వరంగల్ మెడికల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 108 ఎమర్జెన్సీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లకు, పైలట్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కేయూ ఎల్‌డీఎల్‌సీఈ అకడమిక్ కాన్ఫరెన్స్ హాలులో జీవీకే ఈఎంఆర్ఐ 108 ఉద్యోగులకు వారంపాటు ఇచ్చే శిక్షణను డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ప్రారంభించి మాట్లాడారు. ఎమర్జెన్సీలో క్షతగాత్రులను ఎలా కాపాడాలో.. గోల్డెన్ అవర్ కాన్సెప్ట్ ద్వారా ప్రజలకు మెరుగైన అత్యవసర చికిత్స అందించాలో వివరించారు. నేషనల్ ఎమర్జెన్సీ లర్నింగ్ సెంటర్ నుంచి వచ్చిన ట్రైనర్ గజేందర్‌ను డీఎంహెచ్ఓ ఈ సందర్భంగా అభినందించారు. వరంగల్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్, హనుమకొండ జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్, వరంగల్, ములుగు మేనేజర్లు భరత్ కుమార్, రాజ్‌కుమార్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): హంటర్ రోడ్‌లో ఉన్న మైనారిటీస్ బాలికలు-1 గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, 6వ తరగతుల మైనారిటీయేతర ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నీరజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీలు 1, బీసీ-1, ఓసీ-1, 6వ తరగతిలో బీసీ-1 ఖాళీలు ఉన్నాయని, అడ్మిషన్లు కావాలనుకునే విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని, ఈ దరఖాస్తులను సెప్టెంబరు 1వ తేదీలోగా సమర్పించాలని ప్రిన్సిపాల్ నీరజ ఆ ప్రకటనలో కోరారు.

కాంగ్రెస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

● పార్టీ నాయకులే కారణమంటూ ఆరోపణ ● నర్సంపేట కాంగ్రెస్ వర్గాల్లో కలకలం

నర్సంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి వరగంటి విక్రమ్‌సాయి విషగుళికలు మింగి శుక్రవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేకనే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు విక్రమ్‌సాయి రాసిన లేఖ, సెల్ఫీ వీడియోలో ఆయన మాట్లాడుతున్న తీరు మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వీడియోలో ఆరోపణల ప్రకారం..

2019- 2020లో హైదరాబాద్‌లో ఓ వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానంటే అతడిని కలిసేందుకు విక్రమ్‌సాయి సిద్ధం కాగా, మరో కొంతమంది తమకు కూడా ఉద్యోగం ఇప్పించాలని కోరగా వారితో కలిసి హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి డబ్బులు ఇచ్చారు. సదరు వ్యక్తి డబ్బులు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడు. ఈ విషయంలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై వీరంతా కేసుపెట్టారు. ఈ క్రమంలో ఉద్యోగం కోసం ఇచ్చిన డబ్బులు నువ్వే ఇవ్వాలి.. అని విక్రమ్‌పై ఒత్తిడి తెస్తుండడంతో ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దొంతి దృష్టికి విక్రమ్‌సాయి తీసుకెళ్లగా పట్టణానికి చెందిన ఓ నాయకుడిని కలిసి మాట్లాడండి.. అని ఎమ్మెల్యే చెప్పినట్లు సుసైడ్ నోట్‌లో విక్రమ్ పేర్కొన్నాడు.

సదరు నాయకుడిని కలిస్తే.. నీవల్లే వారంతా ఉద్యోగం కోసం వ్యక్తికి డబ్బులు ఇచ్చి మోసపోయినందున, వారి డబ్బులు వారికి ఇచ్చి సమస్యను పరిష్కరించుకోమని చెప్పినట్లు సమాచారం. దీంతోపాటు డబ్బుల కోసం తనపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తూ సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈ సంఘటన నర్సంపేటలో, పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. పలువురు నాయకుల పేర్లు రాసి, వీరి ఒత్తిడి వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన చావుకు వారే కారణమని లేఖలో విక్రమ్ పేర్కొన్నాడు. కాగా, విషగుళికలు మింగిన విక్రమ్‌సాయిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విక్రమ్‌సాయి

పూజారి సాంబయ్య మృతి తీరని లోటు

మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు

పరకాలలో అంతిమయాత్రలో పాల్గొని నివాళులు

పరకాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పరకాల వాస్తవ్యుడు, మాదారం పీఏసీఎస్ మాజీ చైర్మన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పూజారి సాంబయ్య మృతి తీరని లోటని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం పూజారి సాంబయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులు పరకాల పట్టణంలోని ఆయన స్వగృహానికి చేరుకుని సాంబయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబానికి కొండా దంపతుల సహకారం ఎళ్లవేళలా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. తాను 1999లో మొదటిసారిగా శాసనసభ్యురాలిగా ఎన్నికైనప్పటి నుంచి తనను ఒక సోదరిలా ఆహ్వానించేవారన్నారు. కొండా దంపతులంటే సాంబయ్యకు ఎనలేని అభిమానమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బొచ్చు రాజమౌళి, కొత్తపల్లి రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, గోల్కొండ సదానందం, పర్నం మల్లారెడ్డి, దాసరి భిక్షపతి, ఇనుగాల రమేశ్, కొత్తపల్లి రవి తదితరులు సాంబయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7650	5300
మక్కలు	2216	1521
కందులు	5622	3022
పెసళ్లు	5550	3022
పల్లికాయ (సూక)	6300	3500
పల్లికాయ (పచ్చిది)	4760	2400
పసుపు (కాడి)	11555	7889
పసుపు (గోల)	10609	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15000	12000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్341ఏసీ	15000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

‘మెట్రో రైలు’ పట్టాలెక్కేనా..?!

- 2019లో మెట్రో రైలుకు రూ.1,341 కోట్ల అంచనాలతో డీపీఆర్
- కేంద్రంపై ఒత్తిడి లేక నగరవాసులకు కలగానే మెట్రో ప్రయాణం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాష్ట్రంలో అతిపెద్ద రెండో నగరంగా ఉన్న వరంగల్ ఇటీవల కాలంలో భారీగా విస్తరిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభా 8,30,281 మంది. ప్రస్తుత 2025 లెక్కల ప్రకారం 11,24,336 జనాభా ఉండగా, 2040 వరకు 15,66,982 జనాభా పెరుగుతుందని అంచనా వేశారు. అలాగే 2055 వరకు 21,31,762 జనాభా పెరుగుతుందని అధికారుల అంచనా. ఇప్పటికే 2వేలకు పైగా కాలనీలు ఏర్పడ్డాయి. వరంగల్ బస్టాండ్ నుంచి పోచమ్మమైదాన్ వరకు, ములుగు రోడ్డు నుంచి పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వరకు, అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు, ఫాతిమానగర్ నుంచి కాజీపేట వరకు భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇవే రూట్లు కాకుండా, ధర్మారం నుంచి కాశిబుగ్గ మీదుగా పోచమ్మమైదాన్ వరకు, కాకతీయ యూనివర్సిటీ నుంచి పెద్దమ్మగడ్డ మీదుగా ములుగు రోడ్డు వరకు కూడా ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి. హంటర్ రోడ్డు నుంచి ఖమ్మం వెళ్లే దారిలో కూడా ట్రాఫిక్ కష్టాలు తప్పటం లేదు.



మామునూరులో విమానాశ్రయం వస్తుండటంతో ఈ ప్రాంతంలో నూతన కాలనీలు పెరుగుతున్నాయి. కొత్తగా గీసుకొండ, సంగెం మండలాల మధ్య కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు రావటంతో ఇక్కడ సుమారు 2లక్షల మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. దీంతో ఈ ప్రాంతం మొత్తం నగరంతో అనుసంధానం కానుంది. ఇలా నగరం విస్తరిస్తుండటంతో రాకపోకలపై ప్రభావం పడుతోంది. గతంలో వందకు పైగా లోకల్ బస్సులు నగరంలో చక్కర్లు కొట్టేవి. ప్రస్తుతం లోకల్ బస్సుల సంఖ్య భారీగా తగ్గటంతో ప్రయాణికులు ఆటోలు, ఇతర ప్రవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వాహనాల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. వ్యయంతో కూడా ప్రయాణం కావటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కూడా మెట్రోరైలు సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే డిమాండ్ బలంగా తెరపైకి వస్తోంది.

అటకెక్కిన ప్రతిపాదనలు

నగరం విస్తరిస్తుండంతో హైదరాబాద్ తరహాలో మెట్రో రైల్ ఏర్పాటుపై గత ప్రభుత్వం సర్వే నిర్వహించింది. 2019 డిసెంబరు 24వ తేదీన అధికారులు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కిలో మీటర్ల వరకు మెట్రో రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వరంగల్ మెట్రో నియో ప్రాజెక్టుగా నామకరణం కూడా చేశారు. ‘కుడా’ నిర్వహణలో ఈ రైల్‌ను నిర్వహించాలని అప్పట్లో నిర్ణయించారు. లైట్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎల్‌ఆర్‌టీఎస్) ద్వారా ఒకే దశలో ప్రాజెక్టు పూర్తి చేయాలని డీపీఆర్ రూపొందించారు. 2025లో ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.1,341కోట్ల అంచనా వ్యయంతో వరంగల్ మెట్రో రైల్‌కు రూపకల్పన చేశారు. కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు 15.5కి.మీల దూరంలో 7.1కిలో మీటర్లు రోడ్డు మార్గంలో 8.4కి.మీలు ఆకాశమార్గంలో రైల్వేట్రాక్ నిర్మించాలని నిర్ణయించారు. 2041నాటికి వరంగల్ జనాభా 20లక్షలకు చేరుకుంటుందని అప్పటి అంచనాలతో మహారాష్ట్రలోని నాసిక్ నియో మెట్రో తరహాలో వరంగల్‌లో నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు.

రబ్బరు టైర్లపై నడవటం నియో మెట్రో రైల్ ప్రత్యేకత. విద్యుత్ వ్యయం కూడా భారీగా ఆదా అవుతుందని అంచనావేశారు. కాగా, 21 స్టేషన్లను ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. వీటిలో కాజీపేట రైల్వేస్టేషన్, ఫాతిమానగర్, ఎన్ఐటీ, అటవీశాఖ కార్యాలయం, సుబేదారి, రోహిణి ఆస్పత్రి, అదాలత్, నక్కలగుట్ట, అంబేద్కర్ జంక్షన్, పోలీస్ కమిషనరేట్, ప్రసూతి ఆస్పత్రి, హనుమకొండ చౌరస్తా, అలంకార్ జంక్షన్, ములుగు రోడ్డు, కేఎంసీ, ఎంజీఎం, పోచమ్మమైదాన్, ఎల్‌బీ నగర్, కాశిబుగ్గ, వెంకట్రామ టాకీస్, వరంగల్ రైల్వేస్టేషన్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. 2021 మార్చిలో వరంగల్ మెట్రో నియో రైలు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి లేకపోవటంతో వరంగల్ మెట్రోకు గత ఐదారేళ్లుగా బ్రేక్ పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మెట్రో రూట్ మార్చాల్సిందే..?

వరంగల్ నగరానికి మెట్రో రైల్ కోసం ఓరుగల్లు ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. 2019 నాటి ప్రతిపాదనను మార్చి కొత్త రూట్లతో ప్రతిపాదనలు చేయాలని కోరుతున్నారు. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి కాకుండా రాంపూర్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా మామునూరు ఎయిర్‌పోర్టు వరకు కొత్త రూట్‌ను ప్రతిపాదన చేయాలని కోరుతున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కు వరకు లైన్‌ను పొడిగించేలా ప్రణాళిక రూపొందిస్తే.. భవిష్యత్తులో మెట్రో విస్తరణకు ఉపయోగపడుతుందనే చర్చ నడుస్తోంది.

అభివృద్ధికి అనుసంధానం

మెట్రో రైల్ వస్తే వరంగల్ నగరానికి కొత్త కళ వస్తుందనే వ్యాఖ్యలు ఉన్నాయి. హైదరాబాద్ తరువాత అత్యంత వేగంగా వరంగల్ నగరం అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కును పీఎం శ్రీ మిత్ర పథకంలో చేర్చింది. దీంతో భవిష్యత్తులో భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండటంతో సుమారు రెండు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల రానున్నాయి. దీంతో ఈ ప్రాంతానికి కూడా మెట్రో రైల్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే మామునూరు ఎయిర్‌పోర్టుకు చకచకా పనులు జరుగుతున్నాయి. 2027నాటికి ఎయిర్‌పోర్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు మెట్రో సేవలు అవసరం పడతాయనే చర్చ జరుగుతోంది. అలాగే మడికొండలోని ఐటీ పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరుపుతోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వరంగల్ నగరానికి మెట్రో రైల్ అనేది అత్యవసరమనే చర్చ ఉంది.

పర్యావరణ హితం గోమయం గణేశుడు

- 16ఏళ్ల పాటు మట్టి వినాయక విగ్రహం
- గత పదేళ్లుగా గోమయం విగ్రహం
- కాళేశ్వరంతో పాటు సప్త నదుల జలంతో అభిషేకాలు



మహబూబాబాద్‌లో శ్రీమహాలక్ష్మీగణపతి సేవా ట్రస్టు ఏర్పాటు చేసిన గోమయం విగ్రహం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా శ్రీమహాలక్ష్మీగణపతి సేవా ట్రస్టు బాధ్యులు వినాయక చవితి ఉత్సవాల్లో దశాబ్ద కాలంగా గోమయం వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభించిన మొదటి సంవత్సరం నుంచి పర్యావరణ పరిరక్షణ కోసం 16 సంవత్సరాల పాటు మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేయగా, పదేళ్ల నుంచి గోమయ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్వీ నాగేశ్వర్‌రావు, సోమ శ్రీనివాస్, శ్రీరంగం రామారావు, సోమ రాంబాబు 2000వ సంవత్సరంలో శ్రీమహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్టును స్థాపించి ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ట్రస్టు స్థాపించిన నాటి నుంచి మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన ట్రస్టు బాధ్యులు 2016లో మరో అడుగు ముందుకు వేసి పదేళ్లుగా పర్యావరణ హితం గోమయం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ వస్తున్నారు.

విగ్రహం తయారీ ఇలా..

చెరువుల్లో నిమజ్జనం చేశాక వెంటనే కరిగిపోయి పర్యావరణానికి హాని కలగకుండా గోమయం విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. గోమయం(ఆవుపేడ), గోపంచకం(మూత్రం), చింతగింజల పౌడర్, వేపాకు పేస్టు, పసుపుతో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. ఏటా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తయారు చేసిన గోమయం విగ్రహాన్ని ట్రస్టు బాధ్యులు కొనుగోలు చేసి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాల్లో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ గోమయం విగ్రహం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేశాక త్వరితగతిన కరిగిపోవడంతో పాటు ఆవుపేడ, గోపంచకం, వేపాకు పేస్ట్, పసుపు, చింతగింజల పౌడర్‌తో తయారు చేయడంతో నీళ్లలో ఉన్న క్రిమికీటకాలు నశించి పోతాయని చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యానికి హాని కలుగకుండా గోమయం విగ్రహం ఎంతగానో దోహదపడుతుంది. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఏటా వినాయక విగ్రహం వద్ద ఉదయం పూజ వేళలో కాళేశ్వరం నుంచి ప్రత్యేకంగా తీసుకవచ్చిన గంగాజలంతో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ 21రకాల అభిషేకాలు నిర్వహించారు. ఈ సంవత్సరం కాళేశ్వరంతోపాటు ఏడు సప్త నదుల జలాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విగ్రహాన్ని దర్శించుకుంటున్నారు.

బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

వేలేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. శుక్రవారం వేలేరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు నిండు కుండలా మారాయని, ప్రభుత్వం సరైన సమీక్ష నిర్వహించకపోవడం వల్ల దేవాదుల, కాళేశ్వరం కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రాజెక్టులకు సంబంధించిన మోటార్లను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ కార్యకర్తలే మోటార్లను ఆన్ చేస్తారని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు హెచ్చరిక చేయడంతో గోదావరి వద్ద మోటార్లను ఆన్ చేశారన్నారు. రైతుల సమస్యలను బలంగా ప్రస్తావించేందుకు రైతుల పక్షాన ఈనెల 31న వేలేరు మండలం నుంచి గండరామారం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పాదయాత్రను మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. యూరియా కోసం రైతులు క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాత్రం యూరియా కొరత లేదని అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని రాజయ్య విమర్శించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

- ఆర్టీఐ చట్టం కమిషనర్లు అయోధ్యరెడ్డి, శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న అయోధ్యరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం కోసమే సమాచార హక్కు చట్టం వచ్చిందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం 2025పై వివిధ శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిందని, ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందించిన జిల్లాల్లో వరంగల్ జిల్లా ఒకటని, సంబంధిత అధికారులు ప్రజలకు సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు.

ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా చూడాలని, గడువు లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. మూడు సంవత్సరాల నుంచి 17వేల ఆర్టీఐ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకే జిల్లాల్లో పర్యటిస్తున్నామని అన్నారు. అన్ని శాఖల అధికారులు 4-1బి, సిటిజన్ చార్టర్‌ను పక్కాగా అమలు చేస్తే సమస్యలు తగ్గుతాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

అంతకుముందు కలెక్టరేట్‌కు విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లకు కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్ పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డీఆర్‌వో విజయలక్ష్మి, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద నీటి ప్రవాహ అంచనా పరీక్షలు

- సీడబ్ల్యూపీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏడీసీపీ సర్వే చేసిన నిపుణులు



ఎగువ ప్రవాహంలో ఏడీసీపీ సర్వే నిర్వహిస్తున్న సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణులు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద శుక్రవారం నీటి ప్రవాహఅంచనాను గుర్తించే ఏడీసీపీ(అకౌస్టిక్ డాప్లర్ కరెంట్‌ప్రొఫైలర్) సర్వే నిర్వహించారు. పూణేకు చెందిన సీడబ్లూపీఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) సైంటిస్టు నాగరాజ్ టీం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. మేడిగడ్డ బ్యారేజీని సముద్రమట్టానికి 88 మీటర్ల ఎత్తులో నిర్మించగా బ్యారేజీ పూర్తి లెవల్‌లో వరద ప్రవాహం ఉన్నప్పుడు ఆ తీవ్రత ఎలా ఉంటుందో గుర్తించడానికి ఈసర్వే నిర్వహించినట్లు ఇంజనీర్లు తెలిపారు. బ్యారేజీ ఫుల్ రిజర్వాయర్ లెవల్ 100 మీటర్లు కాగా శుక్రవారం 97.30 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుండడంతో ఈ పరీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 88 మీటర్ల నుంచి 100 మీటర్ల ఎత్తులో ప్రవాహం ఉన్నప్పుడు ప్రతి పాయింట్ వద్ద ఈ పరీక్షను నిర్వహించి ఏ పాయింట్ వద్ద ప్రవాహ తీవ్రత ఎలా ఉందో గుర్తించనున్నట్లు తెలిపారు. బ్యారేజీ కుంగిన మొదట్లోనూ ఈ పరీక్షలు నిర్వహించినప్పటికి ఎన్‌డీఎస్ఏ(నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) తుది నివేదిక మేరకు ఈ పరీక్షలు చేపట్టినట్లు చెప్పారు. గత నెల 24న ఒకమారు, ఈనెల 5న మరోమారు బ్యారేజీ వద్ద పరీక్షల నిమిత్తం పరిశీలన చేసిన సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పరీక్షించేందుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. వారి వెంట డీఈఈ సురేష్, ఇతర ఇంజనీర్లు ఉన్నారు.

భళా.. ఏఆర్, వీఆర్ ల్యాబ్

- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు వర్చువల్ రియాలిటీ దన్ను
- ఉమ్మడి జిల్లాలో 11 పాఠశాలల్లో ల్యాబ్‌ల ఏర్పాటు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీఎంశ్రీ పథకం ద్వారా ఇప్పటికే అనేక పాఠశాలల్లో మెరుగైన ప్రమాణాలను చేకూరుస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 164 పాఠశాలలను ఎంపిక చేసి వాటిల్లో ఏఆర్ (అగ్మెంటెడ్ రియాలిటీ), వీఆర్ (వర్చువల్ రియాలటీ) ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సైతం 11 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేసి వాటిల్లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పాఠశాలల్లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు సంక్లిష్టమైన విషయాలను సులభంగా అర్థం చేసుకోవడానికి విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లు విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడానికి రిమోట్‌గా సహకరించడమే కాకుండా విద్యార్థులు వారి సొంత వేగంతో విషయాలు నేర్చుకోవడానికి ఈ ల్యాబ్‌లు దోహదం చేస్తాయి. ఈ ల్యాబ్‌లు బోధన, పుస్తకాల ద్వారా నేర్చుకోవడానికి బదులుగా విద్యార్థులను వాస్తవిక ప్రపంచంలో అనుభవించేలా చేస్తాయి. ఫిజిక్స్, బయాలజీల్లోని సంక్లిష్ట విషయాలను 3డిలో చూడటం ద్వారా సులభంగా నేర్చుకోవచ్చు. ఖరీదైన, ప్రమాదకరమైన ప్రయోగాలను సురక్షితంగా వర్చువల్ వాతావరణంలో చేయవచ్చు. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులు వ్యక్తిగత అభ్యసన అనుభవాలను పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల్లో కలిపి మొత్తం 11 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేసి ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. వరంగల్ జిల్లా నర్సంపేటలోని బాలికల జడ్పీహెచ్ఎస్‌తో పాటు రాయపర్తి మండలంలోని కొండూరు జడ్పీహెచ్ఎస్‌లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే హనుమకొండ జిల్లాలో ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్ఎస్, కాజీపేట మండలం మడికొండ జడ్పీహెచ్ఎస్‌లో, జనగామ జిల్లాలో జనగామ మండలం దామరంచ జడ్పీహెచ్ఎస్‌లో, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం జడ్పీహెచ్ఎస్‌లో, ములుగు జిల్లాలో ఏటూరునాగారం జడ్పీహెచ్ఎస్‌తో పాటు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గర్ల్స్ జడ్పీహెచ్ఎస్, తొర్రూరు జడ్పీహెచ్ఎస్, దంతాలపల్లి జడ్పీహెచ్ఎస్‌తో పాటు గూడూరు మండలం పొనుగోడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

నకిలీ పాస్‌పుస్తకాల ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితుల అరెస్టు
- 23 నకిలీ పాస్‌పుస్తకాలు.. ల్యాప్‌టాప్, కంప్యూటర్ స్వాధీనం



కురవి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

కురవి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కొంతమంది రైతులను మభ్యపెట్టి మీకు ఎక్కువ లోన్ ఇప్పిస్తామంటూ ఒక్కో పాస్‌బుక్‌కు రూ.10వేలు వసూలు చేస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు మహబూబాబాద్ జిల్లా కురవి పోలీసులు. ఈ ముఠా అరెస్టుకు సంబంధించి మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు కురవి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. కురవి మండలం మంచ్యాతండాకు చెందిన మూడ్ బాలాజీ, మహబూబాబాద్ మండలం అమనగల్ కస్నాతండాకు చెందిన బానోత్ హరికిషన్, జఫర్‌ఘడ్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బానోత్ వర్ధన్‌లు కలిసి ఒక ముఠాగా ఏర్పడి నకిలీ పాస్‌పుస్తకాలు, నకిలీ 1బీ, ఈసీలు తయారు చేస్తున్నారు. ఇలా కురవి యూనియన్ బ్యాంకు ద్వారా ఒకరికి, డోర్నకల్ యూనియన్ బ్యాంకు ద్వారా ఆరుగురికి, మహబూబాబాద్ యూనియన్ బ్యాంకు ద్వారా ఒకరికి, మహబూబాబాద్ కెనరా బ్యాంకులో ముగ్గురికి మొత్తంగా రూ.16.90 లక్షల విలువ గల రుణాలను నకిలీ పాస్‌పుస్తకాలతో ఇప్పించారు. మరో రూ.కోటి వరకు రుణాలు ఇప్పించేందుకు ముఠా ప్రణాళిక రూపొందించగా కచ్చితమైన సమాచారం మేరకు ఎస్సై గంద్రాతి సతీష్ వారిని వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి 23 నకిలీ పుస్తకాలు, ల్యాప్‌టాప్, రెండు ప్రింటర్లు, ఒక కంప్యూటర్, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

అంతా సన్నాలమయం

- సన్న వడ్లకు సై.. దొడ్డు వడ్లకు నై.. అంటున్న అన్నదాతలు
- భూపాలపల్లి జిల్లాలో 90 శాతానికి పైగా సన్నరకాల వరి సాగు
- బోనస్‌తోపాటు రేషన్‌లో సన్నబియ్యం ఇవ్వడంతో పెరిగిన విస్తీర్ణం
- ఈ వానాకాలం సీజన్‌లో 1.12 లక్షల ఎకరాల్లో వేయనున్న వరి



నారు తీస్తున్న కూలీలు

కాటారం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అంతా రామమయం.. అన్న సినిమా పాటలాగా ఈ వానాకాలం సీజన్‌లో అంతా ‘సన్నాల’మయమే.. అంటూ అన్నదాతలు సన్న రకాల వరి సాగుకు సై అంటూ.. దొడ్డు వడ్లు నై.. అంటున్నారు. భూపాలపల్లి జిల్లాలో గతంలో ఎన్నడూలేని విధంగా సన్నవడ్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ వానాకాలం సీజన్‌లో దాదాపు 1.12లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు కానుండగా, సుమారు 1లక్షకు పైగా ఎకరాల్లో సన్నాలే సాగు కానుండటం విశేషం. కాటారం మండలంలో 12,500 ఎకరాల్లో వరి సాగు కానుండగా ఇందులో సుమారు 11వేలకు పైగా ఎకరాల్లో సన్న రకాలే సాగు కానుంది. గతానికి భిన్నంగా రైతులు వరి సాగులో దొడ్డు రకాల వైపు విముఖత చూపుతూ వ్యయప్రయాసల కోర్చి సన్న రకాలకే మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు భరోసాలో భాగంగా సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తోంది. ఈ వానా కాలం సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సైతం బోనస్ వర్తించనుండటంతో సన్న రకాల సాగు విస్తీర్ణం పెరిగింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో రైతులు ‘సన్నాల’కే సై అంటున్నారు.



మొలకెత్తిన వడ్లను చల్లుతున్న రైతు

జిల్లాలో 40 వెరైటీలకు పైగా సన్న రకాలు సాగవుతుండగా ప్రధానంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రకాలైన ఎంటీయూ-1064, 1224, 1271, 1282, 1262, జేజీఎల్-1798, హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎం-1638, బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048(తెలంగాణ సోనా), డబ్ల్యూజీఎల్-962, డబ్ల్యూజీఎల్-44లతోపాటు ప్రైవేట్ విత్తన కంపెనీలకు చెందిన జైశ్రీరాం, కావేరి చింటూ, ప్రైజ్, టిల్లూ, జీనెక్స్ చిట్టిపొట్టి, లిల్లీపుట్, ధనిష్ఠ, సూపర్ ఆమన్, అన్నపూర్ణ, బయోసీడ్-504, పల్లవి, అంకుర్-101, ఆమని, అమోఘ్ తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎంటీయూ-1224, 1271, 1282, 1262, ఆర్ఎన్ఆర్-15048(తెలంగాణ సోనా)రకాలకు డిమాండ్ పెరిగి జిల్లా విస్తీర్ణంలో సుమారు 60వేల ఎకరాలకు పైగా సాగు అవుతుండటం విశేషం. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సన్నబియ్యం వండిపెడుతున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో ఇబ్బడిముబ్బడిగా సన్నరకాల వరి సాగు పెరగడంతో రాష్ట్రంలో సన్నబియ్యం కొరత తీరనుందని ప్రభుత్వం భావిస్తోంది.

చెరువుల కిందనే దొడ్డు వడ్లు సాగు..

ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణంలో సన్న వడ్ల రకాలే 90 శాతానికి పైగా సాగు కానుండగా, కేవలం సుమారు 10వేల ఎకరాల్లోనే దొడ్డు రకం వడ్లు సాగు అవుతున్నట్లు వ్యవసాయాధికారుల అంచనా. బోర్లు, బావుల కింద 98 శాతం సన్న రకం వరి సాగు చేస్తుండగా నాట్లు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఆయకట్టు విస్తీర్ణం అధికంగా ఉన్న చెరువుల కింద లోతట్టు ప్రాంతాల్లో స్వల్ప, మధ్యకాలిక రకాలైన సన్న వడ్లు సాగు చేస్తే కోతల సమయంలో బురదతో ఇబ్బందిగా మారుతుందని రైతులు కొన్ని చోట్ల దొడ్డు రకం వడ్లు సాగు చేస్తున్నారు. దీంతో చెరువుల కిందనే అక్కడక్కడా ఎంటీయూ-1001, 1061, 1075, కేఎన్ఎం-1153, 1156 వంటి దొడ్డు రకం వడ్లను సాగు చేస్తున్నారు.



నాటు వేస్తున్న కూలీలు

సన్నబియ్యానికి తగ్గిన డిమాండ్

ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు గతేడాదితో పోలిస్తే తగ్గుముఖం పట్టాయని చెప్పవచ్చు. వడ్లకు రూ.2200 నుంచి రూ.2500 వరకు ధర పలకగా, సన్న రకం పాత బియ్యానికి క్వింటాల్‌కు రూ.4000-5000 వరకు ధర పలుకుతోంది. కొన్ని దొడ్డు రకాల వడ్లకు మార్కెటింగ్‌లో ఇబ్బందులు తలెత్తడం, సన్నరకాల వడ్లు, బియ్యం విక్రయాలకు ఇబ్బంది ఉండదనే ఆలోచనతో రైతాంగం సన్నాల దిక్కు ఆసక్తి చూపిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నా ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేయొచ్చని అన్నదాతలు ఆలోచిస్తున్నారు. వడ్లను మిల్లుల్లో పట్టించి బియ్యం సైతం విక్రయించవచ్చని అభిప్రాయంతో ఉన్నారు. బోర్లు, బావుల కింద వరినాట్లు దాదాపు పూర్తి కాగా, చెరువులు, కుంటల కింద నాట్లు ముమ్మరమయ్యాయి. పలువురు రైతులు నాట్లు వేయించడం కాకుండా వెదజల్లే పద్ధతి(బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్)లోనూ వరిని సాగు చేస్తున్నారు. కొద్దిగా మొలకెత్తిన వడ్లను పొలంలో చల్లే ప్రక్రియ జరుగుతుంది.

సన్న రకాలకు పెట్టుబడి అధికం..

యాసంగిలో సన్న రకాల సాగు మరీ తక్కువగా ఉంటుండగా, వానా కాలం సీజన్‌లో సాధారణంగా సాగు విస్తీర్ణంలో 40-50 శాతం మధ్య సన్న రకాల వడ్లు సాగవుతాయి. దొడ్డు వడ్ల వెరైటీలతో పోలిస్తే సన్న రకం వరి సాగుకు పెట్టుబడి అధికమవుతుంది. సన్న రకాలకు తెగుళ్లు, చీడపీడల బాధ ఎక్కువగా ఉంటుండగా నివారణ, నియంత్రణ కోసం పురుగు మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. దొడ్డురకం వరి దిగుబడితో పోలిస్తే సన్న రకాలు తక్కువ దిగుబడినిస్తాయి. అయినప్పటికీ సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ వస్తుండడంతో రైతులు సన్నాల సాగు వైపు అడుగేశారు. జిల్లావ్యాప్తంగా, కాటారం సబ్ డివిజన్‌లోనూ సన్న రకాల వడ్ల సాగు అధికంగా ఉందని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బాపురావు, మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ వెల్లడించారు.

ఎంఈఎఫ్ హనుమకొండ జిల్లా కార్యవర్గం ఎన్నిక

వడ్డేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశం శుక్రవారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో జాతీయ నేత కుమ్మరి రాజన్న, ఎంఈఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి బొడ్డు దయాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఎంఈఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మంద రాజు మాదిగ, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రవి, బొక్క మొగిలి, అర్షం రాజు, బండారి కుమారస్వామి, మునిగాల రవి, ప్రధాన కార్యదర్శిగా తోట శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. సహాయకార్యదర్శులుగా వస్కుల భాస్కర్, కొట్టె ప్రవీణ్, బి.స్వామి, రాజారపు ప్రసాద్, అనిల్, సతీష్, కోశాధికారిగా ఎర్ర వరద రాజు, సాంస్కృతిక కార్యదర్శులుగా రమేష్, చక్రీలను ఎన్నుకున్నారు.



ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గం

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

వరంగల్ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 25 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్‌చారి ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 23మందికి రూ.26,400 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని నలుగురికి రూ.3,200 జరిమానా విధించారని సీఐ పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ జట్టును అభినందించిన కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 23, 24, 25 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి సుబ్రతోరాయి ఫుట్‌బాల్ కప్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు ప్రథమ స్థానం పొందగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను జట్టు క్రీడాకారులు కలవగా అభినందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా సెక్రెటరీ వి.ప్రశాంత్‌కుమార్‌తోపాటు బి.సుధాకర్, పార్థసారథి, నీలం సురేష్, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, ప్రేమ్‌కుమార్, ఫుట్‌బాల్ జట్టు కోచ్ కం మేనేజర్, క్రీడాకారులు ఉన్నారు.

సెప్టెంబరు 2న కేయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

కేయూ క్యాంపస్ ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 29న శుక్రవారం జరగాల్సిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష.. భారీ వర్షాల కారణంగా సెప్టెంబరు 2న మంగళవారానికి వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. పరీక్షల కేంద్రాలు, సమయంలో ఎలాంటి మార్పులు ఉండవని తెలిపారు. వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

జర్నలిస్టులు సమాజ హితం కోసం పనిచేయాలి

- సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డి

వడ్డేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులు సమాజ హితం కోసం పనిచేయాలని సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డి అన్నారు. అధికారికంగా జిల్లా పర్యటనకు వచ్చిన కమిషనర్లను హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ,ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, ఉపాధ్యక్షులు గోకారపు శ్యామ్, యాంసాని శ్రీనివాస్, పొడిశెట్టి విష్ణు వర్ధన్, సీనియర్ జర్నలిస్టులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, వల్లాల వెంకటరమణ, గడ్డం కేశవమూర్తి తదితరులు ఘనంగా సత్కరించారు.

తెలుగు వాడుక భాషకు ఆద్యుడు గిడుగు వెంకటరామ్మూర్తి

కేయూ క్యాంపస్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు వాడుక భాషకు ఆద్యుడు గిడుగు వెంకట రామ్మూర్తి స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని కేయూ తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య అన్నారు. శుక్రవారం కేయూ తెలుగు విభాగంలో వ్యవహారిక వాడుక భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, కర్రె సదాశివ్, బీఆర్ఎస్వీ బాధ్యులు జెట్టి రాజేందర్, ప్రశాంత్, కత్తెరపల్లి దామోదర్, డాక్టర్ పుల్లా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి



స్పోర్ట్స్ హాస్టల్ ప్రారంభ సమావేశంలో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నేషనల్ స్పోర్ట్స్ డేను మంగళవారం కేయూ స్పోర్ట్స్ బోర్డు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి హాజరై ధ్యాన్‌చంద్ చిత్రపటానికి, ఒలింపిక్ టార్చ్‌లకు పూలమాల వేశారు. శారీరక శక్తితో మానసిక శక్తి వస్తుందని ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, డాక్టర్ కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హాస్టల్‌కు ధ్యాన్‌చంద్ పేరు

కేయూ స్పోర్ట్స్ హాస్టల్స్‌కు మేజర్ ధ్యాన్‌చంద్ పేరును పెట్టినట్లు కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ తెలిపారు. 20 గదులు, 100 మంది వ్యాయమ విద్యార్థులకు వసతి కల్పించే స్పోర్ట్స్ హాస్టల్‌ను శుక్రవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, ప్రొఫెసర్ వై.వెంకయ్య, డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి

హసన్‌పర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా విద్యార్థులు శారీరకంగా దృఢత్వం, క్రమమైన వ్యాయామం, ఆరోగ్య పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మహేంద్రవర్మ మాట్లాడుతూ.. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం ఆగస్టు 29న క్రీడా దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు శశికుమార్‌రెడ్డి, రవికిరణ్, చిరంజీవి, ఏవో వేణుగోపాలస్వామి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నదానాలు, కుంకుమ పూజలు

మార్మోగిన లంబోదరుడి నామస్మరణ

వడ్డేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో నెలకొల్పిన వినాయక మండపాల వద్ద శుక్రవారం అన్నదానాలు, కుంకుమ పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హనుమకొండ 56వ డివిజన్‌లోని గోపాల్‌పూర్ దేవరాజ్ కాలనీలో శ్రీసాయి గజాణన మండలి మండపంలో మాజీ ఎంపీటీసీ దూలం నీరజ రాజుగౌడ్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కాకతీయ నగర్ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సోయం ఓదెలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ధనసరి సారంగపాణి, మంద గట్టయ్య ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలను జరిపించారు. హనుమకొండ ఇందిరానగర్ రోడ్డులోని కేయూ ఎంప్లాయిస్ కాలనీలో గణపతి మండపం వద్ద నిర్వాహకులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ వడ్డేపల్లి చెరువు కట్ట శివాలయం వద్ద గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లం హరిమహేందర్ పటేల్, శ్రీధర్‌గౌడ్, మామిడాల వెంకన్న, గుజ్జేటి శ్రీకాంత్,భైరి అజిత్ రెడ్డి ఆధ్వర్యంలో విఘ్నాధిపతికి ప్రత్యేక పూజలు , అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



వినాయకుడిని దర్శించుకుంటున్న నామిరెడ్డి సీతారాంరెడ్డి దంపతులు

- న్యూశాయంపేట: హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నందిహిల్స్‌కాలనీలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం ఎదుట శుక్రవారం ఘనంగా కుంకుమ పూజ నిర్వహించారు. నందిహిల్స్‌కాలనీ అధ్యక్షుడు, గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ పెసరు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుంకుమ పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా పెసరు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, ప్రతీ సంవత్సరం గణేష్ నవరాత్రి ఉత్సవాలు నందిహిల్స్‌లో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ కోకన్వీనర్ పసునూటి సురేష్ కుమార్, గుర్రం రవి, దొంతి దేవేందర్‌రెడ్డి, చెక్క మొగిలితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



కొత్తూరు జెండాలో..

- హనుమకొండ టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొనిమూడో రోజు హనుమకొండ బాలసముద్రంలోని ఈఫిల్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో శుక్రవారం కుంకుమార్చన పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలసముద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ నామిరెడ్డి సీతారాంరెడ్డి దంపతులు పాల్గొని కుంకుమ పూజ నిర్వహించి వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చెన్నం రవీందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- హనుమకొండ(ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోచమ్మకుంటలోని సీతారామ యశోద నిలయంలో అపార్టుమెంట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అపార్టుమెంట్‌లోని మహిళలే కాకుండా చుట్టుపక్కల మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుడు మహిళలతో శ్రీ మహాలక్ష్మి పూజను నిర్వర్తింపచేశారు. అపార్టుమెంట్ కమిటీ సభ్యులు గుడిమల్ల రమేష్, గోరంటల జగదీశ్వర్, ఇమ్మడి సత్యనారాయణ, భలభద్ర భాస్కర్, సందీప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
- హనుమకొండ పరిమళకాలనీలోని సిగ్నేచర్‌ప్లేస్ అపార్టుమెంట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంకుమార్చన ఘనంగా జరిగింది. అపార్టుమెంట్‌లోని మహిళలు ఈ పూజలో పాల్గొన్నారు. అర్చకులు ఎస్.రాజేశ్వర శాస్త్రీ మహిళలతో కుంకుమార్చన నిర్వర్తింప చేశారు. సిగ్నేచర్‌ప్లేస్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి తమ్మెర కమలాకర్, కోశాధికారి దామెరుప్పుల దయాకర్, రిటైర్ లెక్చరర్, గణిత అవధాని అడ్లూరు సర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
- హసన్‌పర్తి: 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి గాంధీనగర్ వినాయక మండపంలో శుక్రవారం వినాయకుడికి ఘనంగా కుంకుమ పూజ నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండప ఆవరణలో దాత మండల రాజేందర్‌సంధ్యారాణి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు మహాన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయక మండలి నిర్వాహకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



ఎన్జీవోస్ కాలనీ రోడ్ శ్రీలక్ష్మినగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో...



కాకతీయ నగర్‌లో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



కుంకుమార్చనలో పాల్గొన్న అపార్టుమెంట్ మహిళలు

అభ్యంతరాలుంటే తెలియజేయండి

- అన్నిగ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా ప్రదర్శన
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రదర్శించామని, ఓటర్ల ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రదర్శించిన ఓటర్ల ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల్లో ప్రదర్శించిన ఓటర్ల ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గురించి అడిగిన పలు ప్రశ్నలకు కలెక్టర్ సమాధానమిచ్చారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 210 గ్రామపంచాయతీలు ఉన్నాయని, గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను గురువారం(ఈనెల 28న) ప్రదర్శించామన్నారు. ఓటర్ల జాబితాపై ఉన్న అభ్యంతరాలను వాటి వివరాలతో కూడిన సమాచారాన్ని అందజేయాలన్నారు. మండలస్థాయిలో ఈనెల 30న మండలస్థాయిలో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతనిధులకు సూచించారు. ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ పూర్తిచేసి తుది ఓటర్ల జాబితాను వచ్చే నెల రెండోతేదీన ప్రచురణ చేస్తామన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 3,70,867 ఉన్నారని, 1986 పోలీస్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భూ భారతి దరఖాస్తుల పరిష్కార చర్యలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం రాత్రి ఆర్డీవో, తహసీల్దార్‌లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల్లో ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారు? ఇంక ఎన్ని దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంది..? ఎన్ని రిజెక్టు అయ్యాయి? ఏ కారణాలతో రిజెక్టు అయ్యాయి? వచ్చిన దరఖాస్తుల్లో వివాదాస్పద భూములు ఉన్నాయా? వారసత్వ భూముల విషయంలో దరఖాస్తు ల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారనే వివరాలు.. సాదాబైనామా దరఖాస్తుల గురించి ఆయా మండలాల తహసీల్దార్‌లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. పరిష్కారానికి ఆమోదయోగ్యం కాని దరఖాస్తులను ఏఏకారణాలతో తిరస్కరించడానికి ఉన్న కారణాలను తెలియ జేస్తూ వివరాల నివేదికలను తహసీల్దార్‌లు అందజేయాలన్నారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యల్లో తీసుకుంటున్న చర్యలను తహసీల్దార్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులో ఉన్నారని, వారితోసర్వే ప్రక్రియను పూర్తి చేసి త్వరగా భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, హనుమకొండ ఆర్డీవో, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలు, తీసుకున్న చర్యలు, పరిహారం, తదితర అంశాలపై అధికారులు, కమిటీ సభ్యులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ సమావేశంలో సభ్యులు వెల్లడించిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా స్థాయి విజిలెన్స్ సమావేశం మూణ్నెళ్లకో సారి నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను ఎజెండాలో పొందుపర్చుతామని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నిర్మల, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పుట్ట రవి, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఏసీపీలు, తహసీల్దార్‌లు, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

పెద్ద బకాయిదారులను గుర్తించి పన్నులు వసూలు చేయండి : కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో బడా బకాయిదారులే లక్ష్యంగా పన్నులు వసూలు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. శుక్రవారం మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గ్రేటర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి పెండింగ్‌లో ఉన్న పన్నులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు ప్రతీ రోజు పది ఇండ్ల చొప్పున పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వార్డ్ ఆఫీసర్లుకు కూడా లాగిన్‌లు ఇచ్చి నల్లా కలెక్షన్లను తనిఖీ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ఇప్పటివరకు కట్టడాలు జరపని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. తర్వాత అనుమతులు రద్దు చేయాలని చెప్పారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాని వారి జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్‌లు ప్రసన్నరాణి, రవీందర్, ఆర్‌వోలు శ్రీనివాస్, షహజాది బేగంతో పాటు ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయినిని విమర్శించడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

కాజీపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై బీజేపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీలు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు ఎమ్మెల్యే నాయినిపై చేసిన వ్యాఖ్యలపై కాజీపేట మీడియా పాయింట్‌లో శుక్రవారం కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్, సుంచు అశోక్, నాయకులు ఎమ్డీ అంకూస్‌లు మాట్లాడారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక నిధులతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. నయీంనగర్ బ్రిడ్జి, కాళోజీ కళాక్షేత్రం, కాజీపేట ఆర్వోబీ, కాజీపేట బస్టాండ్, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం మంజూరు లాంటి అభివృద్ధి పనులు ఎమ్మెల్యే నాయినికే సాధ్యమన్నారు. జిల్లా మంత్రుల సహకారంతో నిరుపేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేసిన నాయిని రాజేందర్‌రెడ్డి హనుమకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, ఆరూరి సాంబయ్య, సిరిల్ లారెన్స్, దొంగల కుమార్, ఇప్ప శ్రీకాంత్, భరత్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కాజీపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని రెల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కాజీపేట రైల్వే ఎస్సై అభినవ్ తెలిపిన ప్రకారం... కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-1లో గురువారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒడిస్సాకు చెందిన ధరమ్ ధీర్ నాయక్, రామ బెహరా, నమిత బెహెరాలు ఒడిస్సాలో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ముంబాయికి తరలించేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి కాజీపేటలో రైలు దిగారు. వేరే రైలులో ముంబాయికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు పట్టుపడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.16 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.



నిందితుల అరెస్టు చూపుతున్న రైల్వే పోలీసులు

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

హసన్‌పర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి పీఎంశ్రీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శీలం పార్థసారథిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మారం తిరుపతి, రైల్వే బోర్డు మెంబర్ దాసరి రాజు, మండల ఉపాధ్యక్షురాలు గొడిశాల మమత, కిసాన్ మోర్చ నాయకులు గంట సత్యం, కుంబార్‌కార్ సాయి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమల్ల సుధీర్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాకర్స్‌కు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ 303 క్యాబినెట్ సెక్రటరీ రాంచందర్, పీఆర్‌వో ఉపేందర్, సంయుక్త కార్యదర్శి బొక్క కుమార్, అశోక్, కోశాధికారి గూడూరు లక్ష్మీనారాయణ, ముఖ్య సలహాదారులు బోడ యుగందర్, చంద్రశేఖర్, దూబల భాస్కర్, శంకర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మస్నా కుమార్, గణేష్, తిరుపతి, శ్రీకాంత్, ప్రకాష్, తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, రమేష్, సత్యనారాయణ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదం

వడ్డెపల్లి: క్రీడలు శారీరక ధారుడ్యానికి దోహదపడుతాయని పింగిళి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నేషనల్ స్పోర్ట్స్ డేను కళాశాల వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసినితోపాటు అధ్యాపకులు జ్యోతి, సురేష్‌బాబు, యుగంధర్ పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పరిధిలో శివనగర్ పల్లవి ఆస్పత్రి వద్ద ప్రధాన పైప్‌లైన్ మరమ్మతు జరుగుతున్న నేపథ్యంలో శనివారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు కాశిబుగ్గ సర్కిల్ ఇంచార్జి ఈఈ సంతోష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివనగర్, చింతల్, ఖిలావరంగల్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు గుర్తించాలని తెలిపారు. మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ప్రజలు సహకరించాలని సంతోష్‌బాబు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

హసన్‌పర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మనందరి ప్రథమ కర్తవ్యమని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పచ్చని వాతావరణం సాకారం కావాలనే లక్ష్యంతో ఎల్లప్పుడూ కృషి చేస్తున్న మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాజ్‌పాయ్‌లకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్‌పీలు, నగర వాసులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శివకుమార్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం
30 ఆగస్టు 2025



వంటిల్లు

కందతో రకరకాల కూరలు, పచ్చడి చేస్తూ ఉంటాం. అన్నీ వేటికవే విభిన్నంగా రుచికరంగా ఉంటాయి. ఇవికాక అందరూ ఇష్టపడే సరికొత్త కంద రుచులు మీకోసం...



కందతో కమ్మగా రుచులు

కంద వేపుడు

కావాల్సిన పదార్థాలు

- కంద గడ్డ- పావు కేజీ, జీలకర్ర- ముప్పావు చెంచా, పచ్చి శనగపప్పు- ముప్పావు చెంచా, మినప్పప్పు- పావు చెంచా, ధనియాలు- అర చెంచా, ఆవాలు- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, ఎండు మిర్చి- అయిదు, పసుపు- పావు చెంచా, ఉప్పు- ముప్పావు చెంచా, కారం- అర చెంచా, ఎండు కొబ్బరి తురుం- రెండు చెంచాలు, ఉల్లిపాయ- ఒకటి, పచ్చిమిర్చి- నాలుగు, కొత్తిమీర- కొద్దిగా, నూనె- నాలుగు చెంచాలు, కరివేపాకు- నాలుగు రెమ్మలు

తయారీ విధానం

- స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చుక్కల నూనె వేసి వేడిచేయాలి. అందులో నాలుగు ఎండుమిర్చి, అరచెంచా జీలకర్ర, అరచెంచా ధనియాలు, అరచెంచా పచ్చి శనగపప్పు, వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు వేసి దోరగా వేపాలి. ఇందులోనే కారం కూడా వేసి బాగా కలిపి పళ్లెంలోకి తీయాలి. ఇవన్నీ చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి. కందను తీసుకుని తొక్క తీసి నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత గ్రేటర్ సహాయంతో తురిమి పెట్టుకోవాలి. అలాగే ఉల్లిపాయను కూడా తురుముకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నాలుగు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో పావుచెంచా జీలకర్ర, ఆవాలు, పావుచెంచా పచ్చిశనగపప్పు, మినప్పప్పు, ఒక ఎండు మిర్చి, పసుపు వేయాలి. ఇవి వేగాక కంద తురుం, ఉల్లిపాయ తురుం, పచ్చిమిర్చి ముక్కలు, ఎండు కొబ్బరి తురుం వేసి జాగ్రత్తగా కలపాలి. ఎనిమిది నిమిషాలపాటు పెద్ద మంట మీద దోరగా వేపాలి. తరవాత ముందుగా గ్రైండ్ చేసిపెట్టుకున్న కారంపొడి మిశ్రమం, ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు చిన్నమంట మీద వేగనిచ్చి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న కంద వేపుడు కరకరలాడుతూ చాలా రుచిగా ఉంటుంది.

చిట్కా

- కంద తురుమును పసుపు నీళ్లలో వేసి రెండు నిమిషాల తరవాత నీళ్లను వడగట్టాలి. తరవాత తురుమును చేత్తో గట్టిగా పిండి పలుచని గుడ్డ మీద పరచి కొద్దిసేపు ఆరనిస్తే దానిలోని జిగురు పోతుంది. వేపుడు కూడా అంటుకోకుండా విడివిడిగా తయారవుతుంది.



కందలో పీచుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కందతో తయారుచేసిన వంటకాలు తిన్న తరవాత చాలాసేపటి వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. మహిళలు తరచూ కందను ఆహారంలో చేర్చుకోవడం వల్ల వారిలో ఈస్ట్రోజన్ హార్మోన్ సమతౌల్యంలో ఉంటుంది.

కంద కబాబ్

కావాల్సిన పదార్థాలు

- కంద- పావు కేజీ, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, అల్లం- మూడు చిన్న ముక్కలు, పచ్చి మిర్చి- అయిదు, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత, జీలకర్ర పొడి- అర చెంచా, ధనియాల పొడి- అర చెంచా, కారం- పావు చెంచా, ఓట్స్ పొడి- రెండు చెంచాలు

తయారీ విధానం

- మిక్సీలో వెల్లుల్లి రెబ్బలు, అల్లం ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, కొత్తిమీర, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- కందకు తొక్క తీసి చిన్న ముక్కలుగా కోసి పసుపు నీళ్లతో కడగాలి. ఈ ముక్కలను కుక్కర్‌లో వేసి కొన్ని నీళ్లు పోసి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. తరవాత కంద ముక్కలను వెడల్పాటి గిన్నెలోకి తీసుకుని గరిటె సహాయంతో మెత్తగా మెదపాలి. ఇందులో జీలకర్ర పొడి, ధనియాల పొడి, అల్లం-వెల్లుల్లి-పచ్చిమిర్చి పేస్టు, కారం, ఓట్స్ పొడి వేసి బాగా కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. తరవాత ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా చేత్తో తీసుకుని గుండ్రని టిక్కీల మాదిరి చేయాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. తరవాత టిక్కీలను పరచాలి. చిన్న మంట మీద రెండు వైపులా ఎర్రగా వేపాలి. ఇలా తయారుచేసుకున్న కంద కబాబ్‌లను గ్రీన్ చట్నీ లేదా చిల్లీ సాస్ లేదా టమాటా కెచప్‌తో సర్వ్ చేసుకోవాలి.

కందను తరచూ తినడం వల్ల రక్తం పరిశుభ్రమవుతుంది. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. ఆలుగడ్డతో పోలిస్తే కందకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి మధుమేహం ఉన్నవారు కందను తినవచ్చు.

చిట్కాలు

- ఓట్స్ పొడికి బదులు బ్రెడ్ పౌడర్ లేదా శనగపిండి వాడుకోవచ్చు.
- టిక్కీలు చేసేటప్పుడు చేతిని కొద్దిగా తడి చేసుకుంటే మిశ్రమం అంటుకోకుండా ఉంటుంది.

భోజన కుతూహలం

వాము ఆకుల్లో ఘాటైన ఔషధ గుణాలు

వాము, తులసీ, పుదీనా- ఈ మూడు ఒకే కుటుంబానికి చెందిన మొక్కలు. అందుకే వీటి ఘాటైన వాసన, ఔషధగుణాలు కొంతవరకు పోలికలు కలిగివుంటాయి. వాము ఆకులను చేత్తో నలిపితే వచ్చే బలమైన వాసనకు కారణం థైమాల్ అనే నూనె. ఇది సూక్ష్మక్రిములను సంహరించే గుణం కలిగి ఉండడం వలన ఆకులు సహజ యాంటీసెప్టిక్‌గా పని చేస్తాయి. తులసీ, పుదీనాకి కూడా ఈ తరహా ఔషధ గుణాలే ఉన్నాయి. వాము ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలను మన పూర్వీకులు గుర్తించి గ్రంధస్తం చేశారు. ఆ వివరాలలోకి వెళ్తే..

- వాము ఆకులు ఉష్ణ స్వభావం కలిగినవి. వాతం, కఫాలను తగ్గిస్తాయి. కడుపు నొప్పిని తగ్గించడంలో, జీర్ణాగ్ని వెలిగించడంలో ప్రత్యేకమైన గుణం కలిగినవి! వాము ఆకులు ఘాటైన వగరుతో కూడిన కారపు రుచి కలిగి, మిరప కారానికి సమానంగా వేడిని కలిగిస్తాయి.
- వాము ఆకులకు అజీర్ణాన్ని తగ్గించే శక్తి ఉంది. అందుకే అజీర్తితో బాధపడే వారు క్రమం తప్పకుండా వాము ఆకులను తింటే ఈ సమస్య తొలగిపోతుంది.
- వామాకులు శ్వాసకోస సమస్యలకు ఉపశమనం కలిగిస్తాయి. దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలకు వామాకులు మంచి పరిష్కారం అని చెప్పవచ్చు.
- వాము ఆకులు కడుపులో ఉండే గడ్డలను కరిగిస్తాయి. నులిపురుగులను చంపుతాయి. విషదోషాలు ఏవైనా ఉంటే వాటిని కూడా హరిస్తాయి.
- వాము ఆకులు శరీరానికి వేడిని కలిగిస్తాయి. అందువల్ల వేడితత్వం ఉన్న వారు పరిమితంగా తీసుకోవాలి. ముఖ్యంగా పురుషులు వీటిని తక్కువ తినాలి. లేకపోతే శుక్రకణాలు తగ్గే ప్రమాదం ఏర్పడవచ్చు.

చాలా మంది వాము ఆకులతో బజ్జీలు వేసుకుంటారు. వీటితో పచ్చడి కూడా చేస్తారు. మజ్జిగ పులుసు వంటి వాటిలో వాము ఆకులను దోరగా వేయించి కలిపితే మంచి రుచి వస్తుంది.



- గంగరాజు అరుణాదేవి

ట్రెండీ హ్యాండ్ బ్యాగ్‌లు ఇవే..

మహిళలు సందర్భానికి తగ్గట్టు రకరకాల హ్యాండ్ బ్యాగ్‌లు ఉపయోగిస్తూ ఉంటారు. వేడుకలు, దూర ప్రయాణాలు, కార్యాలయాలకు వెళ్లేటప్పుడు అనువుగా ఉండే వేర్వేరు హ్యాండ్ బ్యాగ్‌లను తీసుకెళుతూ ఉంటారు. ప్రస్తుతం యువతులను ఆకర్షిస్తూ ట్రెండింగ్‌లో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌లు ఇవే...

డఫెల్ బ్యాగ్

ఇది స్థూపాకారంలో అడ్డంగా ఉంటుంది. వారాంతపు టూర్, పిక్నిక్, దూర ప్రయాణాలకు అనువుగా ఉంటుంది. ఈ బ్యాగ్ లోపల విశాలంగా ఉండడం వల్ల చాలా వస్తువులను పొందికగా సర్దుకోవచ్చు. ఈ డఫెల్ బ్యాగ్‌లు పలు రంగుల్లో ఆకర్షణీయమైన డిజైన్లలో లభ్యమవుతున్నాయి.





టోట్ బ్యాగ్

ఇది రోజువారీ అవసరాలకు చక్కగా సరిపోతుంది. ఇలాంటి బ్యాగ్‌లను ఎక్కువగా కాలేజీలు, కార్యాలయాలకు వెళ్లే యువతులు, మహిళలు ఉపయోగిస్తున్నారు. క్యాష్, కార్డులు, లంచ్ బాక్స్, చిన్న టవల్, అదనంగా ఒక సంచి లాంటివాటిని ఈ బ్యాగుల్లో చక్కగా సర్దుకోవచ్చు. పొట్టి, పొడుగు బకిల్స్‌తో సులువుగా భుజానికి వేసుకోవడానికి వీలుగా ఉంటాయి.

క్లచ్

పార్టీలకు, చిన్న ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు చేతిలో పట్టుకోవడానికి వీలుగా ఉంటాయి. అందమైన ఎంబ్రాయిడరీ, లేస్, కుందన్, మెరిసే రాళ్ల వర్కులతో రిచ్‌గా కనిపిస్తుంటాయి. బంగారు, వెండి రంగుల్లో ఉండే క్లచ్‌లను యువతులు ఇష్టంగా కొనుక్కుంటున్నారు. శాటిన్ క్లాత్‌తో రూపొందించిన క్లచ్‌లకు కూడా డిమాండ్ అధికంగానే ఉంది. క్లచ్‌లో కొద్దిగా క్యాష్, మొబైల్, చిన్న లిప్‌స్టిక్, మాయిశ్చరైజర్ మాత్రమే పడతాయి.





బ్యాక్ ప్యాక్

ఇవి చూడడానికి స్టయిల్‌గా కనిపిస్తుంటాయి. కాలేజీలకు, చిన్నపాటి విహారయాత్రలకు వెళ్లేటప్పుడు తీసుకెళ్లడానికి అనువుగా ఉంటాయి. ఫ్యాన్సీ ప్రింట్లతో ట్రెండీగా ఉంటూ ఇవి యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి.

విజేత

కుస్తీ... ఆమెకు ఒక తపస్సు

చిన్నప్పుడు రెజ్లింగ్ నేర్పిద్దామనుకొంటే... 'ఆడపిల్లకు అవసరమా' అన్నారు. మెరుగైన శిక్షణ కోసం వేరే ఊరు పంపిద్దామంటే... 'ఒంటరిగా అలా ఎలా' అని ప్రశ్నించారు. కానీ కట్టుబాట్లను అవహేళనలను పక్కనపెట్టి... కూతుర్ని చాంపియన్‌గా చూడాలనుకున్నాడు ఓ తండ్రి. అందర్నీ ఎదిరించి తన కోసం నిలబడ్డ నాన్న కల... తాతయ్య వారసత్వం... రెండిటినీ నెరవేర్చింది... 19 ఏళ్ల తపస్య గెహ్లోవత్. బల్గేరియాలో జరిగిన అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన ఈ రెజ్లర్... అమ్మాయిలు ఎవరికీ తీసిపోరని నిరూపించింది.



'ప్రపంచ చాంపియన్‌గా తిరిగిరా'... తపస్య తాత చివరి మాటలవి. పోటీలకు సరిగ్గా వారం ముందు గుండె పోటుతో ఆయన మరణించారు. ఆ సమయంలో తపస్య ఢిల్లీ సన్నాహక శిబిరంలో సాధన చేస్తోంది. వార్త విన్న వెంటనే ఇంటికి వచ్చేద్దామను కొంటే... ఆమె తండ్రి పర్వేష్ ఒప్పుకోలేదు. 'తాతయ్య చివరి కోరిక నిన్ను వరల్డ్ చాంపియన్‌గా చూడాలని. అదే విషయం నీతో చెప్పమన్నారు' అంటూ కూతుర్ని సముదాయించారు. బాధను దిగమింగుకొని తాత ఆకాంక్ష నెరవేర్చేందుకు కఠోర సాధన చేసింది తపస్య. ఆగస్టు 20న బల్గేరియాలో జరిగిన 'అండర్ 20 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్' మహిళల 57 కేజీల విభాగంలో అద్భుత ప్రదర్శనతో అబ్బురపరిచింది. సెమీఫైనల్‌లో జపాన్ రెజ్లర్, డిఫెండింగ్ చాంపియన్ సొవాకా ఉచిడాను మట్టి కరిపించి, సంచలనం సృష్టించింది. నలభై అంతర్జాతీయ బౌట్స్‌లో వరుస విజయాల తరువాత సొవాకాకు ఇదే తొలి ఓటమి కావడం విశేషం. అంచనాలు తలకిందులు చేస్తూ ఫైనల్స్‌కు చేరిన తపస్య... నార్వే క్రీడాకారిణి ఫెలిసిటాస్ డోమాజెవాను ఓడించింది. ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. విజయానంతరం భుజాలపై మువ్వన్నెల జెండా కప్పుకొని... స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. 'నాన్న కల, తాతయ్య చివరి కోరికను నెరవేర్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది' అంటూ భావోద్వేగానికి లోనైంది.

'ఆడపిల్లకు అవసరమా అన్నారు'...

తపస్య కుటుంబంలో కుస్తీ కొత్తేమీ కాదు. ఆమె ముత్తాత చౌదరి హజారీలాల్ స్థానిక దంగల్‌లో పేరుమోసిన మల్లయోధుడు. ఆయన ఘనతలను తండ్రి పర్వేష్ కథలు కథలుగా తన కూతురుకు చెప్పేవారు. తపస్యను కూడా ఆయనంతటి రెజ్లర్‌ను చేయాలని కలలు కనేవారు. "మా తాత హజారీలాల్ చుట్టుపక్కల గ్రామాల్లో జరిగే బౌట్స్‌లో అదరగొట్టేవారు. రెజ్లింగ్‌లో మాకు మెలకువలు ఎన్నో చెబుతుండేవారు. నేను కూడా మల్లయోధుడినే. స్కూల్ గేమ్స్ జాతీయ చాంపియన్‌ని. కానీ గాయం కారణంగా ఈ క్రీడను వదిలిపెట్టాల్సి వచ్చింది. అందుకే తపస్య పుట్టినప్పుడే అనుకున్నా... తనను మంచి రెజ్లర్‌ను చేయాలని. అయితే తనకు పదేళ్ల వయసులో శిక్షణలో చేర్పించాలని అనుకున్నప్పుడు కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. 'ఆడపిల్ల మల్లయుద్ధం చేస్తుందా' అంటూ ఎగతాళి చేశారు. శిక్షణకు పంపించవద్దని నా మీద ఒత్తిడి తెచ్చారు. కానీ నేను వేటికీ తలొగ్గలేదు. అప్పుడు ఒక్కటే సంకల్పించాను... 'నా కూతుర్ని చాంపియన్‌గా చూడాలి. తను భారత్‌కు ప్రాతినిధ్యం వహించి పతకాలు తేవాలి' అని. నా ప్రార్థనలు, ప్రయత్నాలు ఫలించాయి. నేడు తపస్య ప్రపంచ చాంపియన్. ఇది నాడు అవహేళన చేసినవారికి, ఆడపిల్లలను తక్కువ చేసి మాట్లాడినవారికి తగిన సమాధానం" అంటారు పర్వేష్.

అప్పుడూ అడ్డుపడ్డారు...

ఇద్దరు సంతానంలో పెద్దమ్మాయి తపస్య. 2016లో రెజ్లింగ్ మొదలుపెట్టింది. ఆరంభంలో స్థానికంగానే శిక్షణ తీసుకుంది. ప్రొఫెషనల్‌గా ఎదగాలంటే అక్కడున్న సౌకర్యాలు సరిపోవు. దాంతో సోనీపత్ సమీపంలోని 'యుద్ధ్‌వీర్ అఖాడా'లో కుల్‌బీర్ రాణా నేతృత్వంలో శిక్షణ ఇప్పించాలని పర్వేష్ అనుకున్నారు. వాళ్ల ఊరుకు వంద కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంది ఆ అఖాడా. "నేను చిన్నకారు రైతును. ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. కుటుంబమంతటికీ అదే ఆధారం. నా భార్య నవీన్ కుమారి టీచర్. బయట ఊరికి పంపించి కూతురికి కోచింగ్ ఇప్పించాలంటే మా సంపాదన సరిపోదు. దానికితోడు చుట్టుపక్కల వారు, సంఘం పెద్దల నుంచి ఒత్తిడి... 'కట్టుబాట్లను కాదని ఆడపిల్లను బయటి ప్రాంతానికి పంపవద్ద'ని అప్పుడూ అడ్డుపడ్డారు. అయినా వెనక్కి తగ్గలేదు" అంటూ తపస్య తండ్రి నాటి రోజులు గుర్తు చేసుకున్నారు.

దేశం కోసం...

చిన్నప్పటి నుంచీ తపస్య పెద్దవాళ్ల అడుగుజాడల్లోనే నడిచింది. వయసు పెరిగే కొద్దీ ఆమెలో ఎంతో పరిణతి. పదమూడేళ్లప్పుడు ఇంటికి దూరంగా శిక్షణ కోసం వెళ్లినప్పుడు ఆమెకు ఒకటే లక్ష్యం... అమ్మానాన్న తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని. అంతేకాదు... భారత్‌కు ప్రాతినిధ్యం వహించి... దేశం కోసం పతకాలు తేవాలని. కోచ్ తపస్యను తన సొంత బిడ్డలా చూసుకున్నారు. బౌట్‌లో మేటిగా నిలబెట్టారు. స్థానిక పోటీలకు పంపించారు. క్రమంగా బౌట్‌లో పుంజుకొంటున్న తపస్య... రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగంలో పలు టైటిళ్లు నెగ్గింది. గత ఏడాది థాయ్‌లాండ్‌లో జరిగిన అండర్ 20 'ఆసియా చాంపియన్‌షిప్' 57 కేజీల విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుంది. ఇది ఆమెలో ఆత్మవిశ్వాసం నింపడమే కాదు... కెరీర్‌ను మరో స్థాయికి తీసుకువెళ్లింది. అదే ఏడాది జాతీయ స్థాయి పోటీల్లో రజత పతకం గెలిచిన తపస్య... జాతీయ క్రీడల్లో చాంపియన్‌గా ఆవిర్భవించింది. ఈ ఏడాది చివర్లో జరిగే సీనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. కోచింగ్ కోసం ఆమె తండ్రి ఐదు లక్షల రూపాయల అప్పు చేశారు. 'ఇంకా ఆ అప్పు అలాగే ఉంది' అంటారాయన. ప్రస్తుతం తపస్య తమ్ముడు దక్ష్ కూడా రెజ్లింగ్‌లో శిక్షణ తీసుకొంటున్నాడు. ఏదిఏమైనా ఒలింపిక్స్‌లో పతకం సాధించాలన్నదే తన లక్ష్యమంటున్న తపస్య... దాన్ని అందుకొనేందుకు ఒక తపస్సులా శ్రమిస్తోంది.

మేకప్

జోడుతో జోరుగా...

ఫ్యాషన్ కోసం పెట్టినా, మందగించిన కంటిచూపు కోసం వాడుకున్నా కళ్లజోడుకూ మేకప్‌కూ పొంతన కుదరదు. కానీ కొన్ని తెలివైన చిట్కాలు పాటిస్తే, కళ్లజోడుతో కూడా మేకప్‌ను మ్యాచ్ చేయవచ్చు. అదెలాగంటే...

ఐబ్రో: జోడు ఫ్రేమ్ కనుబొమలను కప్పేస్తున్నాయి కదా అని కనుబొమలను నిర్లక్ష్యం చేయకూడదు. వాటిని చక్కని ఆకృతిలో కత్తిరించుకుని, బ్రో పెన్సిల్‌తో దిద్దుకోవాలి. ఇలా చేస్తేనే జోడులో నుంచి కనుబొమలు స్పష్టంగా కనిపిస్తాయి

బ్రష్: జోడుతో మేకప్ వేసుకోవడంలో ఇబ్బంది ఉండనే ఉంటుంది కాబట్టి పొడవాటి హ్యాండిల్ కలిగిన మేకప్ బ్రష్‌లకు బదులుగా కురచ బ్రష్‌లు ఎంచుకోవాలి.

ఐలైనర్: కనురెప్పల పైనా, దిగువనా ఐలైనర్ తప్పనిసరిగా అప్లై చేసుకోవాలి. ఇందుకోసం పై కనురెప్పకు జెల్ ఐలైనర్ అప్లై చేసి, దిగువన పౌడర్ ఐలైనర్ ఉపయోగించాలి

ప్రైమర్: ముక్కుకు ఇరువైపులా ప్రైమర్ అప్లై చేసి రూపమివ్వాలి. కళ్లద్దాలు ముక్కు మీదకు జారిపోతూ ఉంటాయి. కాబట్టి ఇలా తరచూ జరగకుండా ఉండడం కోసం, ముక్కు మీద కళ్లజోడు తగిలే ప్రదేశంలో ఐషాడో ప్రైమర్‌ను అద్దుకోవాలి

మస్కారా: కాలం చెల్లిన మస్కారా వేసుకుంటే, అది పొడిపొడిగా జోడు మీద రాలిపడుతూ ఉంటుంది. కాబట్టి తాజా మస్కారా ఎంచుకోవాలి. ఒకసారి మూత తెరిచిన తర్వాత మస్కారాను మూడు నెలలకు మించి వాడుకోకూడదు. అలాగే క్రీమీగా ఉండే వాటర్‌ప్రూఫ్ మస్కారానే ఉపయోగించాలి. ఈ మస్కారాతో కనురెప్పలు జోడుకు అంటుకుపోకుండా ఉంటాయి

భూతద్దం: షార్ట్ సైట్ ఉన్నవాళ్లు జోడు ధరించకుండా మేకప్ వేసుకోలేరు. కాబట్టి జోడు లేకుండా మేకప్ వేసుకోవాలనుకుంటే, భూతద్దం కొనుక్కోవాలి. ఈ అద్దం దగ్గరుంటే, జోడుతో పని లేకుండా మేకప్ వేసుకోవచ్చు

స్ప్రే: కళ్లజోడు ధరించినప్పుడు కళ్ల చుట్టూ ఉండే ప్రదేశంలో తేలికగా చమట పడుతూ ఉంటుంది. కాబట్టి మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రే ఉపయోగించాలి.



ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మికి ఊరట

» తెలంగాణ హైకోర్టు తాజా తీర్పుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆమెను మళ్లీ నిందితురాలిగా చేరుస్తూ ఇచ్చిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. గతంలో ఈ కేసులో తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మిని నిందితుల జాబితా నుంచి తొలగించింది. ఈ నిర్ణయంపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శ్రీలక్ష్మి పేరు తొలగించడాన్ని హైకోర్టు పునఃపరిశీలించాలని సుప్రీం ఆదేశించింది. ఆ తర్వాత హైకోర్టు మళ్లీ ఆమె విచారణను ఎదుర్కోవలసిందేనని స్పష్టం చేస్తూ ఇటీవల తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఈ నెల 12న శ్రీలక్ష్మి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శుక్రవారం జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. గతంలో శ్రీలక్ష్మిని నిందితుల జాబితా నుంచి తొలగించిన హైకోర్టే.. మళ్లీ నిందితురాలిగా చేరుస్తూ తీర్పు ఇచ్చిందా అని ప్రశ్నించింది. ఆ తీర్పుపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వంతోపాటు ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబరు 28కి వాయిదా వేసింది.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద నీటి ప్రవాహ అంచనా పరీక్షలు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద శుక్రవారం నీటి ప్రవాహ తీవ్రతను అంచనా వేసే ఏడీసీపీ(అకోస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్) సర్వే నిర్వహించారు. పుణెకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్(సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) సైంటిస్టు నాగరాజ్ బృందం ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టారు. మేడిగడ్డ బ్యారేజీని సముద్రమట్టానికి 88 మీటర్ల ఎత్తులో నిర్మించగా బ్యారేజీ పూర్తిస్థాయిలో వరద ప్రవాహం ఉన్నప్పుడు ఆ తీవ్రత ఎలా ఉంటుందో గుర్తించడానికి ఈ సర్వే నిర్వహించినట్లు వారు తెలిపారు. బ్యారేజీ 'ఫుల్ రిజర్వాయర్ లెవల్' 100 మీటర్లు కాగా శుక్రవారం 97.30 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుండడంతో ఈ పరీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్ల టెండర్‌పై పిటిషన్ డిస్మిస్

» కేసు పెట్టిన సిరి ఫామ్స్‌కు హైకోర్టు రూ.లక్ష జరిమానా


హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు, ప్రభుత్వ గురుకులాలకు కోడిగుడ్ల సరఫరా కోసం జారీ చేసిన టెండర్లకు హైకోర్టులో మార్గం సుగమమైంది. ఈ టెండర్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. టెండర్ల ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు పిటిషనర్ అయిన సిరి ఫామ్స్‌పై రూ.లక్ష జరిమానా విధించింది. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గురుకులాలు, కేజీబీవీలు, వసతి గృహాలకు కలిపి టెండర్లు నిర్వహించుకోవాలని ఇటీవల ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన టెండర్‌ను ఎంపీ పౌల్ట్రీ అండ్ ఫీడ్‌కు అనుకూలంగా ఖరారు చేయడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన సిరి ఫామ్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని టెండర్ పొందిన ఎంపీ పౌల్ట్రీ అండ్ ఫీడ్ సంస్థ వాదించింది. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.


విజిలెన్స్ ఇన్‌చార్జ్‌గా విక్రంసింగ్ మాన్

హైదరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ విభాగం ఇన్‌చార్జిగా హైదరాబాద్ అదనపు కమిషనర్ విక్రంసింగ్ మాన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా ఉన్న కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్నారు.

ఓటరు జాబితా.. తప్పుల తడక

మృతి చెందినవారి ఓట్లు దర్శనం.. ఓపెన్ ప్లాట్లు, సర్వేనంబర్ల చిరునామాతో ఓటు హక్కు





చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలో ప్లాట్ నెంబర్ పేరిట ఓటు హక్కు ; ముడిమ్యాల ఓటరు జాబితాలో చనిపోయిన వ్యక్తుల పేర్లు

» ఒక్కో వ్యక్తికి రెండేసి ఓట్లు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా తప్పుల తడకలా ఉంది. తప్పుల్లేని జాబితాను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టమైన ఆదేశాలిచ్చినా జాబితా అలా కనిపించడం లేదు. ఓటరు జాబితాలో తప్పులు సవరించడానికి సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారని అధికారులు వెల్లడించినా యథావిధిగా తప్పులతో జాబితా విడుదల కావడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గందరగోళంగా రంగారెడ్డి జిల్లా జాబితా

రంగారెడ్డిజిల్లాలో ఓటరు జాబితా గందరగోళంగా ఉంది. జిల్లాలోని 21 గ్రామీణ మండలాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం మొత్తం ఓట్లు 7,52,254 కాగా, వీరిలో పురుషులు 3,76,873, మహిళలు 3,75,353 మంది ఉన్నారు. ప్రధానంగా చేవెళ్ల, యాచారం, మంచాల, చౌదరిగూడ, నందిగామ, కొత్తూరు, ఫరూఖ్‌నగర్, కందుకూరు తదితర మండలాల్లోని ఓటరు జాబితాలో పలు తప్పులు చోటు చేసుకున్నాయి. పలు గ్రామాల్లోని ఓటరు జాబితాలో చనిపోయినవారి పేర్లు దర్శనమిస్తున్నాయి. ఒకే వ్యక్తి పేరుమీద రెండేసి ఓట్లు ముద్రించడం, స్థానికంగా చిరునామా లేనివారికీ ఓట్లు కల్పించడం గమనార్హం. ఒకే ఇంటి నెంబర్‌పై 10 నుంచి 15 వరకు ఓట్లు కల్పించడంతో పాటు వివాహమై అత్తారింటికి వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించలేదు. కొన్ని గ్రామాల్లో వార్డుల విభజన సరిగ్గా జరగలేదన్న ఫిర్యాదులు వచ్చాయి. చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామ శివారుల్లోని ఓ ఫామ్‌హౌస్‌లో పని చేసే వ్యక్తుల పేరిట సుమారు 80 మందికి ఓటు హక్కు కల్పించారు. అంతేకాకుండా, ఓపెన్ ప్లాట్, సర్వేనెంబర్ల చిరునామాతో ఓటు హక్కు కల్పించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే, ఓటరు జాబితాలో పేర్లు తొలగించడం ఇప్పుడు వీలుకాదని అధికారులు చెబుతున్నారు.

బోగస్ ఓట్లను తొలగించాలి

ఓటరు జాబితాను పారదర్శకంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. చనిపోయిన వారి ఓట్లు తొలగించడంలో విఫలమయ్యారు. ఇప్పటికైనా తప్పులు సవరించి బోగస్ ఓట్లను తొలగించాలి.

-డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి

అంటువ్యాధులొస్తున్నాయ్.. జాగ్రత్త!

ఎడతెరిపిలేని వానలు, వరదలు.. నీరు, ఆహారం కలుషితమయ్యే అవకాశం

- డయేరియా, కలరా వంటి సమస్యలు
- వానలు తగ్గాక దోమలు, కీటకాల విస్తృతి..
- డెంగీ, చికున్ గున్యా, మలేరియా ప్రబలే ప్రమాదం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: వైద్యులు
- ఇప్పటికే ఆస్పత్రులకు జ్వర బాధితులు



హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు, పలుచోట్ల వరదలు ఆందోళన రేపుతున్నాయి. ఎక్కడ చూసినా నీళ్లే నిలిచిపోయి కనిపిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉందికానీ ఇకపై మరో ముప్పు పొంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాలు తగ్గిన తర్వాత అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు కలసికట్టుగా దాడి చేసే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఎడతెరిపిలేని వర్షాలు, వరదలు, నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లడం వల్ల నీటితోపాటు కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలు కలుషితం అవుతాయి. దీనితో టైఫాయిడ్, డయేరియా, కలరా, మలేరియా వంటివి ప్రబలే అవకాశం ఉందని, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఇక ఎడతెరిపి లేని వానలతో ఉష్ణోగ్రతలు తగ్గి వైరస్‌లు, బ్యాక్టీరియాలు విజృంభిస్తాయని.. జలుబు, ఫ్లూ, న్యూమోనియా, ఇతర శ్వాసకోశ సమస్యలు రావొచ్చని వివరిస్తున్నారు. వర్షాలతో ఎక్కడిక్కడ నీళ్లు నిలిచి ఉండటంతో దోమలు, కీటకాల ఉధృతి పెరిగి.. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా విజృంభించే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. రహదారులపై కలుషిత నీటిలో నడవడం వల్ల చర్మ సమస్యలూ వస్తాయని హెచ్చరిస్తున్నారు. వచ్చే నెల రోజులు జాగ్రత్తగా ఉండాలని.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి అని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఇంటి పరిసరాల్లో ఎక్కడ నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో భారీగా ఓపీ నమోదు

ఆగస్టులో శుక్రవారం నాటికి ప్రభుత్వ ఏరియా, కమ్యూనిటీ, బోధనాస్పత్రుల్లో 12.91 లక్షల ఓపీ నమోదైనట్లు వైద్యారోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అంటే రోజుకు 44,537 మంది ఆస్పత్రులకు వస్తున్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో కలిపి 26,88,108 ఓపీ నమోదైంది. విషజ్వరాలతో వస్తున్న బాధితుల సంఖ్య పెరుగుతోందని వైద్యారోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

బస్తీ, కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలి



వరదలు వచ్చిన ప్రాంతాల్లో ఆహారం, నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంటుంది. కలరా, టైఫాయిడ్, హెపటైటిస్ ఏ, ఈ వంటివి సోకే అవకాశాలు ఎక్కువ. జనసాంద్రత ఎక్కువగా ఉండే పట్టణాలు, బస్తీ, కాలనీల్లో అంటు వ్యాధులు త్వరగా ప్రబలే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం వైరల్ జ్వరాల తీవ్రత కనిపిస్తోంది. ఈ పరిస్థితి కొన్నిరోజుల పాటు ఉంటుంది. మూడు రోజులకు మించి జ్వరం కొనసాగితే తక్షణమే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలి. సొంత వైద్యంతో పరిస్థితి విషమించే ప్రమాదం ఉంటుంది.

- డాక్టర్ రాజారావు, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

వేర్వేరు వ్యాధులు కలిసి వస్తున్నాయి



భారీ వర్షాలు, వరదల తర్వాత అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. జాగ్రత్తగా ఉండాలి. తాజా ఆహారం తీసుకోవాలి, కాచి వడగట్టిన మంచినీరే తాగాలి. ఇష్టారాజ్యంగా యాంటీ బయాటిక్స్ వేసుకోవద్దు. వైరల్ జ్వరాలకు యాంటీ బయాటిక్స్ పనిచేయవు. జ్వరాలు ఎక్కువ రోజులు ఉంటే వైద్యుల సలహాతో వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఒళ్లునొప్పులు ఉన్నాయని పెయిన్స్ కిల్లర్స్ ఇష్టమొచ్చినట్టు వాడొద్దు. వాటితో రక్తంలో ప్లేట్‌లెట్లు పడిపోయే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం డెంగీ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలు ఒకే సమయంలో సోకుతున్నాయి. పరిశుభ్రత, కొద్దిపాటి జాగ్రత్తలతో సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చు. వరదలు వచ్చిన ప్రాంతాల్లో నిల్వ నీటి తొలగింపు, క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టాలి. నీటి పైపుల లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయాలి.

- డాక్టర్ ఎంవీరావు, కన్సల్టెంట్ ఫిజీషియన్, యశోద ఆస్పత్రి, హైదరాబాద్

జన్‌ధన్ యోజనతో ఆర్థిక సాధికారత

» కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ఆర్థిక సాధికారత, ఆర్థిక వ్యవస్థను వృద్ధి బాటలో నడిపేందుకు ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఎంతగానో ఉపయోగపడిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. జన్‌ధన్ యోజన ప్రారంభించిన సమయంలో దేశంలోని అనేక మంది బడుగు, బలహీన, పేద ప్రజలకు కనీసం బ్యాంకు ఖాతా కూడా లేదని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం 2014 ఆగస్టు 28న ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనను అమల్లోకి తెచ్చారని వెల్లడించారు. 11 ఏళ్లలో జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్ల సంఖ్య 56 కోట్లకు పెరగగా.. అందులో ఖాతాదారులు జమచేసుకున్న మొత్తం రూ.2.68 లక్షల కోట్లు అని వెల్లడించారు. తెలంగాణలో జన్‌ధన్ యోజనలో భాగంగా 1.3 కోట్ల అకౌంట్లు తెరవగా.. అందులో ఖాతాదారులు రూ.5,055.35 కోట్లు జమ చేసుకున్నారని పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు బీజేపీ పర్యవేక్షక కమిటీ

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కమిటీని ఏర్పాటు చేశారు. బీజేఎల్పీ ఉపనేత పాయల శంకర్, ఎంపీ రఘునందన్‌రావు, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌతంరావు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



ప్రేక్షకులను మెప్పిస్తోంది

నారా రోహిత్

"సుందరకాండ' సినిమాకి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. కుటుంబ ప్రేక్షకులు మా చిత్రాన్ని అమితంగా ఆదరిస్తున్నారు' అని అన్నారు హీరో నారా రోహిత్. ఆయన కథానాయకుడిగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'సుందరకాండ' చిత్రం ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ 'సినిమాలో సత్య పాత్రను ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తున్నారు. వెంకీ రాసిన డైలాగ్స్ గురించి చాలా మంది ప్రత్యేకంగా చెప్పారు' అని అన్నారు. వెంకటేశ్ నిమ్మలపూడి మాట్లాడుతూ 'సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. ఇలాంటి నిర్మాతలు దొరకడం నా అదృష్టం. నారా రోహిత్ నన్ను నమ్మి ఉండకపోతే ఈ రోజు మీ ముందు ఇలా ఉండేవాడిని కాదు' అని అన్నారు.



తన అభిమాన నటుడు చిరంజీవిని కలిసేందుకు ఆంధ్రప్రదేశలోని ఆదోని పట్టణానికి చెందిన రాజేశ్వరి అక్కడ నుంచి సైకిల్‌పై హైదరాబాద్ వచ్చారు. శుక్రవారం చిరంజీవిని కలసి, ఆయన చేతికి రాఖీ కట్టారు. ఆమెను ఆశీర్వదించిన చిరంజీవి ఓ చీరను బహుమతిగా ఇవ్వడంతో పాటు రాజేశ్వరి పిల్లల చదువుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తానని తెలిపారు.



దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా, ఆయన సోదరుడు, నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రకాళి ప్రొడక్షన్స్ తరపున ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళాన్ని అందించారు.

విశాల్ ధన్సిక నిశ్చితార్థం



కోలీవుడ్ హీరో, నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్, హీరోయిన్ ధన్సికల వివాహ నిశ్చితార్థం శుక్రవారం చెన్నైలో జరిగింది. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ వేడుకలో ఇరు కుటుంబాల సభ్యులు మాత్రమే పాల్గొన్నట్టు వెల్లడించిన విశాల్.. అందరి ఆశీస్సులు కావాలని కోరుతూ తమ నిశ్చితార్థ ఫోటోలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. 'ఈ రోజున మా కుటుంబ సభ్యుల సమక్షంలో ధన్సికకు, నాకు నిశ్చితార్థం జరిగింది. ఈ విషయాన్ని ఎంతో సంతోషంగా మీడియా ద్వారా అందరికీ తెలియజేస్తున్నాను. వివాహ తేదీని త్వరలోనే వెల్లడిస్తాం. ధన్సికతో నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో త్వరలోనే నా బ్యాచిలర్ జీవితానికి ముగింపు రానుంది. ఇకపై నా సినిమాల్లో ముద్దు సన్నివేశాలు ఉండవు' అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

పౌరాణిక 'మయూఖం'



కుశలవ్, తన్మయి హీరో, హీరోయిన్లుగా వెంకట్ బులెమోని దర్శకత్వంలో తెరకెక్కనున్న మైథలాజికల్ థ్రిల్లర్ సినిమా 'మయూఖం'. పూజా కార్యక్రమాలతో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని సినెటేరియా మీడియా వర్క్స్ బేనర్‌పై శ్రీలత వెంకట్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి టీ సిరీస్ సంస్థ ప్రతినిధి ప్రియాంక మన్యాల్ క్లాప్ కొట్టగా, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

మన జీవితాల నుంచి పుట్టిన కథ



మౌళి తనుజ్, శివానీ నాగరం ప్రధాన పాత్రధారులుగా దర్శకుడు సాయిమార్తాండ్ రూపొందించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఆదిత్య హాసన్, సాయి కృష్ణ నిర్మించారు. సెప్టెంబరు 5న థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో నిర్మాత ఆదిత్య హాసన్ మాట్లాడుతూ 'అందరికీ రిలేట్ అయ్యే కథ ఇది. అందరి ఇళ్లల్లో ఉండే కథే. ప్రేక్షకులు సినిమా చూస్తున్నంత సేపూ మన జీవితంలో కూడా ఇలానే జరిగిందనే అనుభూతికి లోనవుతారు. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. చదువు రాని అబ్బాయి, అమ్మాయి మధ్య జరిగే ఫన్నీ లవ్ స్టోరీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.

బిజినెస్

జీడీపీ హుషారు.. రూపాయి బేజారు



జూన్ త్రైమాసిక వృద్ధి 7.8% ● అంచనాలను మించి పరుగు
జీవితకాల కనిష్ఠానికి రూపాయి ● ఒక్క రోజులో 51 పైసలు డౌన్

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో (క్యూ1) అంచనాలను మించి 7.8% వృద్ధి రేటును నమోదు చేసింది. తొలి త్రైమాసికానికి ఇటీవల ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 6.5% కన్నా ఇది చాలా అధికం. ఇది ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి. ఆ రకంగా ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని భారత్ నిలబెట్టుకుంది. గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన వృద్ధి రేటు 8.4% తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. కాగా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో చైనా ఆర్థిక వృద్ధి రేటు 5.2 శాతానికే పరిమితం అయింది. అయితే ఇది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు అమలులోకి రాక ముందు పరిస్థితి. ఇప్పుడు భారత ఉత్పత్తులపై 50% సుంకాలు అమలులోకి రావడంతో టెక్స్‌టైల్స్ సహా కీలక ఎగుమతి రంగాలు డీలా పడి వృద్ధి అంచనాలను తలకిందులు చేయవచ్చని పరిశీలకులంటున్నారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం వ్యవసాయ రంగం క్యూ1లో బలమైన వృద్ధి రేటు నమోదు కావడానికి ఊతం ఇచ్చింది. అలాగే వాణిజ్యం, హోటళ్లు, ఆర్థిక, రియల్ ఎస్టేట్ రంగాలు సహా సేవల రంగం కూడా ఈ వృద్ధికి బాసటగా నిలిచింది. ఎన్ఎస్ఓ గణాంకాల్లోని ప్రధానాంశాలు...

- వ్యవసాయ రంగం క్యూ1లో 3.7% వృద్ధి రేటు నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ రంగం వృద్ధి రేటు 1.5 శాతంగా ఉంది. తయారీ రంగం వృద్ధి మాత్రం మందకొడిగా ఉంది. ఈ రంగం వృద్ధి రేటు 7.6% నుంచి 7.7 శాతానికి పెరిగింది.
- స్థిర ధరల్లో ఆర్థిక వ్యవస్థ విలువ గత ఏడాది క్యూ1తో పోల్చితే రూ.44.41 లక్షల కోట్ల నుంచి రూ.47.89 లక్షల కోట్లకు పెరిగింది. అంటే వృద్ధి రేటు 7.8 శాతంతో సమానం.
- ప్రస్తుత ధరల ప్రకారం ఆర్థిక వ్యవస్థ విలువ రూ.రూ.86.05 లక్షల కోట్లుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.79.08 లక్షల కోట్లతో పోల్చితే వృద్ధి రేటు 8.8 శాతంగా ఉంది.
- ప్రభుత్వ తుది వినియోగ వ్యయం బలమైన పునరుజ్జీవంతో 4% నుంచి 9.7 శాతానికి పెరిగింది. రిటైల్ ప్రైవేట్ తుది వినియోగ వ్యయం మాత్రం 8.3% నుంచి 7 శాతానికి దిగజారింది. స్థిర ధరల ప్రకారం స్థూల స్థిర పెట్టుబడులు 6.7% నుంచి 7.8 శాతానికి పెరిగాయి.
- విభిన్న విధానాల ద్వారా జీడీపీ మదింపులో ఏర్పడిన వ్యత్యాసం రూ.33,384 కోట్ల నుంచి రూ.1.11 లక్షల కోట్లకు పెరిగింది.

అమెరికా సుంకాల ప్రభావం వల్ల వృద్ధి రేటు క్షీణించే ముప్పు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 6.3%-6.8% మధ్యన ఉండవచ్చు. దేశీయ డిమాండు బలంగా ఉండడం ఇందుకు కారణం. జీడీపీపై సుంకాల ప్రభావం తాత్కాలికంగానే ఉంటుంది. జీఎస్‌టీ రేట్ల సరవణకు కసరత్తు జరుగుతూ ఉండడం, పండగల డిమాండు వృద్ధికి ఊతం ఇచ్చే అంశాలు.

- అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు

పాతాళానికి రూపాయి

ట్రంప్ సుంకాల ప్రభావం ఫారెక్స్ మార్కెట్‌పై తీవ్రంగా పడింది. శుక్రవారం అమెరికా డాలర్ మారకంలో రూపాయి తొలిసారిగా 88 కన్నా దిగజారింది. శుక్రవారం ఉదయం 87.73 వద్ద ప్రారంభమైన రూపాయి త్వరితగతిన దిగజారుతూ ఒక దశలో 88.33 వరకు కూడా పడిపోయింది. చివరికి నష్టాన్ని 51 పైసలకు పరిమితం చేసుకుని 88.09 వద్ద ముగిసింది. ఈ రెండూ జీవితకాల కనిష్ఠ స్థాయిలే. కాగా గురువారం నాడు రూపాయి 11 పైసలు నష్టపోయి 87.58 వద్ద ముగిసింది.

విదేశీ నిధుల తరలింపే కారణం: ట్రంప్ సుంకాల అమలు అనంతరం భారత మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారీ ఎత్తున నిధులు తరలించుకుపోతున్నారు. ఎఫ్‌పీఐలు శుక్రవారం ఒక్క రోజులోనే రూ.8,312.66 కోట్లు తరలించుకుపోయారు. గురువారం రూ.3,856.51 కోట్ల విలువ గల ఈక్విటీలు విక్రయించారు. ఒకపక్క విదేశీ నిధులు భారీగా తరలిపోవడంతో పాటు మరోపక్క భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఏర్పడిన ఉద్రిక్తతలతో దేశీయ కరెన్సీ తీవ్ర ఒత్తిడికి లోనవుతోందని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు.

ఫారెక్స్ నిల్వలు డౌన్: రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ నెల 22వ తేదీతో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు 438.6 కోట్ల డాలర్లు దిగజారి 69,072 కోట్ల డాలర్లకు తగ్గాయి.

ఏఐ సరికొత్త కామధేనువు

ప్రతి ఒక్కరికీ కృత్రిమ మేధ సేవలందిస్తాం

గూగుల్, మెటా భాగస్వామ్యంలో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు

వచ్చే ఏడాది జియో పబ్లిక్ ఇష్యూ.. ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడి



న్యూఢిల్లీ: రిలయన్స్ జియోతో దేశ టెలికాం రంగంలో సంచలనం సృష్టించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మరో సంచలనానికి సిద్ధమవుతోంది. దేశంలో ప్రతి చోట, ప్రతి ఒక్కరికీ కృత్రిమ మేధ (ఏఐ) సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం రిలయన్స్ ఇంటలిజెన్స్ పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. శుక్రవారం కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఆర్ఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ముకేశ్ అంబానీ ఈ విషయం వెల్లడించారు. 'జియో ద్వారా దేశంలో ప్రతి చోట, ప్రతి ఒక్కరికీ డిజిటల్ సేవలను చేరువ చేశాం. ఇప్పుడు అదే తరహాలో రిలయన్స్ ఇంటలిజెన్స్ ద్వారా దేశంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి చోటా ఏఐ సేవలు అందిస్తాం' అన్నారు. ఏఐ కామధేనువులా తమ వ్యాపార విస్తరణకు తదుపరి చోదక శక్తి కాబోతోందని ముకేశ్ అంబానీ ప్రకటించడం విశేషం.

మెటా, గూగుల్‌తో జట్టు: అంతర్జాతీయ టెక్ దిగ్గజాలతోనూ రిలయన్స్ చేతులు కలుపుతోంది. ఏఐ సేవల కోసం ఫేస్‌బుక్ మాతృసంస్థ 'మెటా'తో కలిసి ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేసింది. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బెర్గ్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ జేవీలో తొలుత ఇరు సంస్థలు రూ.10 కోట్ల డాలర్ల (రూ.855 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ జేవీ ద్వారా కంపెనీలు, ప్రభుత్వానికి అవసరమైన ప్రత్యేక ఏఐ సేవలను అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం మెటాకు చెందిన ఓపెన్‌సోర్స్ ఎల్ఎల్ఏఎంఏ మోడల్స్‌ను ఉపయోగిస్తామని జుకర్‌బర్గ్ తెలిపారు. మరోవైపు గూగుల్‌తో కలిసి గుజరాత్, జామ్‌నగర్ ప్రాంతంలోని తన వ్యాపార అవసరాల కోసం ప్రత్యేక క్లౌడ్ రీజియన్ ఏర్పాటు చేయబోతున్నట్టు అంబానీ ప్రకటించారు.

జియో నుంచి స్మార్ట్ గ్లాసెస్: జియో ఫ్రేమ్స్ పేరుతో జియో స్మార్ట్ గ్లాసెస్‌లోకి ప్రవేశించింది. ఆర్ఐఎల్ ఏజీఎంలో రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ ఈ స్మార్ట్ గ్లాసెస్‌ను ఆవిష్కరించారు. ఈ గ్లాసెస్ ద్వారా చేయి పెట్టకుండానే ఏఐ వాయిస్ అసిస్టెంట్ 'రియా' సాయంతో అన్ని భారతీయ భాషల్లో ఫోన్ కాల్స్, మ్యూజిక్, వీడియో రికార్డింగ్స్ వంటి పనులు చేసుకోవచ్చు.

జోరుగా రిటైల్ వ్యాపారం: రిలయన్స్ రిటైల్ వ్యాపారం కూడా జోరందుకున్నట్లు ఆర్ఐఎల్ డైరెక్టర్ ఈషా అంబానీ ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈ విభాగం రూ.3.3 లక్షల కోట్లకుపైగా వ్యాపారం నమోదు చేసిందని వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో రిటైల్ వ్యాపారం ఏటా సగటున 20 శాతం చొప్పున పెరగనుందన్నారు. తమ వ్యాపార ఆదాయంలో 70 శాతం స్టోర్ల ద్వారానే వస్తున్నందున ఏటా 2,000 నుంచి 3,000 కొత్త స్టోర్ల ఏర్పాటు కొనసాగుతుందని ఈషా అంబానీ తెలిపారు.

2026 జూన్ నాటికి జియో మెగా ఐపీఓ

రిలయన్స్ జియో మెగా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మీద కూడా ముకేశ్ అంబానీ స్పష్టత ఇచ్చారు. వచ్చే ఏడాది (2026) జూన్ లోపే ఈ ఐపీఓ మార్కెట్‌కు వస్తుందని ప్రకటించారు. భారత క్యాపిటల్ మార్కెట్ చరిత్రలో ఇదే అతి పెద్ద ఐపీఓ అవుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జియో ఖాతాదారుల సంఖ్య 50 కోట్లు మించిపోయిందని జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రకటించారు. దీంతో ప్రపంచంలోని అతిపెద్ద టెలికాం కంపెనీల్లో ఒకటిగా జియో ఆవిర్భవించినట్టు తెలిపారు.

ఏజీఎం ఇతర ప్రధాన అంశాలు

- 2030 నాటికి రెండింతలు పెరగనున్న వ్యాపారం
- వచ్చే మూడు, నాలుగేళ్లలో జియో, రిటైల్ ఆదాయాలు రెట్టింపు
- కేజీ బేసిన్‌లో చమురు, సహజ వాయువుల కోసం మరిన్ని బావుల తవ్వకం
- కేజీ బేసిన్‌లో 21,000 బ్యారళ్లకు చేరిన రోజువారీ ముడి చమురు ఉత్పత్తి
- గత ఆర్థిక సంవత్సరం 11 శాతం వృద్ధితో రూ.6,26,921 కోట్ల ఆదాయం
- మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా చమురు శుద్ధి సామర్థ్యం పెంపు
- న్యూ ఎనర్జీలో కొత్త వ్యాపార ప్రాజెక్టులపై రూ.75,000 కోట్ల పెట్టుబడులు
- తొలి మూడు నెలల్లోనే 60 కోట్లకు చేరిన జియోహాట్‌స్టార్ వినియోగదారులు
- త్వరలో రిలయన్స్ నుంచి ఏఐ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోలు
- 2035 నాటికి పూర్తి కాలుష్య రహిత కంపెనీగా ఆర్ఐఎల్

ఐఎంఎఫ్ ఈడీగా ఉర్జిత్ పటేల్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న కేవీ సుబ్రమణియన్‌ను ప్రభుత్వం ఆరు నెలల ముందుగానే తొలగించింది. ఈయన స్థానంలో పటేల్‌ను తాజాగా ప్రభుత్వం నియమించింది. కాగా పటేల్ గత ఏడాది జనవరి వరకు ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పట్టాను అందుకున్న పటేల్ 2016 నుంచి 2018 డిసెంబరు వరకు ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేశారు.

ఫిలిప్పీన్స్‌లో నెఫ్రోప్లస్ విస్తరణ

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్.. ఫిలిప్పీన్స్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. ఇందులో భాగంగా మరో ఐదు డయాలసిస్ క్లినిక్స్‌ను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. నెఫ్రోప్లస్ పేరుతో కంపెనీ డయాలసిస్ సేవలందిస్తోంది. ఈ కొనుగోలుతో ఫిలిప్పీన్స్‌లో మొత్తం క్లినిక్ సంఖ్య 39కి చేరుకుంది. 2020లో కంపెనీ ఫిలిప్పీన్స్ మార్కెట్లోకి అడుగుపెట్టినప్పటి నుంచి ఏటా కార్యకలాపాలు విస్తరిస్తూ వస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30 తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	560
వరంగల్	517	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	విజయవాడ	112
వరంగల్	92	గుంటూరు	107
కరీంనగర్	92	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	97
కర్నూలు	92	నెల్లూరు	102
విశాఖపట్నం	116	అనంతపురం	102
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,03,310 ▲	94,700 ▲	1,29,000 ▼
విజయవాడ	1,05,000 ▲	98,000 ▲	1,20,300 ▲
విశాఖపట్నం	1,05,540 ▲	94,050 ▲	1,29,900 ▼
రాజమండ్రి	1,03,310 ▲	94,700 ▲	1,20,500 ▲
ప్రొద్దుటూరు	1,03,800 ▲	94,990 ▲	1,19,600 ▲
ముంబై	1,02,388 ▲	93,787 ▲	1,17,572 ▲

80,000 దిగువకు సెన్సెక్స్

ముంబై: అమెరికా సృష్టించిన సుంకాల కల్లోలంతో వరుసగా మూడో రోజు కూడా మార్కెట్ పతనమైంది. ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు రెండూ పతనాల బాటలో పయనించగా బులియన్ మార్కెట్ మాత్రం దూసుకుపోయింది. దీంతో శుక్రవారం సెన్సెక్స్ 270.92 పాయింట్లు నష్టపోయి 79,809.65 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 338.81 పాయింట్ల నష్టంతో డే కనిష్ఠ స్థాయి 79,741.76ని తాకింది. కాగా నిఫ్టీ 74.05 పాయింట్ల నష్టంతో 24,426.85 వద్ద క్లోజైంది. వరుసగా 3 రోజుల పతనంతో ఇన్వెస్టర్ల సంపద రూ.11,21,459.36 కోట్లు ఆవిరైపోయింది.

బంగారం దూకుడు: ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లకు భిన్నంగా బులియన్ మార్కెట్లో కొనుగోళ్లు జోరుగా సాగాయి. స్టాకిస్టులు భారీ ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడంతో ఒక్క రోజులోనే 10గ్రాముల మేలిమి బంగారం (99.9% స్వచ్ఛత) ధర రూ.2,100 దూసుకుపోయి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,03,670ని తాకిందని అఖిల భారత సరాఫా అసోసియేషన్ తెలిపింది. ఆభరణాల బంగారం (99.5 స్వచ్ఛత) కూడా అదే స్థాయిలో పెరిగి రూ.1,03,100 పలికింది. బంగారం ధర పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. వారం మొత్తంలో బంగారం ధర రూ.3,300 (3.29%) పెరిగింది.



ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) **2024-25** ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి **రూ.7,324.34** కోట్ల డివిడెండ్‌ను అందించింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి ఎం నాగరాజు, ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్లు దినేశ్ పంత్, రత్నాకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

తలైవాస్ శుభారంభం

● తెలుగు టైటాన్స్ ఓటమి ● ప్రొ కబడ్డీ లీగ్



ఆరంభ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ధన్‌రాజ్ పిళ్లే, గోపీచంద్, రవికాంత్ రెడ్డి, వైభవ్ సూర్యవంశీ, జ్యోతి తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): సొంతగడ్డపై జరుగుతున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)ను విజయంతో ప్రారంభించాలనుకున్న తెలుగు టైటాన్స్‌కు నిరాశే ఎదురైంది. ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం మొదలైన లీగ్‌లో టైటాన్స్ జట్టుకు తమిళ్ తలైవాస్ ఝలకిచ్చింది. హోరాహోరీగా సాగిన తొలి మ్యాచ్‌లో తలైవాస్ 38-35 స్కోరుతో తెలుగు టైటాన్స్‌పై విజయం సాధించింది. స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ సూపర్ 10, కెప్టెన్ పవన్ సెహ్రావత్ 9 పాయింట్లు స్కోరు చేసి తలైవాస్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక, ఆతిథ్య టైటాన్స్ జట్టు తరఫున భరత్ హుడా తొమ్మిది పాయింట్లతో రాణించాడు. అనంతరం పుణెరి పల్టన్, బెంగళూరు బుల్స్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో తొలుత 32-32తో స్కోర్లు సమమయ్యాయి. దీంతో ఫలితం కోసం నిర్వహించిన టైబ్రేకర్‌లో పుణెరి జట్టు 6-4తో విజయం సాధించింది. అంతకుముందు.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక అతిథిగా హాజరై లీగ్‌ను ప్రారంభించారు. ఆరంభ వేడుకల్లో హాకీ మాజీ కెప్టెన్ ధన్‌రాజ్ పిళ్లే, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, అంతర్జాతీయ అథ్లెట్ యర్రాజీ జ్యోతి, కబడ్డీ దిగ్గజం పర్దీప్ నర్వాల్, పారాలింపిక్స్ పతక విజేత యోగేశ్ కథూనియా పాల్గొన్నారు.

సింధుకు నిరాశ

స్పోర్ట్స్

క్వార్టర్‌ఫైనల్లో ఓటమి ● కపిల జోడీ సైతం..
ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



పారిస్: ప్రీక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ వాంగ్ జియాని వరుస గేముల్లో చిత్తు చేయడంతో..భారత స్టార్ పీవీ సింధు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆరో పతకం సాధిస్తుందని భావించారు. కానీ సింధుకు నిరాశ తప్పలేదు. శుక్రవారంనాటి హోరాహోరీ క్వార్టర్‌ఫైనల్లో భారత షట్లర్ ఓటమి పాలైంది. పుత్రి కుసుమ వర్దని (ఇండోనేసియా)తో జరిగిన రౌండ్-8 పోరులో సింధు 14-21, 21-13, 16-21తో పరాజయం చవిచూసింది. అంతకుముందు జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో కపిల/క్రాస్టో ద్వయం 15-21, 13-21తో వరుస గేముల్లో వరల్డ్ నెం.4 మలేసియా జోడీ చెన్ టాంగ్/తో ఈ వీ చేతిలో ఓడిపోయింది. 23 ఏళ్ల వర్దనితో మ్యాచ్‌లో కీలకమైన తరుణాల్లో సింధు తడబాటుకు లోనైంది. తొలి గేమ్‌లో విరామానికి 11-7తో నిలిచిన కుసుమ 18-9 తిరుగులేని ఆధిక్యంలో నిలిచి, అదే జోరులో గేమును చేజిక్కించుకుంది. కానీ రెండో గేములో నెట్ ఆటతోపాటు తనదైన శైలి స్మాష్‌లతో పీవీ ముందంజ వేసింది. ఆపై 16-6తో ఆధిక్యం ప్రదర్శించిన సింధు 21-13తో గేమును సొంతం చేసుకుని పోటీలోకి వచ్చింది. ఇక నిర్ణాయక మూడో గేములో ఇద్దరూ తగ్గేదెలే అనేలా ఆడడంతో 7-7, 8-8, 9-9తో స్కోరు సమమై ఉత్కంఠ పెరిగిపోయింది. ఈ తరుణంలో సింధు తప్పిదాలను సద్వినియోగం చేసుకున్న వర్దని 15-11తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే సింధు పోరాడి 16-17కి ఆధిక్యాన్ని తగ్గించింది. కానీ పొరపాట్లను పునరావృతం చేసిన భారత షట్లర్ గేమును, మ్యాచ్‌ను కోల్పోయింది.

దిల్బగ్ సింగ్‌కు రజతం

కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

అహ్మదాబాద్: కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు శుక్రవారం మరో రెండు పతకాలు లభించాయి. పురుషుల 94 కేజీల విభాగంలో దిల్బగ్ సింగ్ రజతం సాధించాడు. స్నాచ్‌లో 153 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 189 కేజీల బరువు ఎత్తిన దిల్బగ్ (342 కేజీలు) కేవలం ఒక్క కేజీ తేడాతో ప్రత్యర్థి మొహమ్మద్ సైమీ (మలేసియా, 343 కేజీలు)కి స్వర్ణం కోల్పోయాడు. అలాగే మహిళల 86 కేజీల విభాగంలో వన్షిత వర్మ కాంస్యం సాధించింది. స్నాచ్‌లో 95 కేజీలు ఎత్తిన ఆమె.. క్లీన్ అండ్ జెర్క్‌లో 127 కేజీల బరువు ఎత్తింది. మొత్తంగా టోర్నీలో భారత్ ఖాతాలో ఏడు పతకాలు చేరాయి. 31 దేశాల నుంచి 300 మంది లిఫ్టర్లు పాల్గొంటున్న ఈ టోర్నీ శనివారంతో ముగియనుంది.

ముకేష్‌కు రెండు పతకాలు



ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ షూటర్ నేలవల్లి ముకేష్ రెండు పతకాలు కొల్లగొట్టాడు. జూనియర్ పురుషుల 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో పసిడి పతకం అందుకున్న ముకేష్, వ్యక్తిగత కేటగిరీలో కాంస్యం సాధించాడు. శుక్రవారం జరిగిన 25మీ. పిస్టల్ టీమ్ విభాగంలో ముకేష్, సూరజ్, అభినవ్ త్రయం (1746 పాయింట్లు) స్వర్ణం దక్కించుకుంది. జూనియర్ 25 మీ. పిస్టల్ వ్యక్తిగత కేటగిరీలో ముకేష్ (576) కాంస్యం నెగ్గాడు. పురుషుల 25 మీ. ఫైర్‌పిస్టల్ వ్యక్తిగత విభాగంలో రాజ్‌కన్వర్ సింగ్ స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఆపై..రాజ్‌కన్వర్, గుర్‌ప్రీత్, అంకుర్ త్రయం 25మీ. ఫైర్ పిస్టల్ టీమ్ విభాగంలో పసిడి దక్కించుకుంది. పురుషుల డబుల్ ట్రాప్ వ్యక్తిగత కేటగిరీలో అంకుర్‌కు స్వర్ణం, టీమ్ విభాగంలో కాంస్యం లభించాయి. ఇక మహిళల డబుల్ ట్రాప్ వ్యక్తిగత విభాగంలో మనోళ్లు క్లీన్ స్వీప్ చేశారు. సీనియర్ విభాగంలో భారత్ మొత్తం 31 పతకాలు (14-8-9) సాధించింది. తద్వారా చైనా (15-12-3=30) తర్వాత రెండో స్థానంలో నిలిచింది. అయితే ఓవరాల్‌గా సీనియర్, జూనియర్, యూత్ విభాగాలలో కలిపి మనోళ్లు మొత్తం 103 పతకాలు (52-26-25) కైవసం చేసుకున్నారు.



గాఫ్ గర్జన

మూడో రౌండ్‌కు అమెరికా స్టార్ ● సినర్, జ్వెరెవ్ కూడా
ప్రీక్వార్టర్స్‌కు రిబకినా ● యూఎస్ ఓపెన్

న్యూయార్క్: ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న అమెరికా యువ తార కొకొ గాఫ్.. సొంతగడ్డపై మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. యూఎస్ ఓపెన్‌లో మూడో సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్ మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. క్రొయేషియాకు చెందిన వెకిక్‌తో జరిగిన రెండో రౌండ్ పోరులో గాఫ్ 7-6 (5), 6-2తో విజయం సాధించింది. వెకిక్‌తో మ్యాచ్ మధ్యలో, మ్యాచ్ ముగిశాక గాఫ్ తీవ్ర భావోద్వేగానికిగురై కంటతడి పెట్టుకుంది. తొలి సెట్ ముగింపు దశలో వరుసగా రెండుసార్లు డబుల్ ఫాల్ట్ చేసి సర్వీస్ చేజార్చుకున్న క్రమంలో టవల్ అడ్డం పెట్టుకొని ఏడ్చిన గాఫ్.. మ్యాచ్ ముగిశాక స్టాండ్స్‌లో అమెరికా జిమ్నాస్టిక్స్ స్టార్ సిమోన్ బైల్స్ గురించి మాట్లాడుతూ కన్నీటి పర్యంతమైంది. 'ఎంతో ఒత్తిడిలోనూ ఆరు అంగుళాల బీమ్‌పై సిమోన్ అద్భుతమైన విన్యాసాలు చేస్తూ అందరినీ అబ్బురపరుస్తుంది. ఆమెలాగే జీవితంలో నేను కూడా మంచి, చెడు చూశా. అందుకే కోర్టులో రాకెట్ పట్టుకున్నప్పుడల్లా సిమోన్ స్ఫూర్తితో ముందుకెళుతుంటా' అని గాఫ్ వ్యాఖ్యానించింది. 8వ సీడ్ అనిసిమోవా 7-6 (2), 6-2తో మయాపై, 15వ సీడ్ కసత్కినా 6-2, 4-6, 7-5తో రఖిమోవాపై, రెండుసార్లు విజేత ఒసాక 6-3, 6-1తో హీలీపై గెలిచి మూడోరౌండ్‌కు చేరారు.

టామీ పాల్ పోరు.. నాలుగున్నర గంటలు: పురుషుల సింగిల్స్‌లో 14వ సీడ్ టామీ పాల్ తన ప్రత్యర్థిని ఓడించేందుకు నాలుగున్నర గంటల పాటు పోరాడాడు. ఐదు సెట్లపాటు సాగిన ఈ పోరులో పాల్ 7-6(6), 6-3, 5-7, 5-7, 7-5తో నూనో బోర్గెస్‌ను ఓడించి మూడో రౌండ్ చేరాడు. మరో రెండోరౌండ్ పోరులో యానిక్ సినర్ 6-3, 6-2, 6-2తో అలెక్సీ పాప్రిన్‌ను ఓడించాడు. మూడో సీడ్ జ్వెరెవ్ 6-4, 6-4, 6-4తో ఫెర్న్‌లీపై నెగ్గగా.. సిట్సిపాస్ రెండో రౌండ్లోనే ఇంటిబాట పట్టాడు.

రదుకాను ఇంటికి..

బ్రిటన్ బ్యూటీ ఎమ్మా రదుకానుకు యూఎస్ ఓపెన్‌లో చుక్కెదురైంది. 2021లో ఇక్కడ టైటిల్ నెగ్గి అందరినీ ఆకర్షించిన రదుకాను పోరాటం ఈసారి మూడో రౌండ్‌కే పరిమితమైంది. వింబుల్డన్ మాజీ చాంపియన్, 9వ సీడ్ ఎలెనా రిబకినా 6-1, 6-2తో రదుకానును చిత్తుచేసి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

వీనస్ 11 ఏళ్ల తర్వాత..

వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ సింగిల్స్ తొలిరౌండ్లోనే నిష్క్రమించినా.. డబుల్స్‌లో మాత్రం శుభారంభం చేసింది. వీనస్/లైలా ఫెర్నాండెజ్ జోడీ 7-6(4), 6-3తో ఆరో సీడ్ లుడ్మిలా/ఎలెన్ పెరెజ్‌ను ఓడించింది. 45 ఏళ్ల వీనస్ యూఎస్ ఓపెన్‌లో డబుల్స్ మ్యాచ్ గెలవడం 2014 తర్వాత ఇదే మొదటిసారి.

హర్మన్ హ్యాట్రిక్

చైనాపై భారత్ గెలుపు
ఆసియా కప్ హాకీ



రాజ్‌గిర్ (బిహార్) : కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్‌తో మెరిసిన వేళ ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత్ బోణీ చేసింది. శుక్రవారం జరిగిన పూల్ 'ఏ' మ్యాచ్‌లో మనోళ్లు 4-3తో చైనాపై విజయం సాధించారు. ర్యాంకుల్లో మనకంటే ఎంతో తక్కువ స్థానంలో ఉన్న చైనాపై గెలిచేందుకు భారత్ చెమటోడ్చాల్సి రావడం గమనార్హం. హర్మన్ (20, 33, 47 ని.) మూడు గోల్స్ చేయగా..మరో గోల్‌ను జుగ్‌రాజ్ సింగ్ (18) కొట్టాడు. షిహావో (12), బెన్‌హల్ చెన్ (35), జీషెంగ్ (41) చైనాకు గోల్స్ అందించారు. పూల్ 'ఏ' ప్రారంభ మ్యాచ్‌లో జపాన్ 7-0తో కజకిస్థాన్‌ను చిత్తు చేసింది. భారత్-చైనా మ్యాచ్‌కు హాజరైన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. ఇక..ఆదివారం జరిగే తదుపరి మ్యాచ్‌లో జపాన్‌ను భారత్ ఢీకొంటుంది.

4 బంతుల్లో 4 వికెట్లు

పేసర్ అకీబ్ నబీ సంచలనం
దులీప్ ట్రోఫీ

బెంగళూరు: నార్త్ జోన్ పేసర్ అకీబ్ నబీ దార్ చరిత్ర సృష్టించాడు. దులీప్ ట్రోఫీలో తొలిసారిగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతడు హ్యాట్రిక్ కూడా నమోదు చేయడంతో.. కపిల్ దేవ్, సాయిరాజ్ బహుతులే తర్వాత ఈ ఫీట్ సాధించిన మూడో బౌలర్ అయ్యాడు. ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న తొలి క్వార్టర్స్‌లో శుక్రవారం రెండో రోజు అకీబ్ 53వ ఓవర్‌లో చివరి మూడు బంతులకు హ్యాట్రిక్ పూర్తి చేసి 55వ ఓవర్ తొలి బంతికే నాలుగో వికెట్ తీశాడు. మొత్తంగా అతడి ధాటికి (3.1-0-5-5) 8 పరుగుల తేడాతో చివరి 5 వికెట్లు కోల్పోయిన ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 230 రన్స్‌కు ఆలౌటైంది. నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 405 పరుగులు చేయగా.. స్పిన్నర్ మనిశికి ఆరు వికెట్లు దక్కాయి. మరోవైపు రెండో క్వార్టర్స్‌లో డానిష్ మలేవర్ (203 రిటైర్డ్ అవుట్) డబుల్ సెంచరీతో సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 532/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి నార్త్ ఈస్ట్‌జోన్ 168/7 స్కోరుతో కష్టాల్లో పడింది.

నీటిపారుదలలో ముగిసిన పదోన్నతులు

- 33 ఏళ్ల తర్వాత డీపీసీ ద్వారా ప్రక్రియ
- మంత్రి ఉత్తమ్ చొరవతో వీడిన 'సీనియారిటీ' వివాదం

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల శాఖలో 33 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత.. శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) ద్వారా చేపట్టిన పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా (ఏఈఈ) ఉన్న 91 మందికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈ)గా, డీఈఈలుగా ఉన్న 91 మందికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఈఈ)గా పదోన్నతికి డీపీసీ ఆమోదం తెలిపింది. చీఫ్ ఇంజనీర్(ఎంక్వయిరీస్)గా పనిచేస్తున్న మహ్మద్ అంజద్ హుస్సేన్‌కు రెగ్యులర్ ఈఎన్‌సీ(జనరల్)గా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో నీటిపారుదలశాఖలో ప్రతీ దశలో పదోన్నతుల ప్రక్రియ పూర్తయినట్లైయింది. కాగా, గత మూడు దశాబ్దాల కాలంలో డీపీసీ లేకుండా, నిబంధనలు సవరించి తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు ఇస్తూ వచ్చారు. ఈసారి మాత్రం డీపీసీని ఏర్పాటు చేసి ఆ ప్రక్రియ పూర్తి చేశారు. నీటిపారుదలశాఖలో మూడు దశాబ్దాలుగా డీపీసీ లేకపోవటానికి సీనియారిటీ వివాదమే కారణమని తేలటంతో ఈ అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ చూపారు. జనవరి 10వ తేదీన ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు వెలువడింది. దాంతో వెనువెంటనే అన్ని స్థాయిల్లో పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. కాళేశ్వరం కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేయడంతో.. ఆ జాబితాలో ఉన్నవారందరికీ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిని పదోన్నతుల ప్రక్రియ నుంచి తప్పించి.. మిగిలిన వారికి ప్రమోషన్లు ఇచ్చారు.

333.27 కోట్లతో ఎస్ఎల్‌బీసీ కెనాల్‌కు లైనింగ్

ఏఎమ్మార్ ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) ప్రాజెక్టులో హైలెవల్ కెనాల్‌కు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.333.27 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడానికి వీలుగా శుక్రవారం టెండర్లు పిలిచింది. హైలెవల్ కెనాల్‌కు 23.5 కి.మీ. నుంచి 136.15 కి.మీ. వరకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయనున్నారు. ఈ నిర్ణయానికి మంత్రివర్గం ఇటీవలే ఆమోదం తెలపడంతో అధికారులు టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు.

ఈసీఐఎల్‌కు స్కోప్ ఎమినెన్స్ అవార్డు


రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ఈసీఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్,

కుషాయిగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఈసీఐఎల్ సంస్థ ప్రతిష్ఠాత్మక స్కోప్ ఎమినెన్స్ అవార్డును దక్కించుకుంది. 2022-23 సంవత్సరానికి ఇన్‌స్టిట్యూషనల్ ఎక్సలెన్స్ కేటగిరీలో ఈ అవార్డు లభించింది. శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ అనీష్ కుమార్ శర్మ అందుకున్నారు. ఈ అవార్డు ద్వారా సాంకేతిక పురోగతిలో తమ అగ్రగామి స్థాయి మరింత బలోపేతమైందని, బహుళ కీలక రంగాల్లో వ్యూహాత్మక ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఆవిష్కరణలకు ఇది మరింత చేయూతనిస్తుందని సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. కార్పొరేట్ పాలన, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలో అత్యుత్తమ పనితీరును ప్రదర్శించే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు స్కోప్ ఎమినెన్స్ అవార్డు ఇస్తారు.

6 వేల కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి రూ.6 వేల కోట్ల అప్పు తీసుకోబోతోంది. ఈ మేరకు శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) కు ఇండెంట్ పెట్టింది. 26 ఏళ్ల కాలపరిమితితో రూ.1,500 కోట్లు, 30 ఏళ్ల కాలపరిమితితో రూ.1,500 కోట్లు, 32 ఏళ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్లు, 38 ఏళ్ల కాలపరిమితితో రూ.1,500 కోట్ల చొప్పున ఈ రుణాన్ని తీసుకోనుంది. సెప్టెంబర్ 2న ఆర్బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా రుణాన్ని సేకరించనుంది.

టీటీసీ కోర్సు ఫలితాలు విడుదల

ప్రభుత్వ పరీక్షల విభాగం ఇటీవలే నిర్వహించిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సు (లోయర్ గ్రేడ్) పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. 3,173 మంది పరీక్ష రాయగా 3,131 మంది ఉత్తీర్ణులైనట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ తెలిపారు. ఈ ఏడాది 98.65 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాల కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

తెలంగాణ ట్రైబల్ డిజైన్ ప్లాన్లతో మేడారం శాశ్వత అభివృద్ధి పనులు: సీతక్క

ములుగు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ట్రైబల్ డిజైన్ ప్లాన్లతో మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులకు రూపకల్పన చేసినట్లు మంత్రి దనసరి సీతక్క తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని ఐటీడీఏ అతిథిగృహంలో మంత్రి సీతక్క జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. మేడారంలో అభివృద్ధి పనులను త్వరిత గతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. జాతరలోపు మొదటి విడుత పనులు పూర్తి చేయాలన్నారు. వివిధ పనులు, నిర్మాణాలు చేపట్టేందుకు త్వరితగతిన టెండర్లు పూర్తి చేయాలని చెప్పారు.

10 అడుగుల ఎత్తుతో 'తెలంగాణ తల్లి'

- ఒక్కో విగ్రహానికి 17.5 లక్షల ఖర్చు.. టెండర్లు పిలిచిన సర్కారు

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టరేట్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన తెలంగాణ తల్లి విగ్రహాల ఎత్తు, ధర ఖరారయ్యాయి. ఈ విగ్రహాల తయారీకి ఆర్అండ్‌బీ టెండర్లను ఆహ్వానించింది. సచివాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం నమూనాలోనే అన్ని జిల్లాల కలెక్టరేట్లలోనూ విగ్రహాలను పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టరేట్లలో ఏర్పాటు చేసే తెలంగాణ తల్లి విగ్రహాల ఎత్తును 10 అడుగులుగా ఖరారు చేశారు. అలాగే బేస్‌మెంట్ 4 అడుగులు, విగ్రహం కింద ఉండే ఉక్కు పిడికిళ్ల పీఠం 2 అడుగులు ఉండనుంది. ఇవన్నీ కలిపి మొత్తం 16 అడుగుల ఎత్తులో విగ్రహం ఉంటుంది. ఒక్కో విగ్రహ ఏర్పాటుకు రూ.17.5 లక్షల వరకు ఖర్చు కానుంది. అంటే 33 జిల్లాలకు కలిపి రూ.5.77 కోట్లు ఖర్చవనుంది. డిసెంబరు 9న ఈ విగ్రహాలను ఆవిష్కరించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది.

సవాళ్లను అధిగమించి సహాయక చర్యలు

- 1,646 మంది బాధితులు సురక్షిత ప్రాంతాలకు..
- అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాల వల్ల వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సవాళ్లను అధిగమించి సహాయక చర్యలు చేపట్టామని అగ్నిమాపక శాఖ డీజీ వై. నాగిరెడ్డి తెలిపారు. కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, నిర్మల్, సిరిసిల్లా, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా రహదారులు, వంతెనలు దెబ్బతిని అనేక ప్రాంతాలకు అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడంలో తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇలా విపత్కర పరిస్థితులు ఎదురైనా సిబ్బంది బాధితులకు సహాయం అందించారన్నారు. మొత్తం 1,646 మంది బాధితుల్ని రక్షించామని పేర్కొన్నారు. కామారెడ్డిలో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో సహా వరద నీటిలో కొట్టుకుపోయినా వారికి ఉన్న నైపుణ్యంతో సురక్షితంగా బయటకు రాగలిగారన్నారు. అయితే కామారెడ్డిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో చిక్కుకున్న వ్యక్తిని రక్షించడంలో అగ్నిమాపక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని సోషల్ మీడియాలో కొందరు అవాస్తవ ప్రచారం చేయడం సరైంది కాదని నాగిరెడ్డి స్పష్టం చేశారు. అగ్నిమాపక శాఖపై తప్పుడు ప్రచారాన్ని ఆ శాఖ అధికారుల సంఘం కూడా తీవ్రంగా ఖండించింది.

బడుల్లో ముఖ గుర్తింపు హాజరు!



(మొదటిపేజీ తరువాయి)

విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు బాగా పెంచాలని పిలుపునిచ్చారు. అదనపు గదులు, వంట గదులు, మూత్ర శాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వేర్వేరు విభాగాలు చేపట్టడం సరికాదని, నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి వీలుగా ఒకే విభాగం కిందకు తేవాలని ఆదేశించారు. 'యంగ్ ఇండియా' సమగ్ర గురుకుల పాఠశాలల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ(ఈడబ్ల్యూఐడీసీ) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి తావు లేకుండా గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని, చెల్లింపుల్లో ఎలాంటి అలసత్వం చూపొద్దని కోరారు. మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం వంటకాల కోసం కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని, వాటిపైన సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ద్వారా అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవసరమైతే కాంట్రాక్ట్ ప్రాతిపదికన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. బాలికల గురుకుల పాఠశాలల్లో మహిళా కౌన్సెలర్లను నియమించాలని సూచించారు. యంగ్ ఇండియా పాఠశాలలతో పాటు విద్యారంగం అభివృద్ధికి తీసుకునే రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారని సీఎం వెల్లడించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీలేనని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలతో నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

నేటి నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)


సమావేశాల భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

కేంద్రానికి పంపారు. బీసీలకు ప్రస్తుతం 23 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచి, స్థానిక ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 69 శాతం మేరకు అమలు చేస్తూ సవరణ బిల్లును అసెంబ్లీలో చర్చకు పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని పార్టీలూ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో శాసన సభలో ఆమోదం లభిస్తుందని, వెంటనే బిల్లు ఆధారంగా ఉత్తర్వులు జారీ చేసి ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై ఏర్పాటైన మంత్రుల కమిటీ.. రాజ్యాంగ, న్యాయ నిపుణులను సంప్రదించినప్పుడు చట్ట పరంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తే ఇదే మెరుగైన ప్రత్యామ్నాయమని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడినట్లు చెబుతున్నారు. మరంరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లులపై రాష్ట్రపతి 90 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై సుప్రీంకోర్టు తుది తీర్పు కోసం వేచి చూడడం, పార్టీల పరంగా 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి ఎన్నికలకు వెళ్లడం అన్న ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. చట్ట సవరణతో జీవో ఇవ్వడం ద్వారా ముందుకు వెళ్లాలని భావిస్తే.. ఉత్తర్వులు వెలువడిన పది రోజుల్లో పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల కమిషన్‌కు సమర్పించనుందని, ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని, మొత్తం 40 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని అంటున్నాయి. అయితే, ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం, ఎవరైనా కోర్టుకు వెళ్లే అవకాశం ఉండడం గండాలని పేర్కొంటున్నాయి.

వాడీవేడిగా సమావేశాలు

బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరంపై కమిషన్ విచారణ నివేదికలపై అసెంబ్లీలో చర్చ జరిగే అవకాశం ఉన్నందున.. ఈ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. కేసీఆర్ కేంద్రీకృతంగానే పీసీ ఘోష్ కమిటీ నివేదిక ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన సమాధానం ఇచ్చేందుకు సమావేశాలకు వస్తారా? లేక డుమ్మా కొడతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు కమిషన్ నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డి లేదా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల్లో ఎవరో ఒకరు సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇక బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో శాసనసభ వేదికగా బీజేపీని దోషిగా నిలబెట్టేందుకు కాంగ్రెస్ సర్కారు సమాయత్తమవుతోంది. అలాగే రాష్ట్రంలో వరద పరిస్థితులు, యూరియా కొరతపైనా చర్చకు ప్రతిపక్షాలు పట్టుపట్టే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాల నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పోలీసు శాఖ, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. గతంలో మాదిరిగానే ఈ సమావేశాలకు కూడా అధికారులు సంపూర్ణంగా సహకరించాలని స్పీకర్ కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని త్వరగా అందించాలన్నారు. సమావేశాలు సజావుగా జరిగేలా పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శాసనమండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నోడల్, లైజనింగ్ అధికారులను నియమించాలని కోరారు.

బీఆర్ఎస్‌లో వణుకు మొదలైంది..

కాళేశ్వరంపై చర్చతో బండారం బయటపడుతుంది: ఆది శ్రీనివాస్

కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ నివేదికపై అసెంబ్లీలో చర్చ అనగానే బీఆర్ఎస్‌లో వణుకు మొదలైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అందుకే అసెంబ్లీలో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అనుమతివ్వాలంటూ ఆ పార్టీ అడుగుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అనుమతివ్వాలంటూ అప్పటి సీఎల్పీ కోరితే పట్టించుకోలేదని గుర్తు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడంతో తెలంగాణ ప్రతిష్ఠ గంగలో కలిసిపోయిందని శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ జరిగితే తమ బండారం బయటపడుతుందనే భయంలో బీఆర్ఎస్ నాయకత్వంలో ఉందన్నారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తుందని, ఆ సమావేశాల్లో బీఆర్ఎస్ నేతలు అన్ని విషయాలూ చెప్పుకోవచ్చని అన్నారు.


మొదటి అంతస్తులో కొనసాగుతున్న కొత్త ఫ్లోర్ పనులు

శాసనసభ, మండలి.. ఈ సారికి వేర్వేరుగానే..!

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ, మండలి సమావేశాలను ఒకే ప్రాంగణంలో పక్కపక్కనే నిర్వహించేందుకు మరికొంత సమయం పట్టనుంది. మండలి పునరుద్ధరణ పనులు ఇంకా పూర్తికాలేదు. బయటివైపు డోమ్‌ల దగ్గరి నుంచి లోపల స్పీకర్ కుర్చీ, సభ్యుల కుర్చీల వరకు పనులు ఇప్పుడిప్పుడే కొలిక్కి వస్తున్నాయి. మరమ్మతులు పూర్తయి, భవనం అందుబాటులోకి వచ్చేందుకు 4-5 నెలల సమయం పడుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఇదీ విషయం..

అసెంబ్లీ భవనాన్ని గతంలో పబ్లిక్‌హాలు/టౌన్‌హాలు అని పిలిచేవారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ భవనాన్ని శాసనసభ, మండలి సమావేశాల నిర్వహణకు వినియోగించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక శాసనసభ సమావేశాలను ఇందులోనే కొనసాగించగా.. మండలి సమావేశాలను జూబ్లీహాల్‌లో నిర్వహిస్తున్నారు. సీఎం, మంత్రులు ప్రత్యేకంగా అక్కడికి కార్లలో వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ హాలులోనే ఉన్న పాత భవనానికి మరమ్మతులు చేసి మండలి సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరమ్మతులు ఫిబ్రవరి 3 నాటికే పూర్తవ్వాల్సి ఉండగా.. కొనసాగుతూనే ఉన్నాయి.

రేపు కేరళకు సీఎం రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం కేరళ రాష్ట్రానికి వెళ్లనున్నారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంకా గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో జరగనున్న ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వెళ్తున్నారు.

అసెంబ్లీకి ఈసారీ.. కేసీఆర్ డుమ్మా!

మరోసారి గైర్హాజరు కానున్న ప్రతిపక్ష నేత

బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహంపై.. కేటీఆర్, హరీశ్‌లకు అధినేత దిశానిర్దేశం

కాళేశ్వరంపై ఆరోపణలను తిప్పికొట్టండి

వరదలు, యూరియాపై ప్రశ్నించండి

ప్రజా సమస్యలపై నిలదీయండి: కేసీఆర్



హైదరాబాద్/గజ్వేల్/మర్కుక్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి కూడా అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రకారం.. ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ అధికార కాంగ్రెస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో.. అసెంబ్లీలో ఈ అంశంపై జరిగే చర్చకు హాజరు కాకూడదని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఆయన శాసనసభకు హాజరైతే.. కాళేశ్వరం నివేదికలోని అంశాల ఆధారంగా ప్రభుత్వం అడిగే ప్రశ్నలకు ఆయన ఏం సమాధానం చెబుతారు? సభలో ఏం మాట్లాడతారన్న దానిపై రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. అయితే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ముఖ్యనేతలు శుక్రవారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై వారికి కేసీఆర్ సూచనలు చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదికలోని ఏయే అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం చర్చకు పెడుతుంది, వాటికి సభలో ఏం సమాధానం చెప్పాలి, ప్రజలకు ఎలా వివరించాలన్న దానిపై దిశానిర్దేశం చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ ప్రధాన ఎజెండాగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో.. కాళేశ్వరం విషయంలో నిజానిజాలను అసెంబ్లీ వేదికగా బహిర్గతం చేద్దామని కేసీఆర్ అన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చేస్తున్న అసత్యాలను ప్రజలకు తెలియబరచాలని, వాస్తవాలను వివరించాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటికే పలుమార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాళేశ్వరంపై ప్రజలకు వాస్తవాలు చెప్పారని, అదే రీతిలో అసెంబ్లీలోనూ కాళేశ్వరం ద్వారా ప్రజలకు జరిగే లబ్ధి తెలిసేలా చూడాలని అన్నట్లు తెలిసింది. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై సభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కోరారు. అయితే ఇందుకు స్పీకర్ అనుమతిస్తారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది. ఇక అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని, రాష్ట్రంలో యూరియా కొరత, వరదల అంశం, సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యం అంశంపై ప్రశ్నించాలని పార్టీ నేతలకు కేసీఆర్ సూచించినట్లు తెలిసింది.

రాబడికి భద్రతేది?

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, ఎన్నో ఆకాంక్షలు ఉన్నాయని, నిధులు అవసరమని తెలిపారు. సరైన పన్ను విధింపు.. రాష్ట్ర అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించడం తెలిసిందే. ఈ మేరకు జీఎస్టీని ప్రస్తుతం విధిస్తున్న 5, 12, 18, 28 శాతం స్లాబ్‌లలో కాకుండా.. రెండు స్లాబ్‌లలో 5 నుంచి 18 శాతం మధ్య నిర్ణయించాలని, అతివిలాస, హానికర వస్తువులపై మాత్రమే 40 శాతం జీఎస్టీ విధించాలని కేంద్రం సూచించింది. దీంతో ఎనిమిది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌ల ఆర్థిక మంత్రులు శుక్రవారం ఢిల్లీలో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రాలకు తగ్గే ఆదాయానికి పరిహారం చెల్లిస్తామంటూ జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో జీఎస్టీ ద్వారా ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేశారని, కానీ.. ఆశించినంతగా ఏమీ జరగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్థిక స్వేచ్ఛతో వ్యాట్‌ను కొనసాగించి ఉంటే 2024-25కు ఆదాయం రూ.69,373 కోట్లు ఉండేదని, కానీ.. జీఎస్టీ ద్వారా ఆదాయం రూ.42,443 కోట్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. రాష్ట్ర సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వసూళ్లు 39 శాతమేనని, అందువల్ల జీఎస్టీ రేట్లలో ఏమైనా తగ్గింపులు ఉంటే.. కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెప్పారు. తెలంగాణ జీఎస్టీ, జీఎస్‌డీపీ నిష్పత్తి 2022- 23లో 3.07 శాతం నుంచి 2024 - 25లో 2.58 శాతానికి క్రమంగా తగ్గుతోందని, రేటు హేతుబద్ధీకరణ దీనిని మరింత తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణకు తెలంగాణ మద్దతు ఇస్తుందని, కానీ రెండు తీవ్రమైన సమస్యలను పరిష్కరించాలని భట్టి డిమాండ్ చేశారు. మొదటిది.. రాష్ట్రాల ఆదాయాలను రక్షించాలని, రాష్ట్రాలు సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్యక్రమాలను కొనసాగించేలా తగిన పరిహార విధానాన్ని రూపొందించాలని అన్నారు. రెండోది.. పన్ను తగ్గింపు లేదా మినహాయింపు నిజంగా సమాజంలోని పేద, మధ్యతరగతి వర్గాల సమూహాలకు చేరేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబరు 3న మరోసారి సమావేశమై కీలక అంశాలపై చర్చించి.. కేంద్రానికి నివేదిస్తామని తెలిపారు. కేంద్ర నిర్ణయంతో చాలా రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, అందులో.. ఎన్డీయే పాలిత రాష్ట్రాలూ ఉన్నాయని గుర్తు చేశారు. అందుకే, జీఎస్టీ హేతుబద్ధీకరణ అంశంపై కేంద్రం మరింత లోతుగా ఆలోచించాలని కోరారు. కాగా, తెలంగాణలో వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారని తెలిపారు. వీలైనంత త్వరగా నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించి ఆర్థిక సాయం కోరతామన్నారు.



రాష్ట్రాల ఆదాయానికి రూ.2 లక్షల కోట్ల నష్టం..

జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ వల్ల రాష్ట్రాల ఆదాయానికి రూ.1.5 లక్షల కోట్లనుంచి రూ.2 లక్షల కోట్ల మేరకు గండి పడుతుందని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తెలిపాయి. తమకు ఈ నష్టాన్ని ఎలా చెల్లిస్తారో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని సవాల్ చేశాయి. కొత్త జీఎస్టీ వల్ల రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోవడం మాత్రమే కాకుండా.. ఆదాయం బాగా తగ్గిపోయి రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కూడా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశాయి. విలాస వస్తువుల మీద అదనపు లెవీపై వచ్చే వసూళ్ల ఆధారంగా కేంద్రం రుణాలను సేకరించి తమకు చెల్లించాలని ఆర్థిక మంత్రుల సమావేశంలో డిమాండ్ చేశాయి. సెప్టెంబరు 3, 4 తేదీల్లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తాలని, నష్టపరిహారం చెల్లించేందుకు ఒక యంత్రాంగం ఏర్పాటు కోసం డిమాండ్ చేయాలని నిర్ణయించాయి. విలాస వస్తువులపై 40 శాతానికి పైగా అదనపు సుంకాన్ని విధించి.. ఆ ఆదాయాన్ని రాష్ట్రాలతో పంచుకోవాలని కేంద్రానికి సూచించాయి. కాగా, జీఎస్టీ రేట్ల హేబద్ధీకరణ వల్ల 15 నుంచి 20 శాతం ఆదాయాన్ని కోల్పోతుందని, దీనివల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి పూర్తిగా కుదేలవుతుందని కర్ణాటక ఆర్థిక మంత్రి బైరెగౌడ అన్నారు. రాష్ట్రాల ఆదాయాలు కుదుటపడే వరకు ఐదేళ్లపాటు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో భట్టివిక్రమార్క, కృష్ణ బేరెగౌడతోపాటు పంజాబ్, కేరళ, జార్ఖండ్, తమిళనాడు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు.

చికిత్స మధ్యలో డిశ్చార్జి చేసే ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు

- అధికారులకు వైద్య మంత్రి దామోదర ఆదేశాలు



హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చికిత్స మధ్యలో రోగులను డిశ్చార్జి చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శాఖ అధికారులను ఆదేశించారు. అత్యవసర చికిత్స కోసం నేరుగా నిమ్స్‌కు వచ్చే రోగులను, ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి రిఫరల్‌పై వచ్చే వారికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిమ్స్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి దామోదర సమీక్ష సమావేశం నిర్వహించారు. నిమ్స్‌లో ఈ ఏడాది తొలి ఏడు నెల్లలో (జనవరి నుంచి జూలై) 5 లక్షల 44 వేల మందికి వైద్య సేవలు అందించామని బీరప్ప తెలిపారు. ఇందులో సగానికిపైగా ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ వంటి ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందారని వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కూడా చేశామని వెల్లడించారు. ప్రస్తుతం నిమ్స్ ఎమర్జెన్సీ వార్డుకు రోజుకు 80 నుంచి వంద మంది రోగులు వస్తున్నారని తెలిపారు. ఇందులో సగం మందికిపైగా రోగులు ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది, పరిస్థితి విషమించాక చివరి నిమిషంలో నిమ్స్‌కు వస్తున్నారని వెల్లడించారు. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేసిన తర్వాత రోగులు పూర్తిగా కోలుకోకముందే వారిని డిశ్చార్జి చేసి, నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పంపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యసేవలందిస్తున్న నిమ్స్ డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందిని మంత్రి అభినందించారు. చికిత్స మధ్యలో రోగులను పంపే ప్రైవేటు ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘోష్ కమిషన్ నివేదికపై సభలో చర్చిస్తాం: పొన్నం



కరీంనగర్ అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్లక్ష్యం చూపడంతో తప్పిదాలు జరిగాయని ఘోష్ కమిషన్ తన నివేదికలో స్పష్టంగా పేర్కొందని, నివేదికపై శాసనసభలో చర్చిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఘోష్ కమిషన్ నివేదికపై సభలో బీఆర్ఎస్ నాయకులు తమ వాదనలు వినిపించాలన్నారు. కాళేశ్వరంపై కోర్టుకు వెళ్లి అరెస్టు కాకుండా అడ్డుకోవడం, ఇతర ప్రయత్నాలు జరుగుతున్నాయంటే వారు ఎటువంటి ఆందోళనకర పరిస్థితుల్లో ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకులను తప్పించేందుకే బీజేపీ సీబీఐ విచారణ కోరుతోందని ఆయన ఆరోపించారు.


కామారెడ్డి జిల్లాలో వరి పొలాల్లోకి కొట్టుకువచ్చిన రాళ్లు,రప్పలు


భారీ వర్షాలకు నిర్మల్ జిల్లాలో నీట మునిగిన వరి పంట

వరుణుడి విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

తెగ్గోసి పోటెత్తిన రాకాసి వరదకు కొన్నిచోట్ల ఇసుక దిబ్బలుగా, రాళ్లకుప్పలుగా మారిన పొలాలు, చేలు.. ఇంకొన్ని చోట్ల నీట మునిగిన వరి, కుళ్లిపోతున్న పత్తి మొక్కలు.. వరద ముంపుతో, తెగిన రోడ్లు, వంతెనలతో బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న మారుమూల గ్రామాల ప్రజలు.. ప్రధాన రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతినడంతో స్తంభించిన రవాణా.. ఇలా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం, పోటెత్తిన రాకాసి వరద మిగిల్చిన నష్టం కనీవినీ ఎరుగనిది!! వరుణుడి విధ్వంసంతో అల్లకల్లోలంగా మారిన కామారెడ్డి జిల్లాలో పరిస్థితి అయితే మరీ దయనీయం. గురువారం వరదకు కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీల్లో ఇళ్లు మునిగిన సంగతి తెలిసిందే. నివాసాల్లో బురద, చెత్తాచెదారం పేరుకుపోవడంతో లోపల అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, వాషింగ్‌మెషిన్లు పనికిరాకుండాపోయాయి. ఫర్నిచర్ తీవ్రంగా దెబ్బతింది. బియ్యం, పప్పులు తదితర వంట దినుసులు తడిసిపోయాయి. ఇంటి తలుపులు తీస్తే పాములు కనిపిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ కాలనీల్లోని ప్రజలను ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించగా 80 శాతం మంది తిరిగి ఇళ్లకు వెళ్లి శుభ్రం చేసుకుంటున్నారు. ఫైర్ ఇంజన్ సిబ్బంది వారికి సహాయపడుతున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం మంచినీటి వసతి కల్పిస్తోంది. విద్యుత్తు సరఫరా లేక కామారెడ్డిలోని జీఆర్ కాలనీతో పాటు సమీప గ్రామాల్లో అంధకారం నెలకొంది. కామారెడ్డి శివార్లోని నిజామాబాద్-హైదరాబాద్ రూట్లోని జాతీయ రహదారిపై టెక్రియాల్, క్యాసంపల్లి వంతెనలు కుంగిపోయాయి. ఫలితంగా ఆ రూట్లో వాహనాలను వన్‌వే ద్వారా అనుమతిస్తున్నారు. ఫలితంగా 10 కి.మీ మేర వాహనాలు నిలిపోయాయి. ఆదిలాబాద్ నుంచి వచ్చే వాహనాలను ఆర్మూర్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లిస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను రామాయంపేట వద్ద దారిమళ్లిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని గోదావరి నది బ్యాక్‌వాటర్ కారణంగా హంగర్గ, ఖాజాపూర్, హున్సా, మందర్న మునిగిపోయాయి. ఫలితంగా ఈ గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.. అక్కడ 1229 మందికి ఆశ్రయం కల్పించారు.

దెబ్బతిన్న రోడ్ల వివరాలు

కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో భారీ వరదలకు 58 చోట్ల జాతీయ, రాష్ట్రీయ, గ్రామీణ రహదారులు ధ్వంసమయ్యాయి. ఆర్‌అండ్‌బీకి చెందిన రోడ్లు 34 చోట్ల, పంచాయతీరాజ్ శాఖకు చెందిన రోడ్లు 24 చోట్ల కొట్టుకుపోయాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీకి చెందిన 22 రోడ్లు.. 45 కి.మీ మేర దెబ్బతిన్నాయి. అలాగే 6 కల్వర్టులు, 4 వంతెనలు తెగిపోయాయి. పంచాయతీరాజ్ శాఖకు చెందిన 33 రోడ్లు 35 కి.మీ మేర పాడయ్యాయి. 9కల్వర్టులు తెగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 92 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. 264 విద్యుత్తు స్తంభాలు పడిపోయాయి.

మూసీ ప్రవాహంలో కొట్టుకుపోయి

కామారెడ్డి జిల్లా దోమకొండలో 27న గల్లంతైన బాలరాజ్ అనే వ్యక్తి పంటపొలాల మధ్య మృతదేహంగా లభ్యమయ్యాడు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల వద్ద మానేరు వాగులో బుధవారం గల్లంతైన పంపుకాడి నాగయ్య ఆచూకీ కోసం ఐదు బృందాలు గాలింపు చర్యల్లో ఉన్నాయి. యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురంలో మునికుంట్ల మత్స్య అనే 25 ఏళ్ల యువకుడు శుక్రవారం రాత్రి మూసీ వరదలో కొట్టుకుపోయి.. మధ్యలో ఓ చెట్టును పట్టుకున్నాడు. అతడిని రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. అర్ధరాత్రి వరకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భద్రాచలం వద్ద గోదాదరి ప్రవాహ తీవ్రత పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 7:20 గంటలకు 43 అడుగుల ఎత్తులో నది ప్రవహించింది. స్నాన ఘట్టాలు పూర్తిగా మునిపోయాయి. మంజీరా నదికి ఎగువ నుంచి భారీగా వరద పోటెత్తుతోంది. సింగూరు ప్రాజెక్టు నుంచి 6 గేట్ల ద్వారా 61,460 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మేడిగడ్డ బ్యారేజీలోకి 9.89 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. 85 గేట్ల ద్వారా అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 41 గేట్ల ద్వారా 7.45 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కృష్ణా పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి 26 గేట్ల ద్వారా 2.43 లక్షల క్యూసెక్కుల నీరు వెళుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులోకి 2.43 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది.


44వ జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

భారీ వరదలతో పలు రైళ్ల రద్దు

తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా పలు రైళ్ల రాకపోకలకు అంతరాయ ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై వరద నీరు ప్రవహిస్తుండడంతో పలు రైళ్లను మరో రెండు రోజుల పాటు రద్దు చేశామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మరికొన్నింటిని దారి మళ్లించామన్నారు. భిక్నూర్-తలమడ్ల, అక్కన్నపేట్-మెదక్, గజ్వేల్-లకుడారం, బోల్సాకర్తేలి రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌లపై వరద నీరు పొంగి ప్రవహిస్తున్నందున ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు కాచిగూడ (9063318082), నిజామాబాద్ (9703296714), కామారెడ్డి (9281035664), సికింద్రాబాద్ (040-277 86170) స్టేషన్‌లలో హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.



బాసర ఆలయ సమీపంలోకి వరద

గోదావరి ఉధృతితో బాసరలో పరిస్థితి భయానకంగా మారింది. ఆలయ సమీపంలోకి వరద నీరు చేరింది. సమీపంలోని నివాసాలు, హోటళ్లు మునిగిపోయాయి. ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారులపై మూడు నుంచి ఎనిమిది అడుగుల వరకు నీరు నిలవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి శాంతించాలంటూ ఆలయ అర్చకులు శుక్రవారం పూజలు చేశారు. రైల్వే వంతెనపై వరద ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తుండటంతో బాసర మీదుగా వెళ్లే అన్ని రైళ్లను రద్దు చేశారు. 1983 తర్వాత బాసరలో ఇంతపెద్ద స్థాయిలో వరద రావడం ఇదే మొదటిసారి అని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. ములుగు జిల్లా టేకులగూడెం వద్ద రేకుమాగు వాగు ప్రవాహం పెరగడంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాజేడు, గుమ్మడిదొడ్డి, పేరూరు, చంద్రుపట్ల, బొమ్మనపల్లి, కోయవీరాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సిద్దిపేట పట్టణంలో కోమటిచెరువు కాలువ నీరు సమీపంలోని అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి పోటెత్తింది. ఆ నీటిని మోటర్ల సాయంతో తోడేస్తున్నారు. దుకాణాలు, ఆస్పత్రుల్లో వరద నీరు చేరడంతో ఫర్నిచర్ దెబ్బతింది. కాగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షం పడింది.

గణేశ్ విగ్రహం కొనడానికొచ్చి చిక్కుకొని..



కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి పేట మండలం లింగంపల్లి కలాన్ గ్రామానికి చెందిన ఎనిమిది మంది బాలురు బుధవారం ఉదయం గణేశ్ విగ్రహం కొనుగోలు చేసేందుకు హవేళిఘణపూర్‌కు బయలుదేరారు. అప్పటికే నాగాపూర్ గేట్ వద్ద మెదక్-బోధన్ రహదారిపై వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వారు తిరిగి ఇంటికి బయలుదేరారు. వెనక్కి వచ్చేసరికి పోచమ్మరాల్ గ్రామం వద్ద పోచారం డ్యాం నుంచి వచ్చిన వరద ఉధృతికి రోడ్డు తెగిపోయింది. ఫలితంగా సొంతూరికి వెళ్లే మార్గం లేక పోచమ్మరాల్‌లో బంధువుల ఇంటి వద్ద ఉన్నారు. శుక్రవారం వరద ఉధృతి కాస్త తగ్గడంతో ఆర్మీ రెస్క్యూ టీం వారిని తాళ్లు, పడవల సాయంతో రోడ్డుకు అటువైపు కామారెడ్డి జిల్లాకు తరిలించేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. దీంతో, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ వారిని మెదక్‌లోని పునరావాస కేంద్రానికి తరిలించారు. నీటి ప్రవాహం తగ్గిన తరువాత వారి స్వగ్రామానికి తరిలిస్తామని చెప్పారు.

తేలికపాటి వర్షాలు

రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అన్ని జిల్లాల్లోనూ గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు కామారెడ్డి జిల్లా గాంధారిలో అత్యధికంగా 23 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లా ముగ్పాల్‌లో 21, నిర్మల్ జిల్లా ముధోల్, కామారెడ్డి జిల్లా బాన్సువాడలలో 18, నిజామాబాద్ జిల్లా సిరికొండలో 17 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డు అయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.


నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలో పంట పొలాల్లో ఇసుక మేట


కామారెడ్డి జిల్లా క్యాసంపల్లి వద్ద కుంగిన జాతీయ రహదారి


బురదతో పాడైన వస్తువులను బయట ఉంచిన జీఆర్‌కాలనీవాసులు


మంచిర్యాల జిల్లా సుందరసాల వద్ద నీట మునిగిన పంటలు


నిజామాబాద్ జిల్లా భీంగల్, బడాభీంగల్ మధ్య తెగిపోయిన రోడ్డు

2 లక్షల ఎకరాల్లో పంట నష్టం

భారీ వర్షాలు, వరదలతో 13 జిల్లాల్లో దెబ్బతిన్న పంటలు


మెదక్ జిల్లాలో నేలకొరిగిన వరి పైరు

వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా

సమగ్ర సర్వే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతులకు పరిహారం

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. జూన్, జూలై నెలల్లో రైతులు పంటలు సాగు చేయగా.. అవి ఇంకా నిలదొక్కుకోక ముందే వానలు, వరదలకు కొట్టుకుపోతున్నాయి. ఇప్పటివరకు 13 జిల్లాల పరిధిలో సుమారు 2 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఒక్క కామారెడ్డి జిల్లాలోనే ఏకంగా 93,925 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వాస్తవానికి జూన్, జూలై నెలల్లో కాస్త వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.. ఆగస్టులో మాత్రం వర్షాలు దంచి కొడుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ఆగస్టులో రాష్ట్రవ్యాప్తంగా బలంగా విస్తరించడంతో.. కరువు తీరా వర్షాలు పడ్డాయని తొలివారంలో రైతులు సంతోషపడ్డారు. కానీ, ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు వారు బెంబేలెత్తిపోతున్నారు. రెండు రోజుల క్రితం కామారెడ్డి జిల్లాలో కురిసిన వర్షంతో అంతా అతలాకుతలం అయింది. ఊహించని విపత్తుతో భారీగా నష్టం జరిగింది. చెరువు కట్టలు తెగడం, రోడ్లు కొట్టుకుపోవడంతోపాటు కొన్ని పంటలు నామరూపాల్లేకుండా పోయాయి. మొత్తం 61,193 మంది రైతులకు ఈ నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక సర్వేలో తేలింది. కాగా, నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 41,098 ఎకరాల్లో, సిద్దిపేట జిల్లాలో 7 వేల ఎకరాల్లో, నిర్మల్ జిల్లాలో 12,283 ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో సుమారు 1500 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. దీంతోపాటు మెదక్, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జగిత్యాల, కరీంనగర్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కూడా పంటలు దెబ్బతిన్నాయి. ఈ 13 జిల్లాల్లో కలిపి సుమారు 2 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ నష్టం ఇంకా పెరిగే అవకాశాలున్నట్లు కూడా చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేయాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు కూడా జారీ చేసింది. వ్యవసాయ, రెవెన్యూ శాఖతోపాటు అనుబంధ శాఖల అధికారులు సర్వే నిర్వహించాలని, పంట నష్టంపై సమగ్ర సమాచారం సేకరించాలని పేర్కొంది. అయితే 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం జరిగితేనే నష్ట పరిహారం చెల్లించే అవకాశాలున్నాయి. గతంలో కూడా ఇదే నిబంధన పాటించారు.


కామారెడ్డి జిల్లాలో వరదలతో కొట్టుకుపోయిన పత్తి

ఎకరానికి రూ.10 వేల పంట నష్టం..

ప్రస్తుతం రాష్ట్రంలో పంటల బీమా పథకమేదీ అమలులో లేదు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నష్టపరిహారం చెల్లిస్తూ వస్తోంది. అదేక్రమంలో ఇప్పుడు కూడా ఎకరానికి రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించనుంది. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం 2 లక్షల ఎకరాలకు నష్టపరిహారం చెల్లించటానికి రూ. 200 కోట్ల నిధులు అవసరమవుతాయి. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జరిగిన పంట నష్టంపై సమగ్ర నివేదిక తయారు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టినందున.. అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించాలని అన్నారు. శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లతో తుమ్మల మాట్లాడారు. గోదావరి వరద ప్రవాహ ఉధృతి పెరగడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశారు. జిల్లాలలోని రిజర్వాయర్లు, నీటి ప్రాజెక్టులపై ఆరా తీశారు. వరద ఉధృతి పెరిగి వాగులు, కల్వర్టుల దగ్గర నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


పగుళ్లు వచ్చిన చోట బిగించిన స్ర్కూలు

సచివాలయానికి 'స్ర్కూ' ఫిట్టింగ్!

» వానలకు జీఎఫ్‌ఆర్‌సీ ఫ్రేమ్‌లు ఊడకుండా అమరిక

» పగుళ్లు వచ్చిన చోట సైతం స్ర్కూలను బిగించిన వైనం

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయం లోపలివైపు గోడలకు ఎటు చూసినా 'స్ర్కూ' ఫిట్టింగ్‌లే కనిపిస్తున్నాయి. వానలకు జీఎఫ్‌ఆర్‌సీ(గ్లాస్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్) ఫ్రేమ్‌లు ఊడిపడకుండా 'స్ర్కూ'లతో బిగిస్తున్నారు. అంతేకాదు.. గోడలకు పగుళ్లు వచ్చిన చోట కూడా మరమ్మతులు చేయకుండానే.. స్ర్కూలను అమర్చుతుండడం గమనార్హం. రాష్ట్ర పాలనకు గుండెకాయలాంటి సచివాలయంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఐదో అంతస్తు నుంచి, జూలైలో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తు కిటికీ వరకు అమర్చిన జీఎఫ్‌ఆర్‌సీ రెయిలింగ్ ఊడిపడిన విషయం తెలిసిందే. ఆయా సమయాల్లో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదాలు జరగలేదు. ఫిబ్రవరిలో జరిగిన ప్రమాదంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు ఘటనపై విచారణ కోసం ఒక కమిటీని నియమించారు. "సచివాలయంలో చాలా చోట్ల పగుళ్లున్నాయి. కొన్ని పిల్లర్లకు అమర్చిన డిజైన్ ఫ్రేమ్స్‌కూ పగుళ్లు వచ్చాయి. బయట అందంగా కనిపించేందుకు అంతస్తుల వారీగా పెట్టిన రెయిలింగ్‌లకు లోపలివైపు నట్లు బిగించి ఉన్నాయి. వర్షపు నీరు లోపలికి చేరడంతో ఆ నట్లు తుప్పు పట్టి.. ఒక చోట జీఎఫ్‌ఆర్‌సీ ఫ్రేమ్ ఊడి పడింది" అని పేర్కొంటూ ఆ కమిటీ నివేదిక ఇచ్చింది. ఇప్పుడు ఆ ఫ్రేమ్‌లే వానలకు తడిసి ఊడిపోతున్నాయి. జాగ్రత్త చర్యల్లో భాగంగానే నిర్మాణ సంస్థే జీఆర్‌సీ ఫ్రేమ్‌లు ఊడిపోకుండా ఉండేలా 'స్ర్కూ'లను బిగిస్తున్నట్టు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

కాళేశ్వరంపై పీపీటీ ఇచ్చేందుకు అవకాశమివ్వండి

» అసెంబ్లీ స్పీకర్‌ను కలిసి కోరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు శనివారం నుంచి ప్రారంభంకానున్న సందర్భంగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కలిశారు. శాసనసభ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చలో భాగంగా బీఆర్‌ఎస్‌ఎల్పీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా వివరించే అవకాశాన్ని కల్పించాలని కోరుతూ శుక్రవారం స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేపీ వివేకానంద అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ ప్రజాసమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. తమ పార్టీని ఇబ్బంది పెట్టేందుకే ఘోష్ కమిషన్‌ను అడ్డంపెట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

రైతులు, పేదలపై ఎందుకింత పగ?: కవిత

"కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ కోసం దుర్మార్గానికి పాల్పడతారా? ముఖ్యమంత్రిగారూ.. రైతులు, పేదలపై మీకు ఎందుకింతపగ" అంటూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా కానుకుర్తి గ్రామంపైకి అర్ధరాత్రి పోలీసులను పంపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నామని ఎక్స్ వేదికగా ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి నిరంకుశ చర్యలకు స్థానం లేదనే విషయాన్ని గుర్తించాలని.. మీ డ్రీమ్ ప్రాజెక్టు కోసం ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

పల్లె వెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డు

» ఆమేరకు చార్జీల వసూలుతో ప్రయాణికులపై భారం



హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలోని కొందరు అధికారుల తీరు ప్రయాణికులపై అదనపు భారం మోపుతోంది. పల్లె వెలుగు బస్సులకు ఇష్టానుసారంగా ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి తిప్పుతూ ప్రయాణికుల నుంచి ఆమేరకు చార్జీలు వసూలు చేస్తున్నారు. మరో వైపు పల్లె వెలుగు బస్సు వస్తోంది.. ఆపుతారని భావిస్తే ఎక్స్‌ప్రెస్ అని ఉండటంతో కొన్ని బస్టాపుల్లో ఆపకుండానే దూసుకుపోతున్నారు. దీంతో ప్రయాణికులకు నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పల్లె వెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి తిప్పడం పట్ల విమర్శలు వస్తున్నాయి. "పల్లె వెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి తిప్పుతున్నమాట వాస్తవమే. అయితే కొత్త బస్సులు సర్దుబాటు అయిన డిపోల్లో అలాంటి చర్యలు నిలిపివేశాం"అని ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు.

కాంగ్రెస్ సర్కార్‌ది ఆర్థిక దుష్ప్రచారం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతినెలా రూ.7,000 కోట్ల రుణవడ్డీ చెల్లిస్తున్నామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక దుష్ప్రచారానికి పాల్పడుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు గత కేసీఆర్ ప్రభుత్వంపై అబద్ధాలు చెబుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ వాదన తప్పని కాగ్ నివేదిక తేల్చిందని ఎక్స్ వేదికగా ఆయన వెల్లడించారు. వాస్తవానికి గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమేనని తెలిపారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు.

బావమరిది కంపెనీలకు అక్రమంగా కాంట్రాక్టులు

» రేవంత్‌పై ఈడీకి బీఆర్‌ఎస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి బావ మరిదికి చెందిన 'శోధ కన్‌స్ట్రక్షన్', 'కేఎల్‌ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ'లకు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టులు ఇస్తోందని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఆ కంపెనీలకు, ముఖ్యమంత్రికి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయన్నారు. ఈ మేరకు కంపెనీలతో పాటు రేవంత్‌పై విచారణ జరిపించాలని శుక్రవారం ఢిల్లీలో ఈడీ అధికారులను కలిసి క్రిశాంక్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. "2022లో కేవలం రూ.7,13,113 ఆర్థిక లావాదేవీలున్న శోధ కన్‌స్ట్రక్షన్స్‌కు అమృత్ టెండర్లు, సింగరేణి మైనింగ్ కాంట్రాక్టు, డిండి ఇరిగేషన్ కాంట్రాక్టు ఇవ్వడంపై విచారణ చేపట్టాలి. ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీకి చెందినదే. ఆయన అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే శోధ కంపెనీకి రూ.1,137కోట్లఅమృత్ కాంట్రాక్టు, రూ.115కోట్ల సింగరేణి మైనింగ్ కాంట్రాక్టు, రూ.365కోట్ల డిండి కాంట్రాక్టులను నిబంధనలకు విరుద్ధంగా అప్పగించారు. అలాగే, కేఎల్‌ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీకి ప్రభుత్వం అనేక లాభాలు చేకూర్చింది. రూ.168 కోట్ల మిషన్ భగీరథ కాంట్రాక్టు, రూ.191 కోట్ల పాలేరు రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, రూ.319 కోట్ల రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కాంట్రాక్టులను అప్పగించారు' అని క్రిశాంక్ ఆరోపించారు.

పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలి: జాజుల

హైదరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపుదల అంశంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో చట్టబద్ధంగా బీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచని పక్షంలో బీసీ కుల గణనకు అర్థం ఉండదన్నారు.

కాళేశ్వరం కేసును సీబీఐకి ఇవ్వాలి

» వరద సహాయక చర్యల్లో సర్కార్ విఫలం

» అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తాం

» బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

» కాళేశ్వరం అవినీతి సొమ్మంతా విదేశాలకు!: పాయల్ శంకర్

హైదరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి వ్యవహారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు కోరాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులో పెద్దఎత్తున అవినీతి జరిగిందంటూ ఎన్నికల ముందు ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లయినా ఎందుకు నిందితులపై చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమల్లో వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో అంశాన్ని తెరపైకి తీసుకువస్తోందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శుక్రవారం, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన తొలి సారిగా ఈ సమావేశం జరిగింది. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని పార్టీ శాసనసభాపక్ష కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. 420 హామీలతో పాటు 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చేసిన ప్రకటనను పూర్తిగా విస్మరించారని ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. 'ప్రజల సమస్యల నుండి దృష్టి మళ్లించడానికి కొత్త కొత్త అంశాలను తెరపైకి తీసుకువచ్చి నాటకాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్షకోట్ల అవినీతి జరిగిందని గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పదేపదే ఆరోపణలు చేసింది. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి సొమ్మును రికవరీ చేసి ఆ సొమ్ముతో సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ప్రస్తుత సీఎం, నాడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ, దాదాపు 2 సంవత్సరాల పాలన గడిచినా ఇప్పటివరకు అవినీతిపరులపై కేసులు నమోదు చేయలేదు. ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదు'అని ఆరోపించారు. ఉత్తర తెలంగాణాలో భారీ వర్షాలు- వరదలతో అపారనష్టం జరిగిందని ఆయన పేర్కొంటూ సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ అంశంపై కూడా అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

దోషులకు శిక్షలు ఎప్పుడు?

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విచారణ కమిషన్ నివేదికకే 20 నెలలు పడితే ఇక దోషులకు ఎప్పుడు శిక్ష పడుతుందని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో సొమ్మంతా విదేశాలకు తరలిపోయిందని ఆయన ఆరోపించారు. ఈ సొమ్మును వెనక్కి తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని దర్యాప్తు సంస్థలకు సాధ్యం కాదని పేర్కొంటూ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నట్లు శంకర్ చెప్పారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయడానికి ఏ చట్టాలు అడ్డు వస్తున్నాయని ఆయన కాంగ్రెస్‌ను ప్రశ్నించారు.





గజ్వేల్‌లో ఏవో నాగరాజు కాళ్లు మొక్కేందుకు యత్నిస్తున్న రైతులు; భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం నిజాంపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కొరత.. రైతన్న వెత

దుకాణాలు, పీఏసీఎస్‌ల వద్ద అవే పడిగాపులు... పలు చోట్ల రైతుల రాస్తారోకోలు, ధర్నాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో యూరియా కొరత సమస్య కొనసాగుతోంది. అక్కడక్కడా సరఫరా జరుగుతున్నా.. సరిపడా నిల్వలు అందుబాటులో లేక రైతుల అవసరం తీరడం లేదు. ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్ కేంద్రాల వద్ద భారీ క్యూలైన్లు, తోపులాటలు కొనసాగుతున్నాయి. యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు చివరికి రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా, మెదక్ జిల్లాలోని పలు మండలాల్లోని ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్ కేంద్రాల వద్ద శుక్రవారం తెల్లవారుజాము నుంచే రైతులు బారులు తీరారు. కొన్నిచోట్ల ఒక్కో బస్తా చొప్పున మాత్రమే పంపిణీ చేశారు. గజ్వేల్‌లో ఆందోళనకు దిగిన రైతులు వ్యవసాయాధికారి కాళ్లు మొక్కి యూరియా ఇవ్వాలని వేడుకున్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం నిజాంపేట గ్రామంలోని పీఏసీఎస్ ఉపకేంద్రంలో తీవ్ర గందరగోళం మధ్య రైతులకు సుమారు 450 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. ఇక, యూరియా కొరతకు నిరసనగా మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లోని హైవేపై పెద్ద సంఖ్యలో రైతులు దాదాపు గంట సేపు బైఠాయించారు. వనపర్తి జిల్లా అమరచింత ఆగ్రో రైతు సేవా కేంద్రానికి శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే రైతులు క్యూ కట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరులో ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్ద రైతులు గంటల తరబడి నిరీక్షించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి వద్ద ఉన్న డీసీఎంఎస్ వద్ద గంటల తరబడి వేచి చూసిన రైతులు యూరియా రాదని అధికారులు చెప్పడంతో రాజీవ్‌రహదారిపై రాస్తారోకో చేశారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేటలోని రైతు నేస్తం దుకాణంలో తోపులాట మధ్య రైతులకు యూరియా పంపిణీ జరిగింది. పెద్దపల్లి జిల్లా ధర్మారం, జూలపల్లి, కాచాపూర్‌లో కొంతమేర యూరియా బస్తాల పంపిణీ జరగ్గా.. ఎరువులు దక్కని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జూలపల్లిలోని ఎరువుల పంపిణీ ప్రాంతానికి సంఘం పరిధిలోకి రాని అబ్బాపూర్ రైతులు రావడంతో గందరగోళం నెలకొంది. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి సహకార సంఘం కార్యాలయం ముందు యూరియా బస్తాల కోసం రైతులు ఆందోళన చేశారు.

ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి

మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే మురళీనాయక్ క్యాంపు కార్యాలయం ముట్టడికి రైతులు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రహదారిపై బైఠాయించారు. మానుకోట మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. వికారాబాద్ జిల్లా పరిగి ఆగ్రోస్ కేంద్రానికి వచ్చిన రైతులకు యూరియా లేదని చెప్పడంతో రోడ్డెక్కి నిరసనకు దిగారు. ఈ నిరసనకు బీఆర్‌ఎస్ శ్రేణులు మద్దతు పలకగా.. పోలీసుల రాకతో వాగ్వాదం జరిగింది. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వికారాబాద్ జిల్లా ధారూర్‌లో పీఏసీఎస్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు దున్నపోతుతో వినూత్న నిరసన చేపట్టారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో అన్నదాతలు ధర్నా చేశారు. తలకొండపల్లి పీఏసీఎస్ గోదాం వద్ద స్థానిక సీఐ నందీశ్వర్‌రెడ్డి రైతులతో కలిసి నిరసన తెలిపారు.

రెండ్రోజుల్లో రాష్ట్రానికి 21,325 టన్నుల యూరియా!

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

» అదనపు కోటా కోసం కేంద్రానికి లేఖ



హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండ్రోజుల్లో రాష్ట్రానికి 21,325 టన్నుల యూరియా వస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వివిధ కంపెనీల నుంచి రాష్ట్రానికి వచ్చే యూరియా రైల్వే రేక్ పాయింట్లు అయిన గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్‌నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లి ప్రాంతాలకు చేరుకుంటుందని తెలిపారు. అక్కడి నుంచి డిమాండ్ ఉన్న జిల్లాలకు యూరియా తరలిస్తామని వెల్లడించారు. అలాగే, సెప్టెంబరు మొదటి వారంలోపు వివిధ పోర్టుల ద్వారా మరో 27,950 టన్నుల యూరియా వస్తుందన్నారు. ఇక, రైతుల అవసరాలు తీర్చేందుకు సెప్టెంబరులో రాష్ట్రానికి అదనపు యూరియా కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేస్తూ కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు రాష్ట్ర మంత్రి తుమ్మల శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రంలో వరి పంటకు మొదటి, రెండో విడతల యూరియా వేస్తున్నారని, త్వరలో మూడో విడతతో పాటు కాంప్లెక్స్ ఎరువుల వాడకం కూడా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కేవలం వరి పంటకే సెప్టెంబరు నెలలో 2.81 లక్షల టన్నుల యూరియా అవసరమవుతుందని వివరించారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్రానికి 2.38 లక్షల టన్నుల లోటు ఏర్పడిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30వేల టన్నుల యూరియా ఉందని, రోజుకు 9 వేల నుంచి 11 వేల టన్నుల వరకు అమ్మకాలు వుతున్నాయనిపేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి అదనంగా 2.38 లక్షల టన్నుల యూరియా కేటాయించాలని కోరారు. సెప్టెంబరు నెలకు ఇప్పటికే ఆమోదించిన 1.50 లక్షల టన్నుల సరఫరాకు తోడుగా ఈ అదనపు కేటాయింపును మంజూరు చేయాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు.

ఇతర బేసిన్లకు కృష్ణా జలాల తరలింపును అడ్డుకోండి

పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, హంద్రీనీవా, వెలిగొండను కట్టడి చేసేలా ఉత్తర్వులివ్వండి

కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు

వచ్చే నెల 23 నుంచి 25దాకా తదుపరి విచారణ

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇతర బేసిన్లకు కృష్ణా జలాలను మళ్లించకుండా కట్టడి చేయాలని, ఏపీలోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ, ముచ్చుమర్రి, హంద్రీనీవా సుజల స్రవంతి, వెలిగొండ ఔట్‌లెట్లను కట్టడి చేసేలా నిర్దిష్ట ఆంక్షలు విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్-2)ను తెలంగాణ కోరింది. రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపై విచారణ జరుపుతున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట శుక్రవారం తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. బచావత్ ట్రైబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా సాగుతున్న నీటి తరలింపును అడ్డుకునేలా కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ)కు తగిన అధికారాలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలవరం వాటాలో దక్కిన 45 టీఎంసీల్లో 30టీఎంసీలను శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్‌ఎల్‌బీసీ)కి కేటాయిస్తూ 1982లో జీవో 306 జారీ అయిందని, 1986లో కేంద్ర జలవనరుల సంఘాని(సీడబ్ల్యూసీ)కి డీపీఆర్‌ను సైతం సమర్పించారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణకు ముందు 2013లోనూ 30 టీఎంసీలు ఎస్‌ఎల్‌బీసీకి, 15టీఎంసీలు తాగునీటి అవసరాల కోసం కేటాయించాలని రాష్ట్ర స్థాయి సలహామండలి సిఫారసు చేసిందని నివేదించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) ద్వారా తెలంగాణకు 15.9 టీఎంసీల కేటాయింపులు ఉండగా..ఆధునికీకరణ చేపట్టకపోవడంతో ఏటా 5.4టీఎంసీలను కూడా వినియోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు. బచావత్, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునళ్లు మిగులు జలాలను ఉపయోగించుకునే స్వేచ్ఛ ఉమ్మడి ఏపీకి మాత్రమే ఇవ్వగా, దాని పేరిట 16.30 లక్షల ఎకరాలకు ఏపీ సాగునీటిని అందిస్తోందన్నారు. శ్రీశైలం, పులిచింతల జలాశయాల్లో ఆవిరి నష్టాల కింద 11 టీఎంసీలు, 5 టీఎంసీలు పొదుపు చేస్తున్నామని, ఆ నీటిని తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించాలని కోరారు. కాగా, ట్రైబ్యునల్ తదుపరి విచారణ సెప్టెంబరు 23 నుంచి 25 దాకా జరగనుంది.

రక్తహీనత నివారణలో ఏపీ టాప్

» హరియాణా, తెలంగాణకు ద్వితీయ, తృతీయ స్థానాలు

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత నివారణ చర్యల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ప్రథమ స్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రక్తహీనత నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత రాష్ట్రాలు తీసుకున్న చర్యలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సమీక్షించింది. ఐఎఫ్‌ఏ మాత్రలు, సిరప్ పంపిణీ ప్రాతిపదికన రాష్ట్రాల వారీగా ర్యాంకులను ప్రకటించింది. ఇందులో ఏపీ, హరియాణా, తెలంగాణ రాష్ట్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు లభించాయి. ఆరు కేటగిరీలకు గాను ఐదు కేటగిరిల్లో ఏపీ తొలిస్థానాన్ని దక్కించుకుంది.

రూ.కోటి పరిహారం ఇవ్వలేదు!

మృతులకు తలా రూ.25 లక్షలే చెల్లించారు.. మిగతాది ఎప్పుడు చెల్లిస్తారో చెప్పలేదు

» సిగాచీ ఔషధ పరిశ్రమ మృతులు 54

» జాడ తెలియని 8 మందీ మరణించినట్లే

» కంపెనీ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగింది

» ప్రమాదంపై హైకోర్టులో ప్రభుత్వం కౌంటర్

» విచారణ వచ్చే నెల 16కి వాయిదా

హైదరాబాద్, పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో జూన్ 30న జరిగిన సిగాచీ ఔషధ ఫ్యాక్టరీలో జరిగిన భారీ పేలుడుకు యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఈ సంఘటనలో ఇప్పటివరకు 54 మంది మరణించినట్లు నిర్ధారించింది. సంఘటనకు కారకులైన వ్యక్తులుగా ఇంకా ఎవరికీ అరెస్టు చేయలేదని చెప్పింది. దుర్ఘటనపై హైకోర్టు ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శుక్రవారం కౌంటర్ దాఖలు చేశారు. ఘటనా స్థలంలో, తర్వాత చికిత్స పొందుతూ మొత్తం 46 మంది చనిపోయారని, మరో 8 మంది జాడ తెలియకుండా పోయారని తెలిపారు. జాడ తెలియకుండా పోయిన వారిని కూడా మరణించినట్లుగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. మృతులకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వడానికి అంగీకరించిన కంపెనీ యాజమాన్యం మొత్తం 54 మందికి ఇప్పటిదాకా రూ.25 లక్షల చొప్పున చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన పరిహారం ఎప్పట్లోగా ఇస్తారో గడువేమీ చెప్పలేదన్నారు. ప్రభుత్వం తరఫున సంఘటన జరిగిన రోజే మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున, కనిపించకుండా పోయిన వారి కుటుంబాలకు రూ.2.40 లక్షలు, గాయపడిన 28 మందికి రూ.50 వేల చొప్పున పరిహారం అందించినట్లు చెప్పారు. ఈ సంఘటనలో చనిపోయిన కుటుంబాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు సీఎస్ హైకోర్టుకు తెలిపారు. ఘటన వెనుక కారణాలు తెలుసుకోవడం, సలహాలు, సూచనలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ, హైపవర్ కమిటీని నియమించిందని చెప్పారు. నిపుణుల కమిటీ మధ్యంతర నివేదిక అందజేసిందని, హైపవర్ కమిటీ నివేదిక ఇంకా అందాల్సి ఉందని తెలిపారు. చనిపోయిన 46 మందిలో 43 మంది మరణ ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేశామని, మరో ముగ్గురివి పెండింగ్‌లో ఉన్నాయని, కనబడకుండా పోయిన 8 మంది మరణ ధ్రువీకరణ పత్రాలు కూడా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డ్రైయర్‌లో ఔషధ పదార్థ ధూళి మేఘం ఏర్పడి, ప్రమాదకర పేలుడు సంభవించిన విషయంలో కంపెనీ నిర్లక్ష్యం కనబడుతోందని ప్రాథమికంగా తేలిందని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ మధ్యంతర నివేదిక సైతం ధ్రువీకరించిందని తెలిపారు. కంపెనీ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఇప్పటివరకు ఎలాంటి అరెస్టులు జరగలేదని, దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. బాధితులకు వేగంగా పరిహారం అందించాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని, కేసు విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని కోరుతూ విశ్రాంత శాస్త్రవేత్త కలపల బాబూరావు వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కౌంటర్ వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టినపుడు ప్రభుత్వ కౌంటర్‌కు స్పందించేందుకు సమయం కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వసుధా నాగరాజ్ కోరారు. దాంతో విచారణ వచ్చే నెల 16కు వాయిదా పడింది.

బంజారా, లంబాడా, సుగాలీలు గిరిజనులు కారు

వారిని ఎస్టీల జాబితానుంచి తొలగించాలి

సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమని, వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపూరావుతోపాటు మరికొందరి తరఫున సీనియర్ న్యాయవాది అల్లంకి రమేశ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉత్తర్వుల సవరణ చట్టం - 1976 మేరకు ఆ మూడు వర్గాలను ఎస్టీలుగా గుర్తించడం ఆర్టికల్ 342ని ఉల్లంఘించడమేనని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. బంజారా, లంబాడాలు, సుగాలీలు గిరిజనులు కాదని, 1976 వరకు పాత ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వలస వచ్చి అక్కడి అసలైన గిరిజనులకు ఉద్దేశించిన హక్కులను కొల్లగొట్టారని వెల్లడించారు. అంతకుముందు వారు బీసీ జాబితాలో ఉన్నారన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన సందర్భంలో ఆంధ్రా ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉందని, ఆ సమయంలో లంబాడా, సుగాలీలను ఆంధ్రా ప్రాంతంలో ఎస్టీలుగా గుర్తించారని, కానీ హైదరాబాద్ స్టేట్‌లో కాదని తెలిపారు. కాసు బ్రహ్మానంద రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో ఒక రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఒక కులానికి చెందిన వారు ఎస్టీలు, మరికొన్ని జిల్లాల్లో బీసీలుగా ఉండడం సరికాదని ఆ మూడు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారని పిటిషన్‌లో వెల్లడించారు. ఇప్పుడు మళ్లీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయాయని , తెలంగాణలోని బంజారా, లంబాడా, సుగాలీలను బీసీ సామాజిక వర్గంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది అల్లంకి రమేశ్ హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 9వ తేదీకి వాయిదా వేసింది.

'మత్స్య అభివృద్ధి' స్కీముపై విచారణ చేపట్టాలి

» సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్య సంపద అభివృద్ధి కోసం రూ.1000కోట్లతో ప్రారంభించిన 'సమీకృత మత్స్య సంపద అభివృద్ధి' పథకంపై సమగ్ర విచారణ జరిపించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) కోరింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో మత్స్య సంపద, మత్స్యకారుల అభివృద్ధి కోసం ఉద్దేశించిన ఈ స్కీము కింద ఫిష్ పాండ్‌లను నిర్మించలేదని, ఎనిమిదేళ్లుగా ప్రైవేటు సంస్థల నుంచి చేప పిల్లలను కొనుగోలు చేయడం వల్ల నాణ్యత లోపించి, ఆశించిన ఫలితాలు రాలేదని తెలిపింది. ఈ స్కీములో లోపాల కారణంగా లబ్ధిదారులకు లాభం లేకుండా పోయిందని, విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

ఆర్‌డీసీ ఎండీగా మోహన్ నాయక్

హైదరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఆర్‌డీసీ)కు మేనేజింగ్ డైరెక్టర్‌గా జే.మోహన్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం రోడ్లు, భవనాల శాఖలో రహదారుల చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న మోహన్ నాయక్‌కు ఆర్‌డీసీ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.